ప్రజాజ్యోతి

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | మంగళవారం 03 నవంబర్ 2026 | సంపుటి: 19 | సంచిక: 247 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , కార్తీక మాసము , తిథి: నవమి - 11:56:33 వరకు నక్షత్రంమాఘ - 27:27:08 వరకు కరణంగర - 11:56:33 వరకు, వణిజ - 23:27:51 వరకు పక్షంకృష్ణ యోగంశుక్ల - 09:53:39 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com

భారత 29వ వైమానిక దళాధిపతిగా అశుతోష్ దీక్షిత్

బాధ్యతలు చేపట్టిన ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్

న్యూఢిల్లీ, నవంబర్ 02(ప్రజాజ్యోతి): భారత 29వ వైమానిక దళాధిపతిగా ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు చేపట్టారు. దేశానికి 42 సంవత్సరాల పాటు విశిష్ట సేవలందించిన ఎయిర్ చీఫ్ మార్షల్ ఎపి సింగ్ స్థానంలో అశుతోష్ దీక్షిత్ నియమితులయ్యారు. రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ కొత్తగా నియమితులైన

మిగతా 2లో..

విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు శుభవార్త

కరువు భత్యం డీఏ 2.543 శాతం పెంచిన ప్రభుత్వం

హైదరాబాద్, నవంబర్ 02(ప్రజాజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ రంగ ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు శుభవార్త అందించింది. కరువు భత్యం డీఏను 2.543 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రస్తుతం 19.272 శాతంగా ఉన్న డీఏ 21.815 శాతానికి చేరుకుంది. ఈ పెంపు

మిగతా 2లో..



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడం లేదని, రాష్ట్రాన్ని ఏటీఎంగా మార్చుకుని 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. రేవంత్ రెడ్డి ద్వారా రాహుల్ గాంధీకి ఈ ట్యాక్స్ వెళుతోందని వ్యాఖ్యానించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అనేక రాష్ట్రాల్లో అధికారం కోల్పోయిందని, ఆ పార్టీ వెంటిలేటర్‌పై ఉందని విమర్శించారు. రాహుల్ గాంధీ కాంగ్రెస్‌ను కాపాడలేరని అన్నారు. తెలంగాణ నుంచి కూడా కాంగ్రెస్‌ను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన బీజేపీ మహా పాదయాత్ర ముగింపు సభలో అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు.

రాష్ట్రంలో ఆర్ఆర్ ట్యాక్స్

- ఇక్కడి ట్యాక్స్ ఎవరి జేబుల్లోకి వెళ్తోంది?
- తెలంగాణను కాంగ్రెస్ ఏటీఎంగా మార్చారు..
- ఆరు గ్యారెంటీలను అమలు చేయడం లేదు
- హైదరాబాద్ నుంచి సవాల్ విసురుతున్నా..
- ఎస్ఐఆర్, ఈవీఎంపై చర్చకు రాహుల్ సిద్ధమా?
- రాహుల్ గాంధీ జీవితంలో ప్రధాని కాలేడు
- నకిలీ ఓట్లు తొలగిస్తుంటే కడుపునొప్పి ఎందుకు..?
- భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి..
- విపక్షాల అరాచకత్వాన్ని అంతం చేయాలి
- తెలంగాణలో బీజేపీ సర్కారు రావాలా.. వద్దా?
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెల్లడి
- హైదరాబాద్‌లో మహా పాదయాత్ర ముగింపు సభ
- పాదయాత్రలో కదం తొక్కిన కమల దళం..
- త్రివర్ణ పతాకం చేతబూని షా పాదయాత్ర
- భాగ్యలక్ష్మి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు



హైదరాబాద్, నవంబర్ 02(ప్రజాజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి దోపిడీ పెరిగిపోయిందని అమిత్ షా ధ్వజమెత్తారు. "ఇక్కడి ఆర్ఆర్ ట్యాక్స్ ఎవరి జేబుల్లోకి వెళ్తోంది? రాహుల్ కోసమే ఇక్కడ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా విమర్శించారు. కాంగ్రెస్ చేస్తున్న ఈ అవినీతిని అసదుద్దీన్ ఒవైసీ ఆపగలరా? లేక బీఆర్ఎస్ ఆపుతుందా? కాంగ్రెస్ అవినీతిని అడ్డుకునే సత్తా కేవలం భారతీయ జనతా పార్టీకి మాత్రమే ఉంది" అని అమిత్ షా స్పష్టం చేశారు. పేదలు, రైతులు, నిరుద్యోగ యువత పక్షాన బీజేపీ నిరంతరం పోరాడుతుందని, రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ప్రజలంతా అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే దేశాన్ని త్వరలోనే డ్రగ్స్ రహిత భారత్‌గా తీర్చిదిద్దడమే మోదీ ప్రభుత్వ లక్ష్యమని, కీలక సమయాల్లో బాధ్యత విస్మరించి

మిగతా 2లో..

అమిత్ షాను కలిసిన చిరంజీవి, రామ్ చరణ్

మైహోమ్ గ్రూప్ అధినేత జూపల్లి సైతం భేటీ

హైదరాబాద్, నవంబర్ 02(ప్రజాజ్యోతి): హైదరాబాద్ పర్యటనలో ఉన్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో పలువురు ప్రముఖులు వరుసగా భేటీ అవుతున్నారు. ఇందులో భాగంగా సినీ, రాజకీయ వర్గాల్లో అమితాసక్తిని రేకెత్తించే ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ బేగంపేటలోని హోటల్ ఐటీసీ కాకతీయకు

మిగతా 2లో..



సంక్షోభంలోనూ భారత్ ఆర్థికవృద్ధి

గ్రీన్ ఎనర్జీ వల్లే ఆర్థిక సంక్షోభం నుండి గట్టెక్కాం

భారత్‌లో రాజకీయ సుస్థిరత అద్భుతం

సూర్య ఘర్ తో 65 లక్షల ఇళ్లకు ప్రయోజనం

అన్నదాతలను ఇంధనదాతలుగా మారుస్తాం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, నవంబర్ 02(ప్రజాజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన ఆర్థిక సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ భారత్ వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని వేగవంతమైన వృద్ధిని కొనసాగిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. గడిచిన పదేళ్ల కాలంలో దేశం స్వచ్ఛ ఇంధన రంగంలో సరైన మౌలిక వసతులు, వ్యవస్థలను అభివృద్ధి చేసుకోకపోయి ఉంటే పరిస్థితి అత్యంత దారుణంగా ఉండేదని ఆయన హెచ్చరించారు.

మిగతా 2లో..

దీపావళి రోజు బాణాసంచా కాల్చుకోవచ్చు

రాత్రి 8-10గంటల వరకు మాత్రమే అనుమతి

కాలుష్యంపై ఎప్పటికప్పుడు సమీక్ష జరగాలి

బాణాసంచా కాల్చడంపై సుప్రీంకోర్టు ఆదేశాలు



న్యూఢిల్లీ, నవంబర్ 02(ప్రజాజ్యోతి): ఢిల్లీ- నేషనల్ కేపిటల్ రీజియన్ లో బాణాసంచా కాల్చడంపై దేశ అత్యున్నత న్యాయస్థానం తన నిర్ణయాన్ని వెల్లడించింది. నిబంధనలతో కూడిన అనుమతులను మంజూరు చేసింది. గ్రీన్ క్రాకర్స్ కాల్చుకోవడానికి సుప్రీంకోర్టు అంగీకరించింది. క్రాకర్స్ కాల్చడానికి టైమ్ ను సైతం నిర్ధారించింది. ప్రస్తుతం ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ గణనీయంగా పడిపోతోన్న ప్రస్తుత పరిస్థితుల్లో సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ నెల 7, 8 తేదీలలో

మిగతా 12లో..



మెట్రో రెండో దశకు 275 కోట్లు మంజూరు

కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, నవంబర్ 02(ప్రజాజ్యోతి): హైదరాబాద్ నగర ప్రజా రవాణా వ్యవస్థను మరింత విస్తరించే దిశగా మెట్రో రైలు రెండో దశ పనులకు సంబంధించి కీలక ఆర్థిక కేటాయింపు వెలుగులోకి వచ్చింది. మెట్రో అభివృద్ధి, ప్రాజెక్టు రుణాల చెల్లింపుల కోసం మొత్తం రూ.275 కోట్లను మంజూరు చేస్తూ పరిపాలనాపరమైన ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో రెండో దశ నిర్మాణ పనుల కోసం రూ.150 కోట్లు.. మెట్రో ప్రాజెక్టు రుణాల చెల్లింపుల కోసం మరో రూ.125 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధుల కేటాయింపు ద్వారా మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన

మిగతా 12లో..

రోడ్డు నిర్మాణ పనులు చేస్తుండగా కరెంట్ షాక్

షాక్‌తో 8 మంది రోడ్డు నిర్మాణ కూలీలు మృతి

రాజస్థాన్‌లో చోటుచేసుకున్న విషాద ఘటన

ఝుంఝును, నవంబర్ 02(ప్రజాజ్యోతి): రాజస్థాన్‌లో ఒక విషాదకరమైన సంఘటన చోటుచేసుకుంది. ఝుంఝును జిల్లాలోని ఛాపోలి గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండగా ఎనిమిది మంది కూలీలు విద్యుత్ షాక్‌తో ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం ఉదయం జరిగింది. ఉదయ్‌పూర్‌వాటి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఛాపోలి గ్రామంలో కదమ్ కుండ్

మిగతా 12లో..

రోడ్లపై చెత్త కనిపించకూడదు

హైదరాబాద్‌ను క్లీన్, ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దాలి

సిగ్నల్ ఫ్రీ ట్రాఫిక్ వ్యవస్థకు ప్రణాళికలు అవసరం

నిర్లక్ష్యంగా ఉంటే అధికారులపై చర్యలు తప్పవు

సిటీలో గ్రీన్‌వాటర్ సరఫరా మరింత విస్తరించాలి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ

అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్షసమావేశం

హైదరాబాద్, నవంబర్ 02(ప్రజాజ్యోతి): హైదరాబాద్ మహానగరాన్ని పూర్తిస్థాయిలో పరిశుభ్రమైన, ట్రాఫిక్ రహిత నగరంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. సోమవారం జూబ్లీహిల్స్ నివాసంలో మున్సిపల్, హెచ్ఎండీఏ ఉన్నతాధికారులతో ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. నగర వీధుల్లో ఎక్కడా చెత్త నిల్వలు కనిపించకూడదని, ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి వ్యర్థాల సేకరణ నిరంతరం జరగాలని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. నిర్మాణ రంగ వ్యర్థాలను తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు, పారిశ్రామిక వాడల్లో ఐలా అధికారులతో సమన్వయం

మిగతా 12లో..

ఈనెల 11 నుంచి కేటీఆర్ బస్సుయాత్ర..

29న 50వేల మందితో భారీ బహిరంగ సభ

సర్కార్‌కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరుబాట



హైదరాబాద్, నవంబర్ 02(ప్రజాజ్యోతి): తెలంగాణలో రాజకీయ కార్యకలాపాలు ఊపందుకుంటున్న వేళ బీఆర్ఎస్ ప్రజాక్షేత్రంలోకి వెళ్లేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో నవంబర్ 11వ తేదీ నుంచి బస్సు యాత్ర చేపట్టాలని నిర్ణయించింది. గోదావరి జలాలు, సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రధాన అంశాలుగా తీసుకుని ఈ యాత్ర సాగనుంది. మరోవైపు.. తెలంగాణ ఉద్యమంలోని కీలక ఘట్టమైన దీక్షా దివస్‌ను పురస్కరించుకుని నవంబర్ 29వ తేదీన భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సభకు సుమారు 50 వేల మందిని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మాజీ మంత్రి,

మిగతా 2లో..

సంపాదకీయం

కమలం ఎదురుదాడి!?

ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం పనితీరుపై విపక్షాలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నాయి. ప్రధానంగా సర్ ప్రక్రియ చుట్టూ తలెత్తిన వివాదాలే ఈ పరిణామానికి కారణంగా నిలిచాయి. ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలు, ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, పునరుద్ధరణ వంటి అంశాలపై ఎన్నికల కమిషన్‌లోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయని ఇటీవల మీడియాలో కథనాలు వెలువడ్డాయి. గత 10 నెలల వ్యవధిలోనే ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలపై కనీసం 14 సార్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు పేర్కొంది. ఇంకా కొన్ని సౌకర్యాలకు సంబంధించిన యాక్సెస్ కోసం గోవా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, ఢిల్లీలోని ఎన్నికల సంఘం అధికారులను 7 రోజుల్లో 8 సార్లు సంప్రదించినప్పటికీ స్పందన రాలేదని మరో నివేదికలో తెలిపింది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల సంఘం పనితీరుపై కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ తరుణంలో సర్ పై అటు విపక్షాలు ఇటు కేంద్ర ప్రభుతం మధ్య విమర్శలు తీవరమయ్యాయి. సీబీఐ, ఈడీలతో పనిజరగకపోవడంతో బీజేపీ ఏకంగా ఎన్నికల సంఘాన్ని వాడుకుంటూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని కాంగ్రెస్ సహా ఇండియా కూటమి నేతలు ఆరోపించారు. యువత, మహిళలు, దళితుల ఓట్లను మోదీ, అమిత్ షాలు లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ దేశ ద్రోహి అని, అతనిని అడ్డుపెట్టుకుని బీజేపీ ఓట్లు చీల్చుతోందని, ఆయనను తక్షణమే తొలగించాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. దేశ రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు "మోదీ హఠావో, దేశ్ బచావో" అంటూ నినదించారు.ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. "భారత ప్రజలు ఈ రోజు మోదీ, అమిత్ షాలకు స్పష్టమైన సందేశాన్ని ఇచ్చారు. 'మీ రోజులు ముగిసిపోయాయి. ఆ స్పష్టమైన సందేశం చాలా గట్టిగా, స్పష్టంగా చేరింది' అని అన్నారు. సరిహద్దుల వద్ద వారిని అడ్డుకోవడానికి ప్రయత్నించినప్పటికీ, ర్యాలీకి పది లక్షల మంది హాజరయ్యారు. ప్రజలు స్వయంగా తరలివచ్చారు, నేను భారత ప్రజలకు, ఇండీ కూటమి పార్టీలకు, ముఖ్యంగా 24/7 శ్రమిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాను" అని అన్నా రు. మరోవైపు ఢిల్లీలో ఇండియా కూటమి, బీజేపీ మధ్య పోటాపోటీ నిరసనలు హోరెత్తాయి. సీఈసీ రాజీనామా, ఎన్నికల సంస్కరణలకై ఇండియా కూటమి 'ఓట్ బచావో, దేశ్ బచావో' మెగా మార్చ్ నిర్వహించగా, 1984 సిక్కుల ఊచకోతకు వ్యతిరేకంగా బీజేపీ ప్రతి నిరసన చేపట్టింది. ఈ ర్యాలీలను జేపీ నడ్డా తీవ్రంగా విమర్శించారు, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా కుట్ర జరుగుతోందన్నారు.

ఇండియా కూటమికి ధీటుగా బీజేపీ కూడా ఢిల్లీలో నిరసన చేపట్టింది. 1984 సిక్కుల ఊచకోతకు నిరసనగా బీజేపీ పాదయాత్ర చేపట్టింది. సిక్కుల ఊచకోత బాధితులకు రాహుల్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో బీజేపీ నేతలతో పాటు సిక్కు సంఘాల ఆందోళన చేపట్టాయి. హరినగర్ బస్ డిపో నుంచి నిరసన ప్రదర్శన నిర్వహించారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన దారుణాలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసన ప్రదర్శనకు భారీగా తరలివచ్చారు సిక్కు సంఘాల ప్రతినిధులు.. హర్యానాలో కూడా బీజేపీ చీఫ్ నితీన్ నబీన్ నేతృత్వంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇదిలాఉంటే.. ఇండియా కూటమి మెగా ర్యాలీపై కేంద్రమంత్రి జేపీ నడ్డా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం పేరుతో దేశంలో అరాచకం సృష్టించే కుట్ర జరుగుతోందని, ఓడిపోయిన నేతలంతా రాజకీయ డ్రామా చేస్తున్నారని ఆరోపించారు. రాహుల్ ర్యాలీ వెనుక నాలుగు కుట్రపూరిత లక్ష్యాలున్నాయంటూ నడ్డా విమర్శించారు. ఢిల్లీలో అల్లర్లు సృష్టించి ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చడమే లక్ష్యమని ఆరోపించారు. పండుగల వేళ ఢిల్లీ వ్యాపారుల ఆదాయాన్ని దెబ్బతీసే కుట్ర జరుగుతుందన్నారు. అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ఠను దిగజార్చే ప్రయత్నమంటూ మండిపడ్డారు. ఎన్నికల్లో ఓటమి పాలైన నైరాశ్యంతో కాంగ్రెస్ ప్రజాస్వామ్య సంస్థలపై దాడి చేస్తోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ విమర్శించారు. వంశపారంపర్య పాలనను కాంగ్రెస్ ప్రోత్సహిస్తోందని, రాజ్యాంగ పరిరక్షకులుగా నటిస్తూ దాని నిబంధనలను బలహీనపరుస్తోందని ఆరోపించారు. విదేశీ శక్తుల ఆదేశాల మేరకు రాహుల్ గాంధీ పనిచేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. దేశంలో అస్థిరతను సృష్టించడానికి ప్రతిపక్షం ప్రయత్నిస్తోందని విమర్శించారు. 'ఇండీ' కూటమి ర్యాలీకి పోటీగా హరియాణాలో అధికార బీజేపీ చేపట్టిన ర్యాలీ పాల్గొన్న ఆయన ఈ మేరు వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టేందుకు 'లోక్‌తంత్ర్ బచావో, అరాచక్ హటావో' పేరిట బీజేపీ ర్యాలీలు నిర్వహించింది. ఈ క్రమంలోనే రోహ్‌తక్‌లోని ఛోటూరామ్ పాలిటెక్నిక్ గ్రౌండ్ నుంచి మోడల్ టౌన్‌లోని డి-పార్క్ వరకు నితిన్ నబిన్ పాదయాత్ర చేపట్టారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రజా తీర్పును పొందడంలో విఫలమై రాజ్యాంగ సంస్థలను నిందిస్తోందని నితిన్ నబిన్ ఆరోపించారు. అదే సమయంలో పార్టీ అంతర్గత ప్రజాస్వామ్య పనితీరును ప్రశ్నించారు. "ప్రజాస్వామ్యంలో ప్రజలు ఓట్లను వేసి ఎవరు పాలించాలో తీర్పు ఇస్తారు. మీకు ఆ తీర్పు కాంగ్రెస్‌కు అనుకూలంగా రాలేదు. ఫలితంగా, మీరు నిరాశ, నిస్పృహలతో నిండిపోయారు. దీంతో రాజ్యాంగ సంస్థలను నిందిస్తున్నారు. కాంగ్రెస్ నాయకులకు నిజంగా ధైర్యం ఉంటే ముందుగా తమ సొంత పార్టీలో కొనసాగుతున్న 'రాచరికం', రాహుల్ గాంధీ వంశపారంపర్య పాలనను కూల్చివేసి, దాని స్థానంలో ప్రజాస్వామ్యాన్ని స్థాపించాలి. కాంగ్రెస్‌లో ఒకే కుటుంబ పాలనకు మాత్రమే చోటు ఉన్నట్లు కనిపిస్తోంది. రాహుల్ గాంధీ లేదా ఆయన కుటుంబం చెప్పిందే వేదం అనే విధంగా కాంగ్రెస్ నాయకులు పనిచేస్తున్నారు. ఈ దేశ చట్టాలు కూడా రాహుల్ గాంధీ ఇష్టానుసారం రూపొందించాలని వారు నమ్ముతారు. రాజ్యాంగం ప్రతి మన దగ్గర ఉంది, కానీ కాంగ్రెస్ పార్టీకి చెందిన వాళ్లే దాని పేజీలను చించివేశారు." అని రాహుల్ అన్నారు.మరోవైపు ఎస్ఐఆర్ (ా×=)పై కాంగ్రెస్ వైఖరిని లక్ష్యంగా చేసుకుని నితిన్ నబిన్ విమర్శలు గుప్పించారు. దేశ ఓటర్ల కంటే చొరబాటుదారులపైనే ఆ పార్టీకి ఎక్కువ నమ్మకం ఉందని ఆరోపించారు. "కాంగ్రెస్‌కు దేశంలోని 140 కోట్ల మంది ప్రజలపై నమ్మకం లేదు. మరి ఇంకెవరిపై నమ్మకం ఉంచుతారు? 3 కోట్ల మంది చొరబాటుదారులపైనా! రాహుల్ గాంధీ అసలు మీ ఉద్దేశం ఏమిటి? మీరు ప్రజాస్వామ్యాన్ని ఎందుకు సవాలు చేస్తున్నారు? ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పు సర్వోన్నతమైనది. ప్రజలు తమ ఓట్లను వేసినప్పుడల్లా మీరు ఓటమిని చవిచూశారు. హిమాచల్ ప్రదేశ్‌లో లేదా కర్ణాటకలో గెలిచినప్పుడు మీకు ప్రజల తీర్పు అందినప్పుడు ప్రజాస్వామ్యం విజయం సాధించిందని చెప్పుకుంటారు. కానీ, హరియాణా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, బిహార్ లేదా బంగాల్‌లో ఓడిపోయినప్పుడు మాత్రం అకస్మాత్తుగా ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని అంటారు. ఇది ఎలాంటి ద్వంద్వ వైఖరి? గాంధీ కుటుంబం ఆదేశాల ప్రకారం ప్రజాస్వామ్యాన్ని నడపాలని కోరుకుంటున్నారనే విషయం స్పష్టమవుతోంది. కానీ ప్రజాస్వామ్యం దేశ రాజ్యాంగం ద్వారానే పాలన జరగాలి." అని నబిన్ అన్నారు. తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, కాంగ్రెస్ అరాచక పాలనను గద్దె దించడమే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. హైదరాబాద్ వేదికగా బీజేపీ చేపట్టిన మహాపాదయాత్ర ముగింపు సందర్భంగా మొజంజాహి మార్కెట్ వద్ద నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావాల్సిన సమయం ఆసన్నమైందని, రాష్ట్రంలో కాషాయ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో 13 కోట్ల ఓట్లు రద్దయ్యాయంటూ కాంగ్రెస్ పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తోందని అమిత్ షా స్పష్టం చేశారు. వాస్తవానికి చనిపోయిన వారివి దాదాపు 3 కోట్ల ఓట్లు, ఇతర ప్రాంతాలకు వెళ్లి స్థిరపడిన వారివి 6.5 కోట్ల ఓట్లు రద్దయ్యాయని వివరించారు. రెండు చోట్ల ఓట్లు ఉన్నవారి పేర్లను తొలగించాలా వద్దా అని సభకు హాజరైన ప్రజలను ఆయన ప్రశ్నించారు. మరో కోటి డూప్లికేట్, నకిలీ ఓట్లను మాత్రమే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం తొలగించిందని స్పష్టం చేశారు. చొరబాటుదారులకు రాహుల్ గాంధీ ఎలా మద్దతిస్తారని ఆయన నిలదీశారు. నకిలీ, డూప్లికేట్ ఓట్లను తొలగిస్తుంటే రాహుల్ గాంధీకి ఎందుకు అంత కడుపునొప్పి వస్తోందో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. వలం ఎస్ఐఆర్ ప్రక్రియ వల్లే బీజేపీ గెలిచిందంటూ రాహుల్ గాంధీ మాట్లాడటం అత్యంత హాస్యాస్పదంగా ఉందని అమిత్ షా కొట్టిపారేశారు. ప్రధాని మోదీ ప్రజా సంక్షేమం, దేశాభివృద్ధితో ప్రజల ఆదరణ పొంది గెలిచారని పేర్కొన్నారు. ఒకవేళ 2024 ఎన్నికలే అక్రమమైతే, అప్పుడు ప్రతిపక్ష నేత, ఖర్గేతో సహా వారి ఎంపీలందరూ కూడా అక్రమమే అవుతారని బీజేపీ ఎంపీ సంబిత్ పాత్రా ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ, ఆయన కుటుంబం భారతదేశ శ్రేయస్సు కంటే తమ సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యతనిచ్చారని విమర్శించారు. ఏది ఏమైనా విమర్శలు ప్రతివిమర్శలతో దేశంలో రాజకీయ సెగలు రాజేసుకున్నాయి. మరి ప్రస్తుతం నెలకొన్న ఈ వివాదం ఎప్పుడు సమిసిపోతుందో వేచిచూడాలి.

అమిత్ షాను కలిసిన చిరంజీవి, రామ్ చరణ్

మొదటిపేజీ తరువాయి..

చేరుకుని కేంద్ర మంత్రి అమిత్ షాతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. హోటల్‌కు విచ్చేసిన చిరు, రామ్‌చరణ్‌ను అమిత్ షా సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ప్రత్యేకంగా సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ కలయిక కేవలం మర్యాదపూర్వకమైనదేనని వర్గాలు స్పష్టం చేస్తున్నప్పటికీ.. కేంద్ర హోంమంత్రితో టాలీవుడ్ అగ్ర హీరోలు సమావేశం కావడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. నగరంలో బీజేపీ మహాపాదయాత్ర ప్రారంభానికి సరిగ్గా కొద్ది గంటల ముందు జరిగిన ఈ భేటీ ఇటు రాజకీయ వర్గాల్లో, అటు సినీ వర్గాల్లో తీవ్ర ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు ప్రముఖ వ్యాపారవేత్త, మైహోమ్ గ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వరరావు మర్యాదపూర్వకంగా అమిత్ షాను కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ భేటీ తర్వాత బీజేపీ మహాపాదయాత్రలో అమిత్ షా పాల్గొన్నారు.

ఈనెల 11 నుంచి కేటీఆర్ బస్సుయాత్ర..

మొదటిపేజీ తరువాయి..

కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ వెల్లడించారు. కేటీఆర్ బస్సు యాత్ర నవంబర్ 11వ తేదీ నుంచి 14వ తేదీ మధ్య 2 రోజులపాటు నిర్వహించనున్నట్లు గంగుల కమలాకర్ తెలిపారు. కరీంనగర్‌లోని శ్వేతా హోటల్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పార్టీ ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ భేటీలో బస్సు యాత్ర మార్గం, దీక్షా దివస్ సభ నిర్వహణ, రైతుల సమస్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి చర్చించారు. మేడిగడ్డ నుంచి ప్రారంభమయ్యే కేటీఆర్ బస్సు యాత్ర గోదావరి పరీవాహక ప్రాంతంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల మీదుగా కొనసాగనుంది. ఆయా ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు వాటి ద్వారా సాగునీరు అందే ప్రాంతాలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ పార్టీ భావిస్తోంది. సాగునీటితో పాటు తాగునీరు, విద్యుత్ సరఫరా, గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను కూడా యాత్రలో ప్రస్తావించనున్నారు. సాగునీటి అంశాన్ని రాజకీయ చర్చలోకి తీసుకురావడం ద్వారా రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని గులాబీ పార్టీ నాయకులు భావిస్తున్నారు. ముఖ్యంగా వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో నీటి వనరులు, ప్రాజెక్టుల నిర్వహణపై ప్రజలకు వివరించేందుకు ఈ యాత్రను వేదికగా చేసుకోనున్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్షకు సంబంధించిన జ్ఞాపకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నవంబర్ 29వ తేదీన దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. 2009 నవంబర్ 29వ తేదీన అప్పటి ఉద్యమ నాయకుడు కేసీఆర్‌ను అలుగునూర్ వద్ద పోలీసులు అరెస్టు చేసిన ఘటనను ఈ సందర్భంగా గుర్తుచేయనున్నారు. ఈ చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతంలోనే సభ నిర్వహించాలని పార్టీ యోచిస్తోంది. మానకొండూరు నియోజకవర్గ పరిధిలోని అలుగునూర్ లేదా నుస్తులాపూర్ ప్రాంతంలో సభ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు గంగుల కమలాకర్ తెలిపారు. ఈ దీక్షా దివస్ కార్యక్రమానికి సుమారు 50 వేల మందిని సమీకరించాలని బీఆర్ఎస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు గంగుల చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో దీక్షా దివస్‌కు ఉన్న ప్రాధాన్యతను ప్రజలకు వివరించడంతో పాటు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడంపై దృష్టి పెట్టనున్నారు. బస్సు యాత్ర, దీక్షా దివస్ సభ ఏర్పాట్ల, యాత్రలో ప్రజల నుంచి వచ్చే సమస్యలను తెలుసుకోవడం, ప్రాజెక్టుల పరిస్థితిపై వివరాలు సేకరించడం, సభకు జనసమీకరణ వంటి అంశాలపై నేతలు తాజాగా చర్చించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 3 ఏళ్లు కావస్తుండగా.. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా 2 ఏళ్ల సమయం ఉంది. ఈ నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు తమ కార్యకలాపాలను విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నాయి. బీజేపీ కూడా రాష్ట్రంలో కార్యక్రమాలను ముమ్మరం చేస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ బస్సు యాత్ర, దీక్షా దివస్ సభకు ప్రాధాన్యత ఏర్పడింది. మొత్తంగా మేడిగడ్డ నుంచి గోదావరి బేసిన్ వరకు కేటీఆర్ బస్సు యాత్ర, అలుగునూర్ ప్రాంతంలో దీక్షా దివస్ సభతో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి నీటి ప్రాజెక్టులు, రైతుల సమస్యలు ప్రధాన చర్చకు వచ్చే అవకాశం ఉంది.

సంక్షోభంలోనూ భారత్ ఆర్థికవృద్ధి

మొదటిపేజీ తరువాయి..

ఢిల్లీలో జరిగిన 'భారత్ రెన్యూవబుల్ ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్‌పో'లో ప్రధాని ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ప్రపంచమంతా ఎనర్జీ షాక్ గురించి చర్చిస్తున్న వేళ, మన అభివృద్ధి ప్రయాణంలో గ్రీన్ ఎనర్జీ ప్రాముఖ్యత మరింత పెరిగిందన్నారు. ప్రస్తుతం సౌర, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి రంగాల్లో భారత్ ప్రపంచంలోనే అగ్రగామి మూడు దేశాల్లో ఒకటిగా నిలిచిందని మోదీ గర్వంగా ప్రకటించారు. ఈ స్వచ్ఛ ఇంధన విజయాల అనుభవాన్ని ప్రపంచ దేశాలతో పంచుకోవడానికి భారత్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని వివరించారు.

గృహ వినియోగదారులకు సౌరశక్తిని చేరువ చేయడంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు అద్భుత ఫలితాలు ఇస్తున్నాయని ప్రధాని తెలిపారు. ప్రతి నెలా దాదాపు లక్ష గృహాలు ఈ సోలార్ మిషన్‌లో భాగస్వామ్యమవుతున్నాయని చెప్పారు. దీనివల్ల వేలాది కుటుంబాలు జీరో కరెంట్ బిల్లులను అందుకుంటూ ఆర్థికంగా లబ్ధి పొందుతున్నాయని గుర్తుచేశారు. వ్యవసాయ రంగంలోనూ సౌరశక్తి వినియోగాన్ని పెద్ద ఎత్తున విస్తరిస్తున్నామని ప్రధాని తెలిపారు. పొలాలను సోలార్ పవర్‌తో అనుసంధానించడమే కాకుండా, రైతులకు అదనపు ఆదాయ వనరులను సృష్టించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. 'అన్నదాతలు ఇకపై ఇంధనదాతలుగా మారాలి' అనేదే తన ప్రధాన సంకల్పమని స్పష్టం చేశారు. స్వచ్ఛమైన వంట ఇంధన కార్యక్రమాల అమలులో భారత్ చూపిన వేగం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. దేశంలో ఉన్న బలమైన రాజకీయ, విధానపరమైన స్థిరత్వం కారణంగానే ప్రపంచవ్యాప్త పెట్టుబడులకు భారత్ ప్రధాన ఆకర్షణగా మారిందని చెప్పారు. గ్లోబల్ ఇన్వెస్టర్లకు మన దేశం అపరిమిత అవకాశాల గని అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. గత దశాబ్ద కాలంలో భారత్ సకాలంలో దేశీయంగా పెట్టుబడులు పెంచడం, పలు కీలక కార్యక్రమాల్ని అమలు చేయడం వల్ల అంతర్జాతీయ పరిణామాల ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై మరీ ఎక్కువగా పడకుండా అడ్డుకోగలిగామని ప్రధాని వివరించారు. ఇదే సమయంలో పునరుత్పాదక ఇంధన రంగంలో భారత్ సాధించిన పురోగతిని మోదీ వివరించారు. భారత స్వచ్ఛ ఇంధన రంగాన్ని కేవలం హైడ్రో, సోలార్, విండ్, న్యూక్లియర్ విద్యుత్ వనరులకే పరిమితం చేయట్లేదని, గ్రీన్ హైడ్రోజన్ రంగంలోనూ ముందడుగు వేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. మొత్తం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో సగానికిపైగా వాటాను నాన్ ఫాసిల్ ఇంధన వనరుల ద్వారా సాధించాలనే 'పారిస్ ఒప్పందం' లక్ష్యాన్ని నిర్దేశించిన సమయం కంటే ఐదేళ్ల ముందుగానే, అంటే 2025 నాటికే భారతదేశం విజయవంతంగా చేరుకుందని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం దేశ మొత్తం విద్యుత్ సామర్థ్యంలో ఈ శిలాజయేతర వనరుల వాటానే 50 శాతానికిపైగా ఉందని పేర్కొన్నారు. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని సాధించాలనే 'జూా26' లక్ష్యం దిశగా భారత్ అడుగులు వేస్తూ- ఇప్పటికే దాదాపు 300 గిగావాట్ల మైలురాయిని చేరుకుందని ప్రధాని స్పష్టం చేశారు. రానున్న 10-11 ఏళ్లలో దేశీయంగా మరో 500 గిగావాట్ల శిలాజయేతర విద్యుత్ సామర్థ్యాన్ని అదనంగా జోడించడమే భారతదేశ తదుపరి లక్ష్యమని మోదీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇళ్లపై సోలార్ విద్యుత్ వ్యవస్థల ఏర్పాటుకు ఉద్దేశించిన పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పురోగతిని మోదీ వివరించారు. 2024 ఫిబ్రవరిలో ప్రారంభించిన ఈ పథకం ద్వారా కోటి కుటుంబాలకు ప్రయోజనం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గత రెండేళ్లలో 65 లక్షలకుపైగా ఇళ్లకు సోలార్ విద్యుత్ సదుపాయం అందిందని తెలిపారు. దీంతో ఆయా కుటుంబాల విద్యుత్ బిల్లులు సుమారు 76 శాతం తగ్గాయని చెప్పారు. ఇదే సమయంలో పీఎం- కుసుమ్ పథకం కింద 30 లక్షలకుపైగా రైతులకు సోలార్ విద్యుత్ వ్యవస్థల ద్వారా ప్రయోజనం కలుగుతోందని ప్రధాని పేర్కొన్నారు. దీని కింద ఒక్కో రైతుకు ఏడాదికి సుమారు రూ. 1 లక్ష వరకు ఆదా అవుతున్నట్లు అంచనా వేశారు. అలానే 44 వేలకుపైగా ప్రభుత్వ భవనాలపై ఏర్పాటు చేసిన సోలార్ వ్యవస్థల వల్ల ఏటా దాదాపు రూ. 700 కోట్ల మేర ఆదా అవుతుందని వెల్లడించారు.

రాష్ట్రంలో ఆర్ఆర్ ట్యాక్స్

మొదటిపేజీ తరువాయి..

మాటిమాటికీ విదేశాలకు పారిపోయే నేతలు మనకు అవసరమా అని ఆయన పరోక్షంగా రాహుల్ గాంధీని ఎద్దేవా చేశారు.

తెలంగాణ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ దర్బార్‌కు, ఆ పార్టీ అధిష్టానానికి ఏటీఎంగా మార్చేశారని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో అమలవుతున్న ఆర్ఆర్ ట్యాక్స్ అంటే రేవంత్ రెడ్డి ట్యాక్స్ మాత్రమే కాదని, అది రేవంత్ రెడ్డి ద్వారా నేరుగా రాహుల్ గాంధీకి చేరుతున్న ట్యాక్స్ అని సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ సంపదను ఢిల్లీ పరం చేస్తున్న కాంగ్రెస్ తీరును ఇక్కడి ప్రజలు ఎప్పటికీ క్షమించరని ఆయన హెచ్చరించారు. హైదరాబాద్‌లో బీజేపీ చేపట్టిన మహాపాదయాత్ర ముగింపు సందర్భంగా మొజంజాహి మార్కెట్ వద్ద సోమవారం సాయంత్రం



నిర్వహించిన భారీ బహిరంగ సభలో అమిత్ షా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పార్లమెంటు సమావేశాలను సజావుగా సాగనీయకుండా కాంగ్రెస్ పార్టీ అడ్డుపడుతోందని కేంద్ర హోంమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. "రాహుల్ జీ.. మీరు పార్లమెంటును నడవనీయరు. ఈవీఎం, ఓటర్ల సవరణ ప్రక్రియ, దేశంలోకి అక్రమ చొరబాటుదారుల అంశాలపై హైదరాబాద్ గడ్డ నుంచి నేను మీకు నేరుగా సవాల్ విసురుతున్నా. ఈ అంశాలపై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయడానికి మేము సిద్ధం.. చర్చకు మీరు సిద్ధమా?" అని సవాల్ విసిరారు. అయితే కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ ముఖాముఖి చర్చకు ముందుకు రాదని, పార్లమెంటులో చర్చ జరిగితే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ అసలు బండారాన్ని బట్టబయలు చేస్తారన్న భయం ఆ పార్టీకి ఉందని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యబద్ధమైన చర్చల ద్వారా కాకుండా, పార్లమెంటులో అరాచకం సృష్టించి కేవలం వార్తల్లో నిలవడమే కాంగ్రెస్ ఏకైక ఎజెండాగా మారిందని అమిత్ షా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావాల్సిన సమయం ఆసన్నమైందని, రాష్ట్రంలో కాషాయ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తోన్న దుష్ప్రచారాన్ని అమిత్ షా తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ అండ్ కంపెనీ ఎస్ఐఆర్ ప్రక్రియను అడ్డుకోవడానికి కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. ఢిల్లీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ నిర్వహించింది ఓట్ బచావో ర్యాలీ కాదని, అది చొరబాటుదారులను రక్షించే ర్యాలీ అని ఎద్దేవా చేశారు. దేశంలోకి అక్రమంగా వచ్చిన చొరబాటుదారులను తమ ఓటు బ్యాంకుగా మార్చుకోవడమే కాంగ్రెస్ నైజమని దుయ్యబట్టారు.దేశంలో 13 కోట్ల ఓట్లు రద్దయ్యాయంటూ కాంగ్రెస్ పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తోందని అమిత్ షా స్పష్టం చేశారు. వాస్తవానికి చనిపోయిన వారివి దాదాపు 3 కోట్ల ఓట్లు, ఇతర ప్రాంతాలకు వెళ్లి స్థిరపడిన వారివి 6.5 కోట్ల ఓట్లు రద్దయ్యాయని వివరించారు. రెండు చోట్ల ఓట్లు ఉన్నవారి పేర్లను తొలగించాలా వద్దా అని సభకు హాజరైన ప్రజలను ఆయన ప్రశ్నించారు. మరో కోటి డూప్లికేట్, నకిలీ ఓట్లను మాత్రమే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం తొలగించిందని స్పష్టం చేశారు. చొరబాటుదారులకు రాహుల్ గాంధీ ఎలా మద్దతిస్తారని ఆయన నిలదీశారు. నకిలీ, డూప్లికేట్ ఓట్లను తొలగిస్తుంటే రాహుల్ గాంధీకి ఎందుకు అంత కడుపునొప్పి వస్తోందో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. కేవలం ఎస్ఐఆర్ ప్రక్రియ వల్లే బీజేపీ గెలిచిందంటూ రాహుల్ గాంధీ మాట్లాడటం అత్యంత హాస్యాస్పదంగా ఉందని అమిత్ షా కొట్టిపారేశారు. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ లేకుండానే దేశ ప్రజలు సంపూర్ణ మెజారిటీతో నరేంద్ర మోదీ నాయకత్వాన్ని గెలిపించారని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా ఎన్నో రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ జరగకముందే బీజేపీ ఘన విజయాలు సాధించిందని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ ప్రజా సంక్షేమం, దేశాభివృద్ధితో ప్రజల ఆదరణ పొంది గెలిచారని పేర్కొన్నారు.హైదరాబాద్ చరిత్రను ప్రస్తావిస్తూ.. దేశ మొదటి హోంమంత్రి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ దృఢ సంకల్పం లేకపోతే హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం అయ్యేది కాదని అమిత్ షా గుర్తుచేశారు. తెలంగాణ గడ్డపై కాంగ్రెస్ సాగిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఇకపై సహించేది లేదని, భవిష్యత్తులో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమని స్పష్టం చేశారు.

భారత 29వ వైమానిక దళాధిపతిగా అశుతోష్ దీక్షిత్

మొదటిపేజీ తరువాయి..

ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ ను కలిసి అభినందించారు. అశుతోష్ దీక్షిత్ పదవీకాలం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. వాయుసేనకి అద్భుతమైన నాయకత్వానికి పేరుగాంచిన ఒక విశిష్ట వాయు యోధుడుగా అశుతోష్ దీక్షిత్ ను కొనియాడారు. భారత వాయుసేన పోరాట సంసిద్ధత, వాయుసేన సామర్థ్యాన్ని పునరుద్ధరించడం, స్వదేశీ రక్షణ సామర్థ్యాలు, సాంకేతిక ఆవిష్కరణలు సాయుధ దళాల మధ్య సమన్వయం వంటి అంశాలపై దృష్టి సారిస్తానని అశుతోష్ దీక్షిత్ స్పష్టం చేశారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ పూర్వ విద్యార్థి అయిన ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్, 1986 డిసెంబర్ 6న భారత వైమానిక దళంలోని ఫైటర్ స్ట్రీమ్లోకి నియమితులయ్యారు. నాలుగు దశాబ్దాల పాటు సాగిన తన కెరీర్లో, ఎయిర్ చీఫ్ ఆపరేషన్స్, ఫ్లైట్ టెస్టింగ్, సామర్థ్య అభివృద్ధి జాయింట్ స్టాఫ్ అసైన్మెంట్లు వంటి విభిన్న రంగాలలో విస్తారమైన అనుభవం ఉంది. ఆయన నిష్ణాతుడైన ఫైటర్ పైలట్, అర్హత కలిగిన ఫ్లయింగ్ ఇన్స్ట్రక్టర్ , ప్రయోగాత్మక టెస్ట్ పైలట్ అయిన ఆయనకు, మిరాజ్-2000, వివిధ మిగ్ వేరియంట్లు, జాగ్వార్ అనేక రవాణా విమానాలతో సహా విస్తృత శ్రేణి విమానాలలో 3,300 గంటలకు పైగా విమానయాన అనుభవం ఉంది.భారత వైమానిక దళ ఆధునీకరణకు ఆయన చేసిన కృషికి విస్తృతంగా గుర్తింపు పొందిన ఆయన, జాగ్వార్ , మిగ్-27 ఆధునీకరణ ప్రాజెక్టులను ఖరారు చేయడంలో, ఎల్సిఎ మార్క్-1 తేజస్ యొక్క ఇనీషియల్ ఆపరేషనల్ క్లియరెన్స్ (ఐఓసి) ఫైనల్ ఆపరేషనల్ క్లియరెన్స్ (ఎఫ్ఓసి) కార్యకలాపాలను పూర్తి చేయడంలో కీలక పాత్ర పోషించారు. అశుతోష్ దీక్షిత్ కార్యాచరణ కమాండ్ నియామకాలలో మిరాజ్ -- 2000 స్క్వాడ్రన్, పశ్చిమ సెక్టార్లోని ఫార్వర్డ్ బేస్ సపోర్ట్ యూనిట్ ఐఎఫ్ ,యొక్క ప్రధాన ఫైటర్ శిక్షణా స్థావరమైన బీదర్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ కమాండ్ ఉన్నాయి. అశుతోష్ దీక్షిత్ ఎయిర్ ఆఫీసర్



సదరన్ ఎయిర్ కమాండ్లో ఎయిర్ డిఫెన్స్ కమాండర్ గా సౌత్ వెస్టర్న్ ఎయిర్ కమాండ్లో సీనియర్ ఎయిర్ స్టాఫ్ ఆఫీసర్ గా , డిప్యూటీ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ గా పనిచేస్తూ, కీలక సామర్థ్య అభివృద్ధి కార్యక్రమాలకు సారథ్యం వహించారు. సెంట్రల్ ఎయిర్ కమాండ్ ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్గా బాధ్యతలు చేపట్టారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ చైర్మన్ కు చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ గా పనిచేశారు. చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ గా బాధ్యతలు స్వీకరించడానికి ముందు, ఆయన వైస్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ గా కూడా పనిచేశారు.అశుతోష్ దీక్షిత్ సైనిక సేవలకు గానూ పరమ విశిష్ట సేవా పతకం (2026), అతి విశిష్ట సేవా పతకం (2023), వాయు సేనా పతకం (2006), విశిష్ట సేవా పతకం (2011) పొందారు.

విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు శుభవార్త

మొదటిపేజీ తరువాయి..

2026 జూలై 1 నుంచి అమలులోకి రానుంది. జూలై నుంచి ఉన్న బకాయిలు కూడా అర్హులైన విద్యుత్ ఉద్యోగులకు అందుతాయి. విద్యుత్ ఉద్యోగులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ తీపికబురు చెప్పారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విద్యుత్ సంస్థల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఈ ప్రకటన చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉద్యోగులకు ఆర్థిక ఉపశమనం కల్పించాలనే దృష్టితో ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. లేబర్ బ్యూరో ప్రకటించే అఖిల భారత ధరల సూచీ ఆధారంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి డీఏను సవరిస్తారు. జనవరి, జూలై నెలల్లో ఈ సవరణ జరుగుతుంది. ఇదే క్రమంలో ప్రస్తుత సవరణ చేశారు. ఈ పెంపు వల్ల రాష్ట్రంలోని నాలుగు విద్యుత్ సంస్థల పరిధిలో మొత్తం 71,360 మందికి ప్రయోజనం చేకూరనుంది. టీజీ ట్రాన్స్‌కోలో 9,194 మంది, టీజీ జెన్‌కోలో 14,167 మంది, టీజీ ఎస్పీడీసీఎల్‌లో 28,481 మంది, టీజీ ఎన్పీడీసీఎల్‌లో 19,518 మంది లబ్ధి పొందనున్నారు. ఉద్యోగులతో పాటు క్షేత్రస్థాయిలో పనిచేసే ఆర్టిజన్లు, పదవీ విరమణ చేసిన పెన్షనర్లకు కూడా ఈ పెంపు వర్తిస్తుంది. ఈ పెంపు కారణంగా నెలవారీగా సుమారు రూ.14.63 కోట్ల అదనపు ఆర్థిక భారం విద్యుత్ సంస్థలపై పడనుంది. దీపావళి పండుగకు ముందు ప్రకటించిన ఈ నిర్ణయం ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక ఊరటనిస్తుంది. పెరుగుతున్న నిత్యావసరాల ధరల మధ్య ఈ అదనపు మొత్తం కొంత సహాయం చేస్తుంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విద్యుత్ రంగ భవిష్యత్తుపై కూడా దృష్టి సారించారు. రాబోయే పదేళ్లలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను అంచనా వేసి దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గ్రిడ్ ఆధునీకరణ, నిరంతర విద్యుత్ సరఫరా, విద్యుత్ ఉత్పత్తి పెంపుకు ప్రణాళికలు, ప్రత్యామ్నాయ మార్గాలు, సంస్థలను లాభాల బాట పట్టించడం వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది.మొత్తంగా చూస్తే విద్యుత్ రంగ సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఈ నిర్ణయం స్పష్టం చేస్తోంది. జూలై నుంచి అమలయ్యే ఈ డీఏ పెంపు వేలాది కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తుంది. వారి జీవితాల్లో దీపావళి వెలుగులు నింపుతోంది.

పాత ఎల్లాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ చేసిన భూక్యా జాన్సన్ నాయక్





ఖానాపూర్ నవంబర్ 2 (ప్రజా జ్యోతి) : ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ స్పోర్ట్స్ యూనిఫామ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. భూక్యా జాన్సన్ నాయక్ సేవలని కొనియాడారు. అనంతరం భూక్యా జాన్సన్ నాయక్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి పాఠశాలకు, గ్రామానికి పన్నె తేవవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు, వాల్ల భవిష్యత్తుకు ప్రోత్సాహం అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు అభివృద్ధికి తన వంతు సహకారం అందించిన భూక్యా జాన్సన్ నాయక్ సేవాభావాని కి పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాతెల్లాపూర్ సర్పంచ్ ఏలేటి ప్రశాంత్ రెడ్డి పోచంపల్లి నాయకులు కొక్కుల శేఖర్ ప్రధానోపాధ్యాయురాలు ఆసూరి రమాదేవి సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

శ్రీరాంపూర్ ఏరియా అండర్‌గ్రౌండ్ గనుల్లో తీవ్ర మెటీరియల్ కొరత

- కార్మికుల భద్రతను విస్మరిస్తున్న యాజమాన్యం..
- సమస్యలను పరిస్కరించాకుంటే ఆందోళనలకు సిద్ధం
- ఐఎన్‌టీయూసీ నాయకులు



మంచిర్యాల, 2, నవంబర్ (ప్రజాజ్యోతి) : మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా అండర్‌గ్రౌండ్ గనుల్లో కార్మికులకు అవసరమైన రక్షణ పరికరాలు, స్పేర్ మెటీరియల్స్ కొరత తీవ్రంగా నెలకొన్నదని ఐఎన్‌టీయూసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల భద్రతతో పాటు సంస్థ ఉత్పత్తిపై ప్రభావం చూపుతున్న యాజమాన్య నిర్లక్ష్య వైఖరికి నిరసనగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్లు ల్యాగల శ్రీనివాస్, శీలం చిన్నయ్య, చాట్ల అశోక్ కు సోమవారం తెలిపారు. ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు యాజమాన్య మొండి వైఖరిపై పోరాటానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు . గనుల్లో విధులు నిర్వహించే కార్మికులకు రక్షణగా అందించాల్సిన సేఫ్టీ షూస్‌ను సైతం యాజమాన్యం సరఫరా చేయకపోవడం దారుణమని మండిపడ్డారు. సంస్థ ఉత్పత్తికి కీలకమైన ఎస్‌డీఎల్ మిషన్లకు అవసరమైన స్పేర్ మెటీరియల్స్ అందుబాటులో లేకపోవడంతో ఉత్పత్తి కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గనుల్లో ప్రమాదకరమైన, ఎత్తైన సైడ్స్ వద్ద ప్రమాదాలను నివారించేందుకు ఏర్పాటు చేయాల్సిన వైర్ మెష్ సరఫరా లేకపోవడం కార్మికుల భద్రత పట్ల యాజమాన్య నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. అదేవిధంగా రూఫ్, సైడ్స్ సపోర్టింగ్ కోసం అవసరమైన రెగ్జిన్ క్యాప్సూల్స్, రూఫ్ బోల్టర్ బిట్స్, డ్రిల్ రాడ్స్, డ్రిల్ బిట్స్, లైన్‌మెన్ కీల్స్ తదితర రక్షణ పరికరాలు, స్పేర్ మెటీరియల్స్‌ను వెంటనే సమకూర్చాలని డిమాండ్ చేశారు. గనుల్లో ప్రమాదాలు జరిగినప్పుడు వాటికి కార్మికుల నిర్లక్ష్యమే కారణమంటూ యాజమాన్యం బాధ్యతను కార్మికులపైకి నెట్టివేయడం, అదే సమయంలో కార్మికులు తమ భద్రత కోసం అవసరమైన మెటీరియల్స్ అడిగితే వారిని ఇబ్బందులకు గురిచేయడం తీవ్రంగా ఖండించదగిన విషయమని అన్నారు. కార్మికుల ప్రాణరక్షణ, ఉత్పత్తి, ఉత్పాదకతతో పాటు సంస్థ భవిష్యత్తును కూడా యాజమాన్య నిర్లక్ష్య ధోరణి ప్రమాదంలోకి నెడుతోందని హెచ్చరించారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి అవసరమైన మెటీరియల్స్‌ను తక్షణమే సరఫరా చేసి కార్మికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, లేనిపక్షంలో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటిన మంచిర్యాల క్రీడాకారుల

- విజేతలకు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అభినందనలు..
- జాతీయస్థాయి పోటీలకు రూ.50 వేల ఆర్థిక సాయం



మంచిర్యాల, 2, నవంబర్ (ప్రజాజ్యోతి) : మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గుడిరేవు వరంగల్‌లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కాకతీయ విశ్వవిద్యాలయంలో అక్టోబర్ 27న నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో మంచిర్యాల క్రీడాకారులు ప్రథమ బహుమతి సాధించి ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా విజేతలైన క్రీడాకారులను మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అభినందించారు. డిసెంబర్ నెలలో రాజస్థాన్‌లో జరగనున్న ఆల్ ఇండియా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన దేనియల్, కమల్, ప్రదీప్, సాయిప్రభాస్, అఖిల్, అభిరామ్, సిర్కార్‌లను ప్రత్యేకంగా అభినందించి, జాతీయస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి మంచిర్యాల నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన ఖర్చుల నిమిత్తం రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. క్రీడాకారుల ప్రతిభకు అండగా నిలుస్తూ, వారిని మరింత ప్రోత్సహించడంతో పాటు క్రీడారంగ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, కార్పొరేటర్లు ఎంబడి కుమారస్వామి, కాకుల వరలక్ష్మి-యువరాజ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల్లో పారదర్శకత క్షుణ్ణంగా ప్రజా సమస్యలకు స్పందించిన ఎస్పీ డా. జి. జానకి షర్మిల







ఫిర్యాదులపై తక్షణ చట్టపరంగా పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశాలు

ఖానాపూర్ నవంబర్ 2(ప్రజా జ్యోతి) : ప్రజా సమస్యల ఫిర్యాదులపై పారదర్శకంగా వ్యవహరించి క్షుణ్ణంగా సమస్యలు అడిగి తెలుసుకుని స్పందించిన ఎస్పీ డాక్టర్ జి జానకి షర్మిల నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను ఆప్యాయతగా స్వీకరించి ఫిర్యాదుదారులను అక్కున చేర్చుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను విన్న ఎస్పీ, సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించాలని ఆదేశించారు. ఫిర్యాదులను చట్టపరంగా పరిశీలించి, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదులను బాధ్యతతో స్వీకరించి, దాని పరిష్కారానికి తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. పరిష్కారంలో అనవసర జాప్యం లేకుండా, బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ పూర్తి స్థాయిలో బాధితులకు సహకరించాలని సూచించారు.

ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీసు శాఖ దృష్టికి తీసుకువచ్చేలా ప్రజావాణి కార్యక్రమం ఉపయోగపడుతుందని ఎస్పీ తెలిపారు. ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడంతో పాటు, పారదర్శకంగా, బాధ్యతాయుతంగా సేవలందిస్తూ పోలీసు శాఖపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఈ సందర్భంగా తెలిపారు.

విద్య, పారిశుద్ధ్యం, మహిళా సంఘాలపై శిక్షణ కలెక్టర్ల సమీక్ష

అంగన్‌వాడీ, పాఠశాలల తనిఖీ.. విద్యార్థుల చదువుల పురోగతిపై ఆరా







నేరడిగొండ, నవంబర్ 02 (ప్రజాజ్యోతి) : మండలంలోని కుమారి గ్రామ పంచాయతీ పరిధిలో శిక్షణ కలెక్టర్ల బృందం సోమవారం మూడో రోజు విస్తృతంగా పర్యటించి వివిధ ప్రభుత్వ సంస్థలను తనిఖీ చేసింది. ఇందులో భాగంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించి వాటి పనితీరును సమీక్షించింది. పాఠశాలల్లో ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల హాజరు శాతం, బోధనా విధానం, విద్యా ప్రమాణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో నేరుగా ముచ్చటించి వారి చదువుల పురోగతిని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారం పంపిణీ తీరును పరిశీలించారు.అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వయం సహాయక పొదుపు సంఘాల మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయడం, ఆర్థికంగా అభివృద్ధి చెందడం, స్వయం సమృద్ధి సాధించేందుకు చేపట్టాల్సిన చర్యలపై వారితో చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అగ్గిమల్ల లస్మన్న, ఉపసర్పంచ్ ఆడెపు రవి, ఎంపీడీవో ఎం. గంగాసాగర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి దత్త హరి, వీజీఎస్ రాజేశ్వర్, కారోబార్ రాజు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, కీర్తి గౌడ్, కవిత, నీల గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుల సొంతింటి కలను నెరవేర్చడమే సీఐటీయూ లక్ష్యం

- ఆలస్యం చేస్తే వినూత్న పోరాటాలకు శ్రీకారం చుడతాం
- సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని అరికట్టాలి
- సీఐటీయూ జనరల్ సెక్రటరీ తుమ్మల రాజారెడ్డి





మంచిర్యాల, 2, నవంబర్ (ప్రజాజ్యోతి) : సింగరేణి కార్మికుల సొంతింటి కలను నెరవేర్చేందుకు గత నాలుగేళ్లుగా అనేక విధాలుగా పోరాటాలు నిర్వహించి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ద్వారా సొంతింటి పథకంపై ప్రకటన చేయించడంలో సీఐటీయూ విజయవంతమైందని, అయితే రాజకీయ ప్రయోజనాల కోసం పథకం అమలులో జాప్యం చేస్తే మరో తరహా వినూత్న పోరాటాలకు శ్రీకారం చుడతామని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) జనరల్ సెక్రటరీ తుమ్మల రాజారెడ్డి హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కార్మికుల సొంతింటి కలను నెరవేర్చడమే సీఐటీయూ లక్ష్యమని స్పష్టం చేశారు. శ్రీరాంపూర్‌లోని ఎస్ఆర్‌పీ ఓసీలో సీఐటీయూ బ్రాంచ్ కమిటీ నాయకులు కస్తూరి చంద్రశేఖర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వతంత్రంగా నడవాల్సిన ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో రాజకీయ జోక్యం పెరగడం వల్ల సంస్థల అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. కార్మికులకు సమయానికి అందించాల్సిన పనిముట్లను సైతం ఉప ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని ఇప్పించే పరిస్థితి రావడం ఇందుకు నిదర్శనమన్నారు. గత ప్రభుత్వం రాజకీయ జోక్యంతో సింగరేణి సంస్థను ఆర్థికంగా నష్టపరిచిన విధానాలనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగించడం సరికాదని, ఈ వైఖరిని మార్చుకోవాలని సూచించారు. చిన్నచిన్న తప్పిదాలకే కార్మికులకు లెటర్లు జారీ చేస్తూ ఇబ్బందులకు గురిచేసే అధికారులు, సంస్థకు వేల కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోతున్నా వాటి వసూలుపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు బొగ్గు ఉత్పత్తిపై సమీక్షలు నిర్వహించినట్లుగానే సంస్థకు రావాల్సిన బకాయిల వసూలుపైనా ప్రత్యేక సమీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాజకీయ అవసరాలకు అనుగుణంగా సంస్థలో ఉద్యోగాల భర్తీని చేపట్టడం, నిలిపివేయడం, మెడికల్ బోర్డులో అన్‌ఫిట్‌మెంట్ ప్రక్రియను పెంచడం, తగ్గించడం వంటి చర్యలతో కార్మికులకు తీరని అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బొగ్గు గని కార్మికులపై తమకు ఎంతో ప్రేమ ఉందని చెప్పుకునే బీజేపీ నాయకులు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి 12వ వేతన ఒప్పంద కమిటీ ఏర్పాటు విషయంలో ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి నుంచి తమకు రావాల్సిన డివిడెండ్లను తీసుకోవడంలో చూపుతున్న శ్రద్ధ, సంస్థకు రావాల్సిన బకాయిలను ఇప్పించడంలో చూపడం లేదని విమర్శించారు. పైగా సింగరేణి సీఎస్ఆర్ నిధుల ద్వారా తమ నియోజకవర్గాలను అభివృద్ధి చేసుకోవడంపైనే ప్రభుత్వాలు దృష్టి సారిస్తున్నాయని ఆరోపించారు. సింగరేణిలో గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో అన్ని కార్మిక సంఘాలకు సమాన హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. అన్ని సంఘాలతో సమావేశాలు నిర్వహించే అంశంపై యాజమాన్యం సానుకూలంగా ఆలోచించాలని సూచించారు. ఈ సమావేశంలో సీఐటీయూ ఉప ప్రధాన కార్యదర్శి అల్లి రాజేందర్, పిట్ సెక్రటరీ సీపతి బానేష్, రాష్ట్ర నాయకులు నరహరి రావు, బ్రాంచ్ నాయకులు మేల్లం శ్రీధర్, అఖిల్, బొజ్జ నవీన్, జగన్మోహన్ రెడ్డి, చిగురు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. కార్మికులు కూడా సమావేశానికి హాజరయ్యారు.

కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టో హామీ మేరకు రూ.18 వేల వేతనం చెల్లించాలి..

- పదవీ విరమణ అనంతరం రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలి
- అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల దాసు
- అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి..
కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ధర్నా





మంచిర్యాల, 2, నవంబర్ (ప్రజాజ్యోతి) : అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉదయం 10 గంటలకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంచిర్యాల కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల దాసు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ఐసీడీఎస్ పరిధిలో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.18 వేల వేతనం చెల్లించాలని, పదవీ విరమణ అనంతరం నెలకు రూ.10 వేల పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ సిబ్బంది చిన్నారులకు పౌష్టికాహారం అందించడం, గర్భిణులు, బాలింతలకు సేవలందించడం, ప్రీ-స్కూల్ విద్యాబోధన, ఆరోగ్య సంబంధిత కార్యక్రమాల నిర్వహణ వంటి కీలక బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో కీలకపాత్ర పోషిస్తున్నప్పటికీ తగిన వేతనాలు లేకపోవడం, బిల్లులు పెండింగ్‌లో ఉండటం, అదనపు విధుల భారం వంటి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు నెలకు రూ.18 వేల వేతనం చెల్లించడంతో పాటు, అంగన్వాడీ కేంద్రాల సేవలకు ఆటంకం కలగకుండా టీచర్లను బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) విధుల నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పీఎఫ్, హెల్త్ కార్డులు, రూ.25 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని, పదవీ విరమణ అనంతరం నెలకు రూ.10 వేల పెన్షన్ అందించాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాల వ్యవస్థకు నష్టం కలగకుండా ప్రీ-ప్రైమరీ పాఠశాలల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని, కేంద్రాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. టీచర్లు, హెల్పర్లకు రావాల్సిన పెండింగ్ టీఏ, డీఏ బకాయిలను చెల్లించాలని, పదవీ విరమణ చేసిన సిబ్బందికి అందాల్సిన అన్ని ఆర్థిక ప్రయోజనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. 2023 సమ్మె కాలానికి సంబంధించి నమోదైన కేసులను ఎత్తివేయాలని, అర్హత, సర్వీసు ఆధారంగా గ్రేడ్-2 సూపర్వైజర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడీ సిబ్బంది సమస్యలను ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యం చేయకుండా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని మేకల దాసు స్పష్టం చేశారు. అంగన్వాడీ ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ ధర్నాలో అంగన్వాడీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు భూపతి రమాదేవి, తోకల సరస్వతి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎండీ అక్బర్ అలీ, వర్కింగ్ ప్రెసిడెంట్ కలిందర్ అలీ ఖాన్, కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, పి.సురేఖ, నేరేళ్ల అరుణ, కె.తిరుమల, ఇంద్ర, శంకరమ్మ, కుసుమ కుమారి, పద్మారెడ్డి, ఎ.అరుణ, సరోజ, బి.శైలజ, కనకలక్ష్మి, శారద, సంధ్య, జాడి కృప తదితరులు పాల్గొన్నారు.



అర్హులైన దివ్యాంగులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి





నిర్మల్ టౌన్, నవంబర్ 02 (ప్రజాజ్యోతి) : అర్హులైన దివ్యాంగులు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని స్పందన దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇసాక్ అలీ సోమవారం నిర్మల్ జిల్లా ప్రజా ఫిర్యాదు విభాగంలో విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం దరఖాస్తులు చేస్తున్నామని ఈ నేపథ్యంలో కొంతమందికి అధికారులకు అర్హులుగా ఎంపిక చేశారన్నారు.

ఆ ఎంపిక చేసిన దివ్యాంగుల కైనా కనీసం ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందులో బామన్ పల్లి సుధాకర్, కొట్ల శివకుమార్ ఉన్నారు.

హైమాక్స్ లైట్ ఏర్పాటు చేయాలి

పొచ్చెర ఎక్స్ రోడ్ వద్ద మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలి



బోథ్, నవంబర్ 2 (ప్రజా జ్యోతి) : మండలంలోని పొచ్చెర ఎక్స్ రోడ్ వద్ద హైమాక్స్ లైట్లను మరుగుదొడ్లను నిర్మించాలని సోమవారం ప్రజావాణిలో కౌటాబి గ్రామానికి చెందిన శ్రీరామోజు రాజు ట్రైనీ కలెక్టర్ వంశీకృష్ణ రెడ్డికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రయాణికులతో ఎంతో రద్దీగా ఉండే ప్రాంతమని, అలాగే పొచ్చెర ఎక్స్ రోడ్ వద్ద రాత్రి సమయంలో వివిధ ప్రాంతాల నుంచి పనులను నిమిత్తం దిగే ప్రయాణికులు ఎటువంటి వెలుతురులు లేకపోవడం మూలంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. అంతేకాకుండా అక్కడ మహిళలకు మరుగుదొడ్లను నిర్మించాలని తెలిపారు. దీంతో ట్రైనీకలెక్టర్ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని సానుకూలంగా స్పందించారు.

దండారి, గుస్సాడి దర్బార్ ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరించిన ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



మంచిర్యాల, 2, నవంబర్ (ప్రజాజ్యోతి) : మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గుడిరేవు గ్రామంలో ఈ నెల 5వ తేదీన నిర్వహించనున్న ఆదివాసీల ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ పద్మల్ పూరి కాకోబాయి (ఏత్మాసార్) దండారి, గుస్సాడి దర్బార్ ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు సోమవారం మంచిర్యాలలో ఆవిష్కరించారు. గుడిరేవు గ్రామంలోని ఏత్మాసార్ ఆలయ ప్రాంగణంలో గురువారం నిర్వహించనున్న ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, ఆదివాసీ నాయకులు జంగు, మంచిర్యాల జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు పూదరి తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లం భీమయ్య, కార్పొరేటర్లు బండారి సుధాకర్, ఎంబడి కుమారస్వామి, కాకుల వరలక్ష్మి, యువరాజ్, కోఆప్షన్ సభ్యుడు కల్వల జగన్‌మోహన్‌రావు, ఆదివాసీ నాయకులు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పెండింగ్ ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించొద్దు

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

ప్రజావాణికి 35 ఆర్జీలు

గద్వాల నవంబర్ 02(ప్రజా జ్యోతి ప్రతినిధి):
ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా నిర్దేశిత గడువులోగా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రాజ్‌కుమార్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు,వినతులను



స్వీకరించారు.ఈ వారం వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 35 ఆర్జీలు అందినట్లు తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి గతంలో అందిన 70 ఫిర్యాదులు ఇంకా పరిష్కారం కావాల్సి ఉందని,వాటి పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు.ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి,బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని,ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల పరిష్కారంపై రాష్ట్రస్థాయిలోనూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు.కాబట్టి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి పెండింగ్ ఆర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

గర్భిణీల ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ నూర్జహాన్

నాగర్ కర్నూల్ నవంబర్ 2(ప్రజా జ్యోతి బ్యూరో):
గర్భిణీలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ప్రగతి నర్సింగ్ హోమ్ కు చెందిన ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ నూర్జహాన్ అన్నారు. సోమవారం ప్రగతి నర్సింగ్ హోమ్ లో గర్భిణీలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 150 మందికి ఉచితంగా



స్కానింగ్ తో పాటు రక్త పరీక్షలు, అందరికి మందులు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణీ మహిళలతో పాటు వారి కుటుంబ సభ్యులకు గర్భం దాల్చిన నాటి నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. గర్భంతో ఉన్న మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకుంటూ వ్యాయామం, తీసుకునే ఆహారంలో పోష్టిగా విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా రక్తహీనత,బీపీ వంటి సమస్యలు రాకుండా ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించాలన్నారు. వారి సలహాలు సూచనల మేరకు ప్రసవం జరిగే నాటి వరకు జాగ్రత్తలు పాటించాలని వారికి అవగాహన కల్పించడం జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణీ మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ శిబిరంలోడాక్టర్ సంపత్ కుమార్,రేడియాలాజిస్ట్ డాక్టర్ శ్రీనివాస్,ప్రగతి నర్సింగ్ హోమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినోపై ప్రభావాన్ని తట్టుకునే పంటలు సాగు చేయాలి

'ఖేత్ బచావో' కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించిన ఆర్చన

గద్వాల నవంబర్ 02(ప్రజా జ్యోతి ప్రతినిధి):
జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం ఆరగిద్ద గ్రామంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'ఖేత్ బచావో' కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బి.ఆర్.వి.కె జోగులాంబ గద్వాల కోఆర్డినేటర్ డా.పి.ఆర్చన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆమె



మాట్లాడుతూ,ప్రస్తుత వాతావరణ పరిస్థితులు,రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో సంభవించే వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అధిక నీటి అవసరం కలిగిన వరి,మొక్కజొన్న పంటలకు బదులుగా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా జొన్న,ఉలవలు,అలసందలు, వేరుశనగ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని తెలిపారు.రానున్న జూలై 2027 వరకు ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున రైతులు నీరు,విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవాలని సూచించారు.పంటలకు అవసరమైన మేరకే సాగునీటిని వినియోగిస్తూ నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని వివరించారు.వాతావరణ మార్పులను తట్టుకునే పంటల సాగు విధానాలను అనుసరించడం ద్వారా వ్యవసాయంలో పెట్టుబడులు, నష్టాలను తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గట్టు మండల వ్యవసాయ అధికారి హనుమంతు,ఆరగిద్ద వ్యవసాయ విస్తరణ అధికారి (ఆత్మ) ప్రతినిధి,గ్రామ సర్పంచ్,పంచాయతీ కార్యదర్శి,రైతులు తదితరులు పాల్గొన్నారు.

కరువు పరిస్థితుల్లో రైతులకు బ్యాంకులు అండగా నిలవాలి

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్
వ్యవసాయ రుణాల పునర్వ్యవస్థీకరణతో పాటు కొత్త రుణాలు మంజూరు చేయాలి
వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించాలి.. బీమా పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలి

గద్వాల నవంబర్ 02(ప్రజా జ్యోతి ప్రతినిధి):
ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్న నేపథ్యంలో రైతులు ఈ ఏడాది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇలాంటి క్లిష్ట



పరిస్థితుల్లో బ్యాంకులు రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేసి అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు.సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన బ్యాంకర్ల ప్రత్యేక జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశం నిర్వహించారు.జిల్లాలోని 13 మండలాలను తీవ్ర కరువు ప్రభావిత మండలాలుగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో రైతులకు ఆర్థిక ఉపశమనం కల్పించడం,వ్యవసాయ రుణాల పునర్వ్యవస్థీకరణ,కొత్త పంట రుణాల మంజూరు తదితర అంశాలపై బ్యాంకు అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,కరువు పరిస్థితుల కారణంగా పంట దిగుబడులు తగ్గడంతో పాటు సాగునీటి కొరత వల్ల పలువురు రైతులు పంటలను నష్టపోయారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో అర్హులైన రైతులకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ),రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ మార్గదర్శకాల ప్రకారం రుణాల పునర్వ్యవస్థీకరణ ద్వారా ఆర్థిక ఉపశమనం కల్పించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు.జిల్లాలోని అన్ని బ్యాంకుల పరిధిలో 59,968 మంది రైతులు రూ.1,099.43 కోట్ల పంట రుణాలు పొందగా,మరో 15,383 మంది రైతులు రూ.517.64 కోట్ల వ్యవసాయ కాలపరిమితి రుణాలు పొందారని తెలిపారు.వీరందరిలో అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం రుణ పునర్వ్యవస్థీకరణ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.అర్హులైన రైతులకు వ్యవసాయ రుణాలపై 12 నెలల మారటోరియం కల్పించడంతో పాటు తిరిగి చెల్లింపు వ్యవధిని గరిష్ఠంగా 60 నెలల వరకు పొడిగించాలని సూచించారు.అర్హత కలిగిన స్వల్పకాలిక పంట రుణాలను వడ్డీతో సహా మధ్యకాలిక రుణాలుగా మార్చే ప్రక్రియను వేపట్టాలని తెలిపారు.రుణాల పునర్వ్యవస్థీకరణతో పాటు తదుపరి పంటల సాగుకు రైతులకు అవసరమైన కొత్త పంట రుణాలు,వర్కింగ్ క్యాపిటల్ రుణాలను సకాలంలో మంజూరు చేయాలన్నారు.రుణాల వసూళ్ల విషయంలో రైతులపై ఎలాంటి ఒత్తిడి,బెదిరింపులకు పాల్పడకుండా మానవతా దృక్పథంతో వ్యవహరించాలని,కరువు ప్రభావిత ప్రాంతాల్లో అర్హులైన రైతుల నుంచి బలవంతపు రుణ వసూళ్లు చేయరాదని సూచించారు.వ్యవసాయ శాఖ అధికారులు బ్యాంకులతో సమన్వయం చేసుకుంటూ అర్హులైన రైతులను,రుణ ఖాతాలను గ్రామాలు,మండలాల వారీగా గుర్తించాలన్నారు. రైతు వేదికలు,గ్రామసభలు,ఆర్థిక అక్షరాస్యత శిబిరాల ద్వారా రుణ పునర్వ్యవస్థీకరణపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు.వచ్చే వారం రోజుల్లో మండల స్థాయిలో ఎంపీడీవోలు,డీఆర్‌డీఏ,ఇతర శాఖల సిబ్బందితో కలిసి బ్యాంకు శాఖల వారీగా సమన్వయ సమావేశాలు నిర్వహించి,రుణాల మంజూరు తదితర అంశాలపై చర్చించి నివేదికలు సమర్పించాలని సూచించారు.వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల అభివృద్ధికి కూడా బ్యాంకులు పెద్ద ఎత్తున రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం కింద బ్యాంకుల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు.స్వయం సహాయక సంఘాలు,రైతు ఉత్పత్తిదారుల సంఘాలు,ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా కస్టమ్ హైరింగ్ సెంటర్ల ఏర్పాటుకు రుణ సదుపాయాలు కల్పించాలని సూచించారు.రైతులకు అదనపు ఆదాయం కల్పించే లక్ష్యంతో పాడి పరిశ్రమ,గొర్రెలు,మేకల పెంపకం,కోళ్ల పెంపకం వంటి పశుసంవర్ధక అనుబంధ రంగాలతో పాటు మత్స్య రంగానికి కూడా రుణాలు మంజూరు చేయాలని తెలిపారు.ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పశువులకు బీమా సదుపాయం కల్పించాలని,సబ్సిడీ రుణాలను నిబంధనల మేరకు మంజూరు చేయాలని సూచించారు.ఎస్సీ,ఎస్టీ లబ్ధిదారులకు స్వయం ఉపాధి,చిన్న పరిశ్రమలు,వ్యవసాయ అనుబంధ రంగాల్లో రుణ సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.

జిల్లాలోని ప్రభుత్వ,కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు బ్యాంకుల ద్వారా అందుబాటులో ఉన్న జీతపు ఖాతా ఆధారిత బీమా పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు.జిల్లా, మండల స్థాయిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి,ఉద్యోగులకు అందుబాటులో ఉన్న జీవిత,ప్రమాద,ఆరోగ్య బీమా పథకాల ప్రయోజనాలను వివరించాలని సూచించారు.అర్హులైన ఉద్యోగులందరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.కరువు పరిస్థితుల్లో రైతులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు వ్యవసాయ,అనుబంధ రంగాల అభివృద్ధికి బ్యాంకులు ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుని పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.నిర్దేశించిన గడువులోగా రుణ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో డీసీసీబీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అబ్దుల్ నబీ,లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప,ఉద్యాన శాఖ అధికారి రాజ్‌కుమార్,నాబార్డ్ డీడీఎం మనోహర్ రెడ్డి,వివిధ బ్యాంకుల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.కామ్రేడ్ మధుగని రాములు ఆశయాలను కొనసాగిస్తాం.

ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో సిపిఎం నేతలు.

వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టు.ప్రజల హక్కుల కోసం నిరంతరం ఎర్రజెండా పక్షాన పేదలు,కార్మికులు, కష్టజీవుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన సిపిఎం నేత .వీపనగండ్ల గ్రామ మాజీ ఉపసర్పంచ్ కామ్రేడ్ మధుగని రాములు ఆశయాలను కొనసాగిస్తామని సిపిఎం శాఖ కార్యదర్శులు ఆశన్న, నక్క ఈశ్వర్ పేర్కొన్నారు. ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి,నివాళులర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ కామ్రేడ్ మధుగని రాములు పై నక్సలైట్లు,వర్గ శత్రువులు అనేక దాడులు చేసిన ప్రజా సమస్యలపై పోరాడుతూ ,ప్రజల పక్షాన నిలిచారని తెలిపారు.సమాజంలో అసమానతలు తొలగి, పేదలకు న్యాయం జరిగే వరకు పోరాటమే మార్గంగా భావించి పనిచేశారని ఆయన చూపిన పోరాట పంథా,ప్రజా ఉద్యమాల్లో పనిచేసే కార్యకర్తలకు స్ఫూర్తిదాయకమని అన్నారు.ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.ఆది ,వెంకన్న గౌడ్, ఎం. రామకృష్ణ,నక్క ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు హక్కుపై అవగాహన సదస్సు

అలంపూర్ నవంబర్ 2(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి):
జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ చౌరస్తాలోని కన్వెన్షన్‌లో మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు హక్కు నమోదు పై నిర్వహించిన అవగాహన సదస్సు విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య



అతిథులుగా ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి , అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు విజయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి , ఎమ్మెల్యే విజయుడు స్వయంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రాధాన్యత, ఓటు హక్కు నమోదు విధానం, ఓటరుగా నమోదు కావడానికి ఉండాల్సిన అర్హతలు, అవసరమైన ధ్రువపత్రాలు, దరఖాస్తు ప్రక్రియ తదితర అంశాలను వివరించి పట్టభద్రులకు అవగాహన కల్పించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, చేపట్టిన పథకాల అమలులో వైఫల్యాలపై నాయకులు విమర్శలు చేశారు.అలాగే అలంపూర్ నియోజకవర్గంలో రైతుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారంటూ వసూలు రాజా వ్యవహారంపై వారు ప్రస్తావించారు. అదేవిధంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని, ఎవరికీ డబ్బులు ఇచ్చి మోసపోవద్దని, ఇలాంటి వసూళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ఎంపీపీలు మాజీ జెడ్పీటీసీలు మాజీ సర్పంచులు మాజీ ఉపసర్పంచ్లు మాజీ వార్డు సభ్యులు,బీఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులు తదితరులు పాల్గొన్నారు.



ఎల్ నినోపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి

రబీ సీజన్‌లో ఆరుతడి పంటల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలి
నీరు,విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి: జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల నవంబర్ 02(ప్రజా జ్యోతి ప్రతినిధి):
ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే నీటి కొరతపై ప్రజలందరికీ విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.నీటి సంరక్షణ,పొదుపు చర్యలపై సాంస్కృతిక సారథి కళాకారులు తమ పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తు





న్నారని,ఇదే అంశంపై రూపొందించిన షార్ట్ ఫిలింను కూడా సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.ఉండవల్లి మండలం కంచుపాడు గ్రామానికి చెందిన ఔత్సాహిక షార్ట్ ఫిలిం దర్శకుడు శేషు ఎల్ నినో ప్రభావంపై రూపొందించిన షార్ట్ ఫిలింను సోమవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో విడుదల చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఈ షార్ట్ ఫిలింను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ ఉన్నతాధికారులకు కూడా పంపించాలని,తద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో విస్తృత ప్రచారం కల్పించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.ప్రభుత్వం జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన నేపథ్యంలో ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో నీటి సంరక్షణపై ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.రబీ సీజన్‌లో రైతులు తమ బోర్లు,బావుల్లో అందుబాటులో ఉన్న నీటి లభ్యతను బట్టి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు.ముఖ్యంగా పప్పుధాన్యాలు,కూరగాయలు వంటి స్వల్పకాలిక పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు.స్ప్రింక్లర్లు,డ్రిప్ ఇరిగేషన్ విధానాలను వినియోగించడం ద్వారా తక్కువ నీటితోనే పంటలను సాగు చేయవచ్చన్నారు.నీటిని పునర్వినియోగించే పద్ధతులను అలవర్చుకోవాలని,ఇంట్లో వినియోగించిన నీటిని పెరటి తోటల్లోని మొక్కలకు ఉపయోగించుకోవాలని సూచించారు.ప్రతి ఇంటి వద్ద వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు చిన్న సంపులు ఏర్పాటు చేసుకోవడంతో పాటు,ఇతర మార్గాల్లో వర్షపు నీటిని సేకరించి గృహ అవసరాలకు వినియోగించుకోవాలని తెలిపారు.వీబీ–జీ రామ్‌జీ పథకంలో భాగంగా జలసిరి కార్యక్రమాల ద్వారా పంట కుంటలు,ఇంకుడు గుంతల నిర్మాణాలను పెద్ద ఎత్తున చేపట్టాలని అధికారులను ఆదేశించారు.తద్వారా భూగర్భ జలాల పెంపునకు అవకాశం ఉంటుందన్నారు.నీటితో పాటు విద్యుత్‌ను కూడా పొదుపుగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.జూలై వరకు ఎల్ నినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున రానున్న కాలంలో నీరు,విద్యుత్ కొరతను అధిగమించేందుకు ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తూ ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.ఎల్ నినో ప్రభావంతో రానున్న ఎనిమిది నెలల పాటు ఎదురయ్యే నీటి కొరతను అధిగమించేందుకు ఇటువంటి షార్ట్ ఫిలింలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొంటూ చిత్ర రూపకర్తలను కలెక్టర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప,ఉద్యానవన అధికారి రాజ్‌కుమార్,షార్ట్ ఫిలిం నిర్మాణానికి సహకరించిన లక్ష్మణ్,శేషన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మృతిచెందిన హోంగార్డుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున చెక్కులు అందజేసిన జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు

గద్వాల నవంబర్ 02(ప్రజా జ్యోతి ప్రతినిధి):
విధి నిర్వహణలో ఉండగా మృతి చెందిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు అన్నారు.సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని తన ఛాంబర్‌లో 2025లో అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు





ఏ.స్వాములు,2024లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హోంగార్డు కె.ధన్‌రాజ్ రాథోడ్ కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా నిధుల కింద ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.10 లక్షల చెక్కులను ఎస్పీ అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన సిబ్బంది కుటుంబాల సంక్షేమానికి శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.మృతిచెందిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు ప్రభుత్వం,పోలీసు శాఖ ద్వారా అందాల్సిన సంక్షేమ ప్రయోజనాలు సకాలంలో అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని పేర్కొన్నారు.మృతుల కుటుంబాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వారికి అందాల్సిన మిగిలిన సంక్షేమ ప్రయోజనాలను కూడా త్వరితగతిన అందించేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమం పట్ల పోలీసు శాఖ నిరంతరం బాధ్యతతో వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయ పరిపాలన అధికారి సాయికృష్ణ, ఆర్ఐ వెంకట్,మృతిచెందిన హోంగార్డు స్వాములు కుటుంబ సభ్యురాలు కళావతి,ధన్‌రాజ్ రాథోడ్ భార్య భావన, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నర్వలో బీసీఏ కులాల సమైక్య పోరాటం ధర్నా

నర్వ నవంబర్ 2 ప్రజా జ్యోతి:
నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలో సోమవారం బీసీఏ కులాల సమైక్య పోరాట ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు, ఈ సందర్భంగా నర్వ



మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో బీసీఏ కులాల సంబంధించిన చాకలి, బోయ, మంగలి, వడ్డెర, మేదర, తదితర ఏ కులాలకు సంబంధించిన అణగారిన కులాల కుల సంఘాల సభ్యులంతా కలిసికట్టుగా ఉండా అలానే డిమాండ్ చేస్తూ ముదిరాజ్ కులాన్ని బి సి డి నుండి బీసీఏకు మార్చా అలానే ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ, ఈ ధర్నా ను చేపట్టామన్నారు, సంబంధించిన మన రిజర్వేషన్ ఫలాలు అందేలా ప్రభుత్వంతో పోరాటం చేసి చట్టబద్ధత కల్పించుకోవాలని డిమాండ్ చేశారు, అనంతరం ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీతో వెళ్లి అక్కడ ప్రజావాణి అధికారి అయిన ఎంపీడీవో శ్రీనివాసులు తాసిల్దార్ మల్లారెడ్డి లకు వీళ్ళ డిమాండ్ల వినతిపత్రం అందజేశారు, ఈ కార్యక్రమంలో బీసీఏ కులాలకు సంబంధించిన సంఘ నాయకులు, ముందెకోడు గ్రామ సర్పంచ్ జగన్నాథం, మాజీ ఎంపిటిసి నీరాజ్ కుమార్, గద్దం నరసింహ, మాజీ ఎంపీటీసీ అయ్యన్న, బోలుబండ శివ, బొజ్జన్న, ఆయా గ్రామాల బీసీ ఏ కులాల సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు,

ఎండిన పత్తి వరి మొక్కజొన్న పంటలను పరిశీలించిన సిపిఎం నాయకులు

- కరువు సహాయక చర్యలు చేపట్టాలి.
- సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి.





బచ్చన్నపేట నవంబర్ 02 (ప్రజా జ్యోతి) : బచ్చన్నపేట మండలంలోని నక్కవానిగూడెం బచ్చన్నపేట గ్రామాలలో సిపిఎం పార్టీ బచ్చన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో ఎండిపోయిన వరి పత్తి మొక్కజొన్న పంటలనుపరిశీలించడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ మోకు కనకా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏలినో ప్రభావంతో వర్షాభావ ప్రభావంతో వేసిన వరి పత్తి మొక్కజొన్న ఎండిపోవడం జరిగిందని పత్తి మొక్కజొన్న పంటలకు నష్టపరిహారం 50 వేల రూపాయలు అలాగే వరి పంటకు 30 వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని ఈ జిల్లాలో బచ్చన్నపేట మండలంను కరువుమండ లంగా ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టి మండల రైతులను ఆదుకోవా లని కోరారుఈ రాష్ట్ర ప్రభుత్వం వచ్చే యాసాంగి వరి పంటలు వేయొద్దని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని రైతాంగానికి ప్రత్యామ్నాయ పంటలు విత్తనాలు అందుబాటులో ఉంచకుండా వరి పంటలు వేయవద్దని చెప్పడం సరికాదని అన్నారు రైతాంగాన్ని కి ఎకరానికి 20వేల చొప్పున ఇవ్వాలని రైతుబంధు ఎకరానికి 12 000 వేలు రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్, మండల నాయకులు రామగళ్ళ అశోక్, బోడ పట్ల బాలరాజు, కంత్రి ఐలయ్య, దండుగుల మురళీకృష్ణ,రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 2 (ప్రజాజ్యోతి) : జిల్లాలో వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ బెన్‌షాలోంతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను అధికారులు త్వరగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే స్వీకరిం చిన దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో గల అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఈ ప్రజావాణిలో మొత్తం 221దరఖాస్తులను కలెక్టర్ స్వీకరిం చారు. ఈ ప్రజావాణిలో డీఆర్డీఓ భాస్కర్, సీపీఓ చినకోట్యా నాయక్, ఎస్ఈ ఎన్పీడీసీఎల్ సంపత్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

కేబుల్ ఛానల్ జర్నలిస్టుల పోరాటానికి టీడబ్ల్యూజేఎఫ్ సంపూర్ణ మద్దతు

టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు మల్లేష్ గౌడ్



నర్సంపేట నవంబర్ 2 (ప్రజా జ్యోతి) : నర్సంపేట తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా ప్రజలకు సమాచారాన్ని అందిస్తున్న కేబుల్ టీవీ న్యూస్ ఛానళ్లను ప్రభుత్వం అణిచివేసే కుట్ర చేస్తోందని టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు బి. మల్లేష్ గౌడ్ విమర్శించారు.

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేబుల్ టీవీ న్యూస్ ఛానళ్ల జర్నలిస్టులు తమ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న పోరాటానికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని తెలిపారు.టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ ఆదేశాల మేరకు కేబుల్ ఛానళ్ల జర్నలిస్టుల పోరాటానికి రాష్ట్ర కమిటీ అండగా,నిలుస్తుందని స్పష్టం చేశారు.చిన్న పత్రికలు,కేబుల్ ఛానళ్ల సంఖ్యను తగ్గించాలనే కుట్రలో భాగంగానే ఇటీవల ఇంటర్నెట్ ప్రోటోకాల్ (ఐపీ) నెట్‌వర్క్ ద్వారా ప్రసారాలు చేస్తున్నాయనే సాకుతో అనేక కేబుల్ ఛానళ్లకు, వాటిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వకుండా అన్యాయం చేశారని ఆరోపించారు. లక్షల రూపాయల పెట్టుబడులతో నడుస్తున్న అసలైన కేబుల్ ఛానళ్లకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వకుండా, అనర్హులకు కార్డులు కేటాయించారని విమర్శించారు. కేబుల్ ఛానళ్ల నిర్వాహకులు కూడా జర్నలిస్టులేనని, వారు ప్రభుత్వాన్ని కోరుతున్నది కేవలం అక్రెడిటేషన్ కార్డులేనని, గొంతెమ్మ కోర్కెలు కాదని మల్లేష్ గౌడ్ పేర్కొన్నారు.గతంలో కేబుల్ ఛానళ్లకు జిల్లాకు నాలుగు అక్రెడిటేషన్ కార్డులు,రాష్ట్ర స్థాయిలో 12 కార్డులు ఉండేవని, ప్రస్తుతం వాటిని సగానికి తగ్గించారని తెలిపారు. దీంతో ఒకవైపు ప్రభుత్వ ప్రకటనలు లేక, మరోవైపు అక్రెడిటేషన్ కార్డులు అందక అనేక కేబుల్ ఛానళ్లు మూతపడే పరిస్థితి ఏర్ప డిందని ఆందోళన వ్యక్తం చేశారు.జర్నలిజం వృత్తిపై ఆధారపడి ఎన్నో ఏళ్లుగా ఛానళ్లను నిర్వహిస్తున్న వేలాది మంది జర్నలిస్టులను ప్రభుత్వం రోడ్డున పడే స్తోందని ధ్వజమెత్తారు.పోరాడి సాధించుకున్న తెలంగాణలో చిన్న పత్రికలు, కేబుల్ ఛానళ్లను చిన్నచూపు చూడటం సరికాదని అన్నారు.ఐపీ ఛానళ్ల పేరుతో కేబుల్,ఛానళ్లను,మూసివేయాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించు కోవాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ అనుమతులతో నడుస్తున్న కేబుల్ ఛానళ్లకు ఎలాంటి కొర్రీలు పెట్టకుండా న్యాయబద్ధంగా అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని మల్లేష్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్రెడిటేషన్ల సాధన కోసం కేబుల్ ఛానళ్ల యజమానులు, జర్నలిస్టులు చేస్తున్న పోరాటానికి టీడబ్ల్యూజేఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

కాయి తోజు చంద్రమౌళి కుటుంబ సభ్యులు పరామర్శించి 50 కేజీల బియ్యం అందజేసిన గ్రామ సర్పంచ్

శీల హేమలత రత్నాకర్ రెడ్డి



రాయపర్తి నవంబర్ 2 ప్రజా జ్యోతి : వరంగల్ జిల్లా రాయపర్తి మండలం గ్రామంలో మృతి చెందిన న కాయితోజు చంద్రమౌళి కుటుంబ సభ్యులను మర్వించిన గ్రామ సర్పంచ్ షీలా హేమలత రత్నాకర్ రెడ్డి.పాలకుర్తి నియోజక వర్గం ఎమ్మెల్యే మామిడాల యశస్వినీ రెడ్డి మరియు టీపీసీసీ సెల్ ఉపాధ్యక్షు రాలు హనుమాన్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆదేశానుసారము శివరామపురం గ్రామములో కాయితోజు చంద్రమౌళి ఆకస్మికముగా మరణించి నందుకు గాను వారి కుటుంబానికి ప్రగాఢ తమ సానుభూతిని తెలియజేస్తూ సోమవారం వారి కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యాన్ని ఇచ్చి 50 కిలోల బియ్యాన్ని అందించిన గ్రామ సర్పంచ్ శీల హేమలత రత్నాకర్ రెడ్డి. ఈ కార్యక్రమములో పాల్గొన్నవారు ఉప సర్పంచ్ భూక్య లక్ష్మణ్ మరియు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితోజు ఉపేంద్ర చారి, ప్రధాన కార్యదర్శిలు చెడు పాక యాకయ్య, నాగపురి శ్రీనివాస్, చెడుపాక చక్రపాణి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రావు రాజిరెడ్డి గ పసునూరి ప్రభాకర్ రెడ్డి నాగపురి యాకయ్య నాగపూర్ బిక్షపతి, మైలపాక సోమయ్య తాటికాయల ,రఘుపతి సారబుద్ల వెంకట్ రెడ్డి, కొత్త సోమిరెడ్డి, కల్దారి శ్రీనివాస్ కాయ్ తోజు శోభన్ బాబు సిరిమల్లె వెంకట్రాద్రి, చెడుపాక సుమన్, మడిపల్లె కుమారస్వామి, మడిపల్లె అక్షయఏనుగ రామచంద్రు గ్రామ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు తేజ సోమన్న వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

5వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్--2026..

మూడు రోజుల పాటు హనుమకొండలో క్రీడా పోటీలు..



వరంగల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 2 (ప్రజాజ్యోతి): 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్--2026 (క్లస్టర్-డి) ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు హనుమకొండలో నిర్వహించనున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ క్రీడా పోటీలు హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియం, కిట్స్ కళాశాల, భీమారం ఎస్ వీఎస్ కళాశాలల్లో జరగనున్నాయి. ఈ పోటీల్లో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 1,535 మంది పోలీసు క్రీడాకారులు పాల్గొ ననున్నట్లు కమిషనర్ వెల్లడించారు. పోలీసు సిబ్బందిలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు ప్రతిభను వెలికితీ సేందుకు ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నూతన సమీకృత గ్రావెల్ నిర్వహణ విధానం అమలు..



- అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట..
- ఆన్‌లైన్‌లో గ్రావెల్ అనుమతులు..
- మూడు నుంచి ఐదు రోజుల్లో అనుమతుల మంజూరు..
- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి..



హనుమకొండ జిల్లా ప్రతినిధి, నవంబర్ 2 (ప్రజాజ్యోతి) : జిల్లాలో అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయడంతో పాటు గ్రావెల్ (మట్టి) తవ్వకాలకు అనుమతుల ప్రక్రియను సులభతరం చేసేందుకు నూతన సమీకృత గ్రావెల్ నిర్వహణ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. ప్రజలకు సులభంగా అనుమతులు అందించేందుకు ఇంటిగ్రేటెడ్ గ్రావెల్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఐజీఎంఎస్) పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు.

సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నూతన పోర్టల్‌ను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం పోర్టల్ పనితీరు, దరఖాస్తు విధానం, అనుమతుల జారీ ప్రక్రియపై మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పౌరులు తమ మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీ ద్వారా లాగిన్ అయి గ్రావెల్ తవ్వకాలకు అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సంబంధిత అధికారులు దరఖాస్తులను పరిశీలించి మూడు నుంచి ఐదు రోజుల్లో అనుమతుల ప్రక్రియను పూర్తి చేస్తారని తెలిపారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సమన్వయంతో ఈ పోర్టల్‌ను అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు.

సులభతరమైన దరఖాస్తు విధానం :

గ్రావెల్ కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో ఆధార్ తదితర ప్రాథమిక వివరాలతో పాటు మట్టి తీసుకోవాలనుకుంటున్న ప్రాంతానికి సంబంధించిన సమాచారాన్ని నమోదు చేయాల్సి ఉంటుందన్నారు.

సొంత పట్టా భూమి నుంచి గ్రావెల్ తీసుకోవాలంటే పట్టాదారు పాస్‌బుక్‌ను, ఇతరుల భూమి నుంచి తీసుకోవాలంటే భూయజమాని సమ్మతి పత్రాన్ని అప్‌లోడ్ చేయాలని సూచించారు.

ప్రభుత్వ భూముల విషయంలో సర్వే నంబర్, జియో కోఆర్డినేట్స్ తదితర వివరాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. నీటిపారుదల శాఖకు సంబంధించిన అంశాలుంటే దరఖాస్తులను ఆ శాఖకు పంపించి పరిశీలన చేయిస్తామని, రెవెన్యూ శాఖ ఎన్ఓసీ అనంతరం అవసరాన్ని బట్టి మైనింగ్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని వివరించారు.

క్యూఆర్ కోడ్‌తో అనుమతుల వివరాలు : అనుమతి మంజూరైన తర్వాత క్యూఆర్ కోడ్‌తో కూడిన పత్రం జారీ అవుతుందని కలెక్టర్ తెలిపారు. అనుమతించిన గ్రావెల్ పరిమాణం, తరలించే ప్రాంతం, గమ్యస్థానం, అనుమతి సమయం, వాహనాల నంబర్లు తదితర వివరాలు అందులో ఉంటాయన్నారు. అనుమతి పొందిన వాహనాల ద్వారానే గ్రావెల్ తరలించాలని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బంది అనుమతించిన ట్రిప్పుల సంఖ్య, వాస్తవంగా తరలించిన ట్రిప్పులను పర్యవేక్షించాల్సి ఉంటుందని తెలిపారు. పోర్టల్ వినియోగంపై రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ అందించినట్లు వెల్లడించారు. ఈ విధానం ద్వారా వచ్చే ఆదాయంలో కొంత రుసుము గ్రామ పంచాయతీలకు అందుతుందని పేర్కొన్నారు.

గ్రావెల్‌కు మాత్రమే వర్తింపు : ఈ పోర్టల్ గ్రావెల్ (మట్టి) అనుమతులకు మాత్రమే వర్తిస్తుందని, ఇసుక అనుమతులకు ఉపయోగించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇసుక కోసం రాష్ట్రంలో ఇప్పటికే ప్రత్యేక పోర్టల్ ఉందన్నారు. మైనింగ్ శాఖ వద్ద ఉన్న ప్రస్తుత పోర్టల్ ప్రధానంగా భారీ ప్రభుత్వ పనులకు అవసరమైన గ్రావెల్ అనుమతుల కోసం ఉపయోగపడుతోందని, గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, ఇతర చిన్న పనులకు తక్కువ పరిమాణంలో గ్రావెల్ అవసరమైన వారికి సౌలభ్యం కల్పించేందుకు నూతన పోర్టల్‌ను తీసుకొచ్చినట్లు వివరించారు. గ్రావెల్ అవసరమైన ప్రతి ఒక్కరూ ఈ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకునేలా విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో మీడియా ప్రతినిధులు అడిగిన సందేహాలను కలెక్టర్, అదనపు కలెక్టర్, మైనింగ్ శాఖ ఏడీ నివృత్తి చేశారు. అనంతరం పోర్టల్‌కు సంబంధించిన పోస్టర్లను అధికారులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఎన్. రవి, బి. శేషాద్రి, డీఆర్ఓ శ్రీనివాస్, మైనింగ్ శాఖ ఏడీ రామాచారి, డీఆర్డీఓ మేన శ్రీను, సీపీఓ సత్యనారాయణరెడ్డి, జీడబ్ల్యూఎంసీ కాజీపేట డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్, సి-సెక్షన్ సూపరింటెండెంట్ చల్లా ప్రసాద్, సీజీజీ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధాకృష్ణ, ఈడీఎం శ్రీధర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్కం అశోక్



భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ నవంబర్ 02 (ప్రజా జ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని బెగులూర్ గ్రామానికి చెందిన మాణిపెల్లి లక్ష్మణ్, తెర్కరి కొమ్మలయ్యకి రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్కశి అశోక్ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్సలు పొందుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా పేదలకు అండగా నిలుస్తూ, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తామని కట్కం అశోక్ తెలిపారు.

రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్న మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి







భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ నవంబర్ 02 (ప్రజా జ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారిని మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజేష్ అగర్వాల్, గడ్చిరోలి జిల్లా కలెక్టర్ అవిశాంత్ పండా సోమవారం రోజు దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారికి అర్చకులు, దేవాదాయ శాఖ అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.

అనంతరం బాలాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. పూజల అనంతరం అభిషేక మండపంలో అర్చకులు వేదాశీర్వచనం అందించి, స్వామివారి శేషవస్త్రాలతో అతిథులను సత్కరించారు. దర్శనం అనంతరం త్రివేణి సంగమం సమీపంలోని సరస్వతీ పుష్కర ఘాట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న ముందస్తు ఏర్పాట్లు, ఘాట్ల అభివృద్ధి పనుల వివరాలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వారికి వివరించారు.అనంతరం పునర్నిర్మాణంలో ఉన్న శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులను మహారాష్ట్ర సీఎస్ రాజేష్ అగర్వాల్, గడ్చిరోలి కలెక్టర్ అవిశాంత్ పండా, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. పనుల పురోగతి, నిర్మాణ నాణ్యత, చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో రెవెన్యూ, దేవాదాయ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

ఏఈ నర్సింహారెడ్డికి వినతిపత్రం అందజేసిన సర్పంచ్ చింత రవి



దేవరుప్పుల, నవంబర్ 2(ప్రజాజ్యోతి): మండలంలోని కామారెడ్డిగూడెం గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సర్పంచ్ చింత రవి విద్యుత్ శాఖ అధికారులను కోరారు.గ్రామంలో అదనపు కరెంటు పోల్స్ ఏర్పాటు చేయాలని, వేలాడుతున్న లూజ్ వైర్లను సరి చేయాలని, కొన్నిచోట్ల ఇండ్ల మీది నుండి వెళ్తున్న ప్రమాదకర విద్యుత్ వైర్లను తొలగించి సరిచేయాలని కోరుతూ దేవరుప్పుల విద్యుత్ శాఖ ఏఈ నర్సింహారెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు.గ్రామంలో విద్యుత్ అంతరాయాలు లేకుండా ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో లైన్ మెన్ నర్సయ్య పాల్గొన్నారు.

నవంబర్ నెలను ప్రత్యేక హాజరు మాసం

100 శాతం హాజరు లక్ష్యంగా నిర్వహణ



జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 02 (ప్రజా జ్యోతి) : జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలో ఉన్న పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని గణనీయంగా పెంచి, ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరయ్యేలా ప్రోత్సహించేందుకు రాష్ట్ర సమగ్ర శిక్ష సూచనల మేరకు, నవంబర్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు "ప్రత్యేక హాజరు మాసం-100 శాతం హాజరు డ్రైవ్" నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యా శాఖ వెల్లడించింది. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు, జిల్లాలోని అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ఎయిడెడ్, రెసిడెన్షియల్, ఇతర యాజమాన్యాల పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది హాజరును ప్రతిరోజూ పర్యవేక్షించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి పాఠశాలలో ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును ప్రతిరోజూ నమోదు చేయాలని, ఒక్క పాఠశాలలో కూడా హాజరు నమోదు కాకుండా ఉండకూడదని లక్ష్యంగా నిర్దేశించారు. విద్యార్థుల హాజరు వంద శాతానికి చేరుకునేలా వారానికొకసారి పురోగతిని సమీక్షించనున్నారు. వరుసగా ఐదు రోజులు, అంతకంటే ఎక్కువ రోజులు పాఠశాలకు గైర్హాజరయ్యే విద్యార్థులను గుర్తించి, వారి తల్లిదండ్రులతో సంప్రదింపులు జరపడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి గైర్హాజరుకు గల కారణాలను తెలుసుకుంటారు. విద్యార్థులు తిరిగి పాఠశాలలకు హాజరయ్యేలా తగిన చర్యలు చేపడతారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న ఓడీ నమోదులను 24 గంటల్లోగా పరిష్కరించాలని, ఎఫ్ఆర్ఎస్ పరికరాలు, నెట్‌వర్క్, విద్యార్థుల నమోదు, తదితర సాంకేతిక సమస్యలను 48 గంటల్లోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోనున్నారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు మండలాల వారీగా రోజువారీ హాజరు డ్యాష్‌బోర్డును నిర్వహించనున్నారు. ప్రతి మండల విద్యాశాఖాధికారి తమ పరిధిలోని పాఠశాలల హాజరు వివరాలు, ఎఫ్ఆర్ఎస్ నమోదు స్థితి, విద్యార్థులు, సిబ్బంది హాజరు శాతాన్ని ప్రతిరోజూ సమీక్షించి, జిల్లా విద్యా శాఖ కార్యాలయానికి నివేదించాలి. క్లస్టర్ హెడ్‌లు వారానికి ఒకసారి పాఠశాలలను సమీక్షించి, హాజరు శాతం తగ్గుతున్న పాఠశాలలను గుర్తించి అవసరమైన సూచనలు అందిస్తారు. ప్రతి పాఠశాలలో తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశాలు నిర్వహించి విద్యార్థుల క్రమబద్ధమైన హాజరు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించనున్నారు. ప్రతి పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడిని అటెండెన్స్ నోడల్ టీచర్‌గా నియమించి, రోజువారీ హాజరు పర్యవేక్షణ, తల్లిదండ్రులతో సంప్రదింపులు, గైర్హాజరు విద్యార్థుల వివరాలపై పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించనున్నారు. మెరుగైన ఫలితాలు సాధిస్తున్న పాఠశాలల్లోని ఉత్తమ విధానాలను ఇతర పాఠశాలల్లోనూ అమలు చేసేలా చర్యలు తీసుకోనున్నారు. ప్రత్యేక హాజరు మాసంలో వంద శాతం హాజరు సాధించిన పాఠశాలలు, గణనీయమైన పురోగతి సాధించిన పాఠశాలలు, సమర్థవంతమైన పర్యవేక్షణ చేపట్టిన మండలాలు, క్లస్టర్లు, తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంపొందించిన పాఠశాలలను గుర్తించి, ప్రశంసా పత్రాలు, అభినందన సందేశాలతో ప్రోత్సహించనున్నారు. రాష్ట్ర మార్గదర్శకాల ప్రకారం నెల మొత్తం విద్యార్థులు, సిబ్బంది వంద శాతం హాజరు సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక అభినందనలు లభించనున్నాయి. జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రతి వారం సమీక్షలు నిర్వహించడంతో పాటు, నవంబర్ 22 నుంచి 30వ తేదీ వరకు జిల్లా స్థాయిలో సమగ్ర పురోగతిని సమీక్షించనున్నారు. రాబోయే విద్యా సంవత్సరం లోనూ మెరుగైన హాజరు శాతాన్ని కొనసాగించేలా కార్యాచరణ రూపొందించనున్నారు. విద్యార్థుల ఆరోగ్యం, కుటుంబ పరిస్థితులు, ఇతర సమంజసమైన కారణాలను పరిగణనలోకి తీసుకుంటూ, ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రతి విద్యార్థి పాఠశాల విద్యను నిరంతరాయంగా కొనసాగించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, సమాజంలోని అన్ని వర్గాలు సహకరించాలని జిల్లా విద్యా శాఖ కోరింది. "ప్రతి రోజు పాఠశాలకు -- ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య" అనే లక్ష్యంతో జిల్లాలో ప్రత్యేక హాజరు మాసాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా విద్యా శాఖ కట్టుబడి ఉందని వెల్లడించింది.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీకి ముహూర్తం ఖరారు

ఈనెల 6న,రాష్ట్ర మంత్రుల చే లబ్ధిదారులకు పంపిణీ
అన్ని ఏర్పాట్లు పక్కాగా సిద్ధం చేయాలి: ఎమ్మెల్యే బిఎల్ ఆర్

మిర్యాలగూడ, నవంబర్ 02,(ప్రజాజ్యోతి):
ఏళ్ల తరబడి సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేదల



కల సహకారం కానుంది... కోట్ల రూపాయల ప్రజాధనంతో మిర్యాలగూడ మండలం శ్రీనివాస్ నగర్ సమీపంలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మాణం పూర్తయినప్పటికీ...ఏళ్ల తరబడి లబ్ధిదారులకు అందక శిధిలావస్థకు చేరుకున్న పరిస్థితుల్లో స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బి ఎల్ ఆర్) ప్రత్యేక చొరవతో సకల సౌకర్యాలతో లబ్ధిదారులకు పంచేందుకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను సిద్ధం చేశారు.ఈ నెల 6న, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ ల చేతులు మీదుగా లబ్ధిదారులకు అందించేందుకు ముహూర్తం ఖరారు చేశారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బి ఎల్ ఆర్) శ్రీనివాస్ నగర్ వద్ద ఏర్పాటుచేసిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను, సౌకర్యాలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ మాట్లాడుతూ,



ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చే మంత్రులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా సభా ప్రాంగణం,వేదిక ఏర్పాటు, పార్కింగ్, తాగునీరు, విద్యుత్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా కృషి చేస్తోందని, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ కార్యక్రమం పండుగవాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డివో ఎస్. రమణారెడ్డి, ఎం ఆర్ ఓ లు శ్రీనివాస శర్మ , శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ నర్రా శ్రీజ,ఎంపిడిఓ శేషగిరి శర్మ , ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంఘం జాతీయ మహాసభలు జయప్రదం చేయండి

-అకాల వర్షాలకు నష్టపోయిన రైతుల్ని ప్రభుత్వం ఆదుకోవాలి
-రైతు సంఘం నాయకులు ఎస్ఆర్ వెంకటేశ్వర్లు చింతపల్లి బయన్న

నార్కట్ పల్లి, నవంబర్ 2 (ప్రజా జ్యోతి):
నార్కట్ పల్లి మండలంలోని అవురవాణి గ్రామంలో రైతు సంఘం మహాసభ లను జయప్రదం చేయాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈనెల 15న ఎన్జీ కాలేజీలో లక్ష మంది రైతులతో బహిరంగ సభ ఉంటుందని అట్లాగే 14వ తేదీన గడియారం సెంటర్లో రైతు అగ్రి షో నాలుగు రోజులపాటు నిర్వహిస్తున్నామని అన్నారు.



అసలే ఎలినోవల్ల రైతులు ఇబ్బంది పడుతుంటే అకాల వర్షం వల్ల రైతులు పూర్తిగా నష్టపోయారని అధికారులు వెంటనే స్పందించి గ్రామాలలోకి వెళ్లి సర్వే చేసి రైతులకు,కౌలు రైతులకు ఎకరానికి 30వేల రూపాయలు నష్టపరి హారం కింద ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. ఔరవాణి నుండి కొండపాకని గూడెం వెళ్లే రోడ్డు కంకర తేలి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే రోడ్డు పూర్తి చేయాలని అన్నారు. బ్రాహ్మణ వెల్లంల ఉదయ సముద్రం నుండి గ్రామాలలో ఉన్న చెరువులకు నీరు నింపి రైతుల్ని ఆదుకోవలని నవంబర్ 15వ తేదీన నల్లగొండ ఎన్జీ కాలేజీలో జరిగే బహిరంగ సభకు జిల్లాలో రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు చెరుకు పెద్దులు ,కుమ్మరి శంకర్, దండు రవి,ఆమనగంటి ఐలయ్య, శాఖ కార్యదర్శి కల్లూరి కంఠమహేశ్వర్, నిరుడు కృష్ణారెడ్డి,నాగ చారి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకోండి

భువనగిరి,నవంబర్ 2(ప్రజాజ్యోతి):
తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో



అర్హులైన ప్రతి పట్టభద్రుడు తమ అమూల్యమైన ఓటును నమోదు చేసుకోవా లని తెలంగాణ రాష్ట్ర ప్రయివేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ల మేనేజ్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సూర్య నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రజాస్వా మ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, రాజ్యాంగం కల్పించిన ఈ హక్కును ప్రతి పట్టభద్రుడు సద్వినియోగం చేసుకోవా లనిసూచించారు.పట్టభద్రుల సమస్యలను శాసన మండలిలో సమర్థవం తంగా వినిపిం చేందుకు, విద్యావంతుల గొంతుకను బలంగా వినిపించేందుకు పట్టభద్రుల ఓటు ఎంతో కీలకమని పేర్కొన్నారు.
అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేసి,ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. యువత, ఉద్యోగులు,ఉపాధ్యా యులు,నిరుద్యోగ పట్ట భద్రులు ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకో వాలని విజ్ఞప్తి చేశారు.“ఓటు మన హక్కు ఓటు మన బాధ్యత. ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకొని ప్రజాస్వామ్య బలోపేతానికి తన వంతు కృషి చేయాలి” అని సూర్యనారాయణ రెడ్డి పిలుపునిచ్చారు.

ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ

ఆలేరు నవంబర్ 2 (ప్రజా జ్యోతి):
యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం ఆలేరు మున్సిపల్ చైర్ పర్సన్



బాలమణి భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి చైతన్య హాజరై మాట్లాడుతూ నవంబర్ రెండవ తేదీ నుంచి ఏడవ తేది వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమాన్ని పాడి రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 75 దూడలకు నట్టల నివారణ మందులను అందించమన్నారు. ఈ కార్యక్రమంలో మోరిగాడి జలంధర్, రాజబోయిన జలంధర్, కొండ సాయిరెడ్డి, మహేష్ ,లత ,సుభాష్ ,శ్రవణ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మారేపల్లి క్రాంతి కుమార్ పటేల్

హాలియా,నవంబర్ 2(ప్రజా జ్యోతి):



అనుముల మండలం మారేపల్లి గ్రామానికి చెందిన మారేపల్లి క్రాంతి కుమార్ పటేల్ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు.ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తం రావు పటేల్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు వాసుదేవుల వెంకట నరసయ్య పటేల్, రాష్ట్ర కోశాధికారి కంచి సత్యనారాయణ పటేల్, నాగార్జునసాగర్ నియోజక వర్గ కోఆర్డినేటర్ ఆకుల శ్రీనివాస్ పటేల్, మన్నేపల్లి కృష్ణ పటేల్‌లకు క్రాంతి కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడి సూచనల మేరకు సంఘం అభివృద్ధి, సభ్యుల సంక్షేమం,సామాజిక ఐక్యత కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ సభ్యులందరినీ సమన్వయం చేసుకుని ముందుకు సాగుతానని, త్వరలో భవిష్యత్ కార్యాచర ణపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు పట్టభద్రుల ఓటుతో గుణపాఠం చెప్పాలి

నిరుద్యోగులను, విద్యార్థులను, రైతులను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం
పట్టభద్రుల ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలి
కోదాడ మాజీ శాసనసభ్యుడు బొల్లం మల్లయ్య యాదవ్

కోదాడ టౌన్, నవంబర్ 02 (ప్రజా జ్యోతి):
కోదాడ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన & సమీక్ష మరియు పత్రికా విలేకరుల సమావేశం కోదాడ నియోజకవర్గ



మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ వారి నివాసం నందు నిర్వహించారు. ఈకార్యక్రమంలో కోదాడ మాజీ శాసనస భ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ , ఖమ్మం –నల్గొండ– వరంగల్ జిల్లాల బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి ఎన్నికల పరిశీలకులు తిప్పన విజయ సింహారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ ఖమ్మం–నల్గొండ–వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఓటు నమోదు ప్రక్రియ చివరి దశకు చేరుకుందని, గత నాలుగు వారాలుగా పార్టీ శ్రేణులు ప్రతి ఇంటి తలుపు తట్టి ఓటర్లను చైతన్యప రిచారని, గత ఉప ఎన్నికల్లో మొత్తం 4,65,000 ఓట్లు నమోదు కాగా, ఈసారి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల చొరవతో ఆ సంఖ్య ఇప్పటికే 5 లక్షలు దాటిందని పేర్కొన్నారు. కోదాడ నియోజకవ ర్గంలో గతంలో 13,780 పైచిలుకు ఓట్లు ఉండగా, 2023 అక్టోబర్ 1 నాటికి డిగ్రీ పూర్తయిన వారికి అవకాశం కల్పించడంతో అదనంగా మరో 2 నుంచి 3 వేల ఓట్లుపెరిగి, మొత్తం 17 వేల ఓట్ల వరకు చేరే అవకాశం ఉందని అంచనా తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి నిరుద్యోగులు, విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చి ఇప్పుడు వారిని పూర్తిగా గాలికొదిలేసిందని



విమర్శించారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, సింగరేణి, ప్రైవేట్ ఉద్యోగులు, ఆర్టిజన్లకు ఎలాంటి భద్రత లేకుండా పోయిందని, అలాగే రైతులకు కరెంట్, సాగునీరు, కనీసం యూరియా కూడా దొరకని పరిస్థితి నెలకొందని మండిపడ్డారు. గత మూడేళ్లుగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు లేవని, జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వడం లేదని, కేసీఆర్ తెచ్చిన గురుకుల వ్యవస్థను సర్వనాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున మిగిలి ఉన్న ఈ కొద్ది రోజుల్లో విద్యావంతులు, మేధావులు ఫారం–18 నింపి తప్పకుండా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరుతూ, ప్రస్తుత రాక్షస పాలనను అంతమొందించడానికి పట్టభద్రులు తమ ఓటును అస్త్రంగా వాడుతూ ఒక నిశ్శబ్ద విప్లవం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పి, భవిష్యత్తులో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో వారికి ప్రజాదరణ లేదని స్పష్టం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

లాల్ తండాలో వారపు సంతకు శ్రీకారం..

సంతను ప్రారంభించిన సర్పంచ్ తేజావత్ అండాలు

మోతె నవంబర్2 (ప్రజాజ్యోతి):
గ్రామీణ ప్రజలకు స్థానికంగానే నిత్యావసర సరుకులు అందుబాటు లోకి తీసుకురావాలనే లక్ష్యంతో సూర్యాపేట జిల్లా మోతె మండలం



లాల్ తండాలో నూతన వారపు సంతను ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ బానోతు ఆండాలు చొరవతో ఏర్పాటు చేసిన ఈ సంతను సోమవారం మాజీ జెడ్పీటీసీ బానోతు మాత్యానాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఇకపై ప్రతి సోమవారం లాల్ తండాలో వారపు సంత నిర్వహించనున్నారు. కూరగాయలు, నిత్యావసర సరుకులు, ఇతర వస్తువులు ఒకేచోట లభించనున్నాయి. దీంతో లాల్ తండాతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు దూర ప్రాంతాలకు వెళ్లే ఇబ్బందులు తప్పనున్నాయి.
వారపు సంత ఏర్పాటుతో స్థానిక వ్యాపారులకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు గ్రామీణ ఆర్థిక కార్యకలాపాలకు ఊతం లభించనుంది. గ్రామంలోనే సంత అందుబాటులోకి రావడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్ ఆండాలుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బానోతు సాలమ్మ సైదులు, మాజీ సర్పంచ్ భద్రమ్మ బాలాజీ, కీలుగాని వెంకన్న, బానోతు శీను (పంతులు), పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

అకాల వర్షానికి దెబ్బతిన్న పంట నష్టం అంచనాలను అధికారులు సిద్ధం చేయాలి

నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి
అధికారులకు ఎమ్మెల్యే బిఎల్ ఆర్ సూచన
క్షేత్రస్థాయిలో సాగు క్షేత్రాల పరిశీలన

దామరచర్ల,నవంబర్ 02,(ప్రజాజ్యోతి):
అకాల వర్షానికి ఆగమైన పంట నష్టం అంచనా వేసి నివేదికను సమర్పించాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) అధికారులను ఆదేశించారు. సోమవారం దామరచర్ల మండలం లోని బెట్టేతండా,రాళ్లవాగు తండా గ్రామాల్లో ఇటీవల అర్నాబ్ తుఫాన్ దాటికి వీచిన ఈదురుగాలులు, కురిసిన వర్షాలకు నేలకొరిగిన వరి పంటలను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట నష్టానికి సంబంధించిన వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అకాల గాలివానల కారణంగా పంట దెబ్బతిని తీవ్రంగా నష్టపోయిన రైతులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం సంబంధిత వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, గాలివానల కారణంగా జరిగిన పంట నష్టాన్ని వెంటనే క్షేత్రస్థాయిలో అంచనా వేసి, నష్ట వివరాలతో నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు.నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగిన పరిహారం అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలనిఅధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అండగా ఉంటుందని, పంట నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం లో స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





అధ్యక్ష కార్యదర్శులకు సన్మానం

ఆలేరు నవంబర్ 2 (ప్రజా జ్యోతి):
ఇటీవల భారతీయ జనతా యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా పేరేపు ఆనందు భారతీయ జనతా యువమోర్చా జిల్లా కార్యవర్గంలో చోటు దక్కినందుకు సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో పండిట్ దిన్ దయాల్



ఉపాధ్యాయ సేవ సంస్థ ఆధ్వర్యంలో అధ్యక్షుడు మైదం భాస్కర్ ను ఉపాధ్యక్షుడు పేరేపు ఆనందును అభినందిస్తూ శాలువతో చత్రపతి శివాజీ మెమొంటుతో ఘన సన్మానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా స్థాయి లీడర్ అయినందుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ రాబోయే రోజుల్లో కూడా యువజన సమస్యలపై పోరాడుతానాని తెలిపారు. భారతీయ జనతా పార్టీ గానేడు భారతదేశ చరిత్రను మూలాలను ప్రపంచ దేశాలకు తెలియజేసే విధంగా మన ప్రియతమ ప్రధాన నరేంద్ర మోడీ చేస్తున్న కృషిని భారతదేశ ప్రజలు గర్వించే విధంగా ప్రపంచ దేశాలకు పోటీపడే విధంగా మన దేశం ఉన్నందున గర్వకారణం గా ఉందన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీ ఐదో వార్డ్ కౌన్సిలర్ పానిక్ అంటే సంపత్ ఆనందుకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనని స్వచ్ఛంద సేవ సంస్థ గౌరవ సలహాదారుడు సిద్దులు, గుజ్జా అశోక్ ఆలేటి శ్రీకాంత్ వల్లోజు సురేష్ వినయ్ శ్రావణ్ రవి సతీష్ సాయికృష్ణ శరత్ వెంకటేష్ యశ్వంతు సాయి గణేష్ సన్నీ వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే లో కోదాడ విద్యార్థుల పతకాల పంట

కోదాడ టౌన్ ,నవంబర్ 02 (ప్రజా జ్యోతి):
ఖమ్మం పట్టణంలోని వర్తక సంఘం భవనం నందు 32వ నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్ జల్లెల శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ఆదివారం జరిగినటువంటి ఈ పోటీలలో నేతాజీ కరాటే అకాడమీ కోదాడకు చెందిన కుందూరు రూపక్,గోలి కార్తిక,మామిడి అశ్విక్,గోలి గుణసింహ, అనిపంగు కాంక్ష, కొన్నే ప్రణవ్, మామిడి ధార్మిక విద్యార్థులు కరాటేలో వారి





నైపుణ్యాన్ని ప్రదర్శించి బంగారు,వెండి పతకాలను గెలుపొందారు.ఈ టోర్నమెంట్ కి ముఖ్యఅతిథిగా హాజరైనటువంటి గ్రాండ్ మాస్టర్,ప్రముఖ సినీ నటుడు సుమన్ మాట్లాడుతూ విద్యార్థినిలకు ఆత్మ రక్షణకై కరాటే నేర్చుకుని ఉండాలని, ముఖ్యంగా నేటి మహిళలపై జరుగుతున్న అగత్యాలకు ధీటుగా ఎదుర్కొనేందుకు వారి ఆత్మ రక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందని సూచించారు.కరాటే ద్వారా శారీరక దృఢత్వం మానసిక స్థితి ఏకాగ్రత పెంపొందించుకొనుటకై కరాటే ఎంతో పడుతుందని తెలిపారు. తదనంతరం ఆయన నేతాజీ కరాటే అకాడమీ (జే కే ఏ డబ్ల్యూ ఎఫ్) మాస్టర్ కుందూరు సూర్యను మెమెంటుతో సత్కరించి అభినందించారు.

నట్టల నివారణ మందులు పంపిణీ

ఆలేరు నవంబర్ 2 (ప్రజా జ్యోతి):
యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం షారాజుపేట గ్రామంలో



సోమవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో దూడల నట్టల నివారణ కార్యక్రమం గ్రామ సర్పంచ్ కంతి మధు నిర్వహించారు ఈ కార్యక్రమా నికి పశు వైద్యాధికారి యాకుబ్ నాయక్ హాజరై మాట్లాడుతూ దూడల ఆరోగ్య సంరక్షణలో నట్టల నివారణ మందులు ఎంతో కీలకపాత్ర పోషిస్తున్నాయని వీటివల్ల దూడలు ఆరోగ్యంగా ఎదిగి పశుసంపద రద్దు చెందుతుందని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 57 దూడలకు ఉచితంగా నటన నివారణ మందులను వేశారు. ఈ కార్యక్రమంలో జే వి ఓ నరసింహ గోపాలమిత్రు సుధాకర్ శ్రీకాంతు గోపి తదితరులు పాల్గొన్నారు

నీటి పొదుపుతోనే భవిష్యత్తుకు భరోసా

ఇందల్వాయి ప్రజా జ్యోతి నవంబర్. 2

ధర్పల్లి మండల కేంద్రంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు, అరితడి పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించడంతో పాటు నీటి సంరక్షణపై కళాజాత బృందం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాజాత బృందం సభ్యులు



తమ ప్రదర్శనల ద్వారా నీటిని పొదుపుగా వినియోగించాలని, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు వివరించారు. భూగర్భ జలాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటల సాగులో మార్పులు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సూచనలు, నిర్ణయాలకు అనుగుణంగా రైతులు పంటల ఎంపిక చేసుకోవాలని, నీటి వినియోగం అధికంగా ఉండే వరి సాగుకు బదులుగా అరితడి పంటల సాగుపై దృష్టి సారించాలని కళాజాత బృందం సభ్యులు తమ ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు. క్రాంతి సాయి ఆధ్వర్యంలో డప్పు రాజు రాంపూర్ సాయి , తొగరి నరసయ్య ప్రశాంత్ పోశెట్టి సతీష్. రాజేందర్ రవి నాయక్ రషీద్ మనోజ మీనా సవిత సమత తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు నీటి సంరక్షణ ఆవశ్యకతను వివరించారు. భవిష్యత్తు తరాలకు నీటి కొరత లేకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచే నీటి పొదుపును అలవాటు చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు.

గౌరారం, లింగాపూర్, జీకే తండా గ్రామాల్లో భూ రీసర్వే

ఇందల్వాయి (ప్రజా జ్యోతి) నవంబర్. 2

ఇందల్వాయి మండలంలోని గౌరారం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న గౌరారం, లింగాపూర్, జీకే తండా గ్రామాలకు సంబంధించి భూ రీసర్వే



కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏడీ శ్రీనివాసులు, తహసీల్దార్ జి. బాలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మూడు గ్రామాల ప్రజలతో మాట్లాడి భూ రీసర్వే వివరాలను తెలియజేశారు. తహసీల్దార్ బాలయ్య మాట్లాడుతూ, ఇప్పటికే పట్టాలు పొందిన వారి భూములతో పాటు ఇప్పటివరకు పట్టాలు రాని వారి భూములను కూడా రీసర్వే చేయించి, అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలించి అర్హులకు భూములకు సంబంధించిన వివరాలు, పట్టాలు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరికైనా పట్టాలు రాకపోతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి వద్ద ఉన్న ఆధారాల ప్రకారం భూములను సర్వే చేసి వివరాలు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరారం గ్రామ సర్పంచ్ గోపి హేమలత, జీకే తండా సర్పంచ్ శిరీష మహిపాల్, జీకే తండా ఉపసర్పంచ్, గౌరారం ఉపసర్పంచ్, మూడు గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో ఘనంగా శ్రీపాద రాజేంద్ర చారి స్మారక తెలంగాణ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

కమ్మర్ పల్లి (ప్రజాజ్యోతి)నవంబర్ 02 : కమ్మర్ పల్లి బ్యాడ్మింటెన్ అసోసియేషన్



ఆధ్వర్యంలో శ్రీపాద రాజేంద్ర చారి స్మారక బ్యాడ్మింటన్ టోర్నమెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు లుక్క గంగాధర్ సభ అధ్యక్షత మంగళవారం నిర్వహించిన ముగింపు కార్యక్ర మానికి గౌరవ బాల్కొండ శాసనసభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి గారు హాజరై ఫైనల్ మ్యాచ్ ను తిలకించి విజేతలకు బహుమతులను అందజేశారు ఈ సందర్భంగా ప్రశాంత్ రెడ్డి గారు మాట్లాడుతూ క్రీడలు అనేటివి సంబంధాలను మెరుగుపరచుకోవడానికి ఆప్యాయత అనురాగాలకు కేంద్ర బిందువు ఈలాంటి టోర్నీలో జరుగుతుందని అన్నారు కే బి ఏ సభ్యులు సొంత నిధులతో ఈ ఇండోర్ స్టేడియం నిర్మాణం చేసుకోవడాన్ని చూస్తే ఈ సభ్యులకు క్రీడలపై ఎంత మమకారం ఉందో అర్థమవుతుంది అని ప్రశంసించారు రాజేంద్ర చారి మన మధ్యన భౌతికంగా లేకున్న వారి ఆలోచన విధానాలు ఆశయాలను కేబీఏ నిర్వహించడం నిజంగా అభినందనీయమని తెలిపారు కమ్మర్పల్లి మండలం ఏ ప్పటి నుండో స్పోర్ట్స్ కు పుట్టినిల్లని తెలంగాణ స్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహించడం అభినందన నియం అన్నారు కమ్మర్ పల్లి మండలంలో మినీ స్టేడియం నిర్మాణం చేయడం ఇక్కడ క్రీడాకారు లను ప్రోత్సహించడమే అని అలాగే దానికి సిసి రోడ్డు నిర్మాణం మరియు ప్రహరి గోడ నిర్మాణం విడుదలవారీగా చేపడతామని అన్నారు మొదటి విజేతకు కరీంనగర్ జిల్లా చెందిన డబుల్స్ లో హరీష్. మురళీధర్ కు 8000 నగదు తో పాటు ట్రోఫిని కైవసం చేసుకున్నారు అలాగే రెండవ విజేతకు కమ్మర్ పల్లి బ్యాడ్మింటన్ అసోసియే షన్ కి చెందిన సభ్యులు పెంట కిషన్. ఎలేటి మోహన్ రెడ్డి 5000 నగదుతో ట్రోఫీని అందజేశారు మూడవ విజేతకు బైంసా కు చెందిన నవీన్. సాయి లకు 3000 రూపాయలు నగదు తో పాటు ట్రోఫిని అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొత్తపల్లి హారిక, ఉప సర్పంచ్ అశోక్, వీడిసి అధ్యక్షుడు మల్యాల సుభాష్ గౌడ్, క్లబ్ సలహాదారులు అహ్మద్ హుస్సేన్, పెంట కిషన్ కార్యదర్శి చిలివేరి పవన్ కుమార్ సభ్యులు ఉపాధ్యక్షులు భోగ శ్యామ్ కోశాధికారి చిలువెరి ప్రసాద్, చింత ప్రదీప్, ఆకుల బాలకృష్ణ, జోగ గంగాధర్, సుంకట రమేష్, సురంగి చంద్రశేఖర్, కొమ్ముల శ్రీను, నాగరాజ్, శ్రీపాద రాహుల్ మరియు వివిధ జిల్లా నుంచి వచ్చిన క్రీడాకారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

భారీ వర్షం.. కొట్టుకుపోయిన ధాన్యం!

కళ్లముందే నీటిపాలైన కష్టార్జితం.. ధాన్యం కాపాడుకునేందుకు రైతుల ఆరాటం

బీర్కూర్, నవంబర్ 2 (ప్రజాజ్యోతి):

అకాలంగా కురిసిన భారీ వర్షం అన్నదాతలకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఆరబెట్టిన ధాన్యం వర్షపు నీటిలో కొట్టుకుపోవడంతో రైతులు కంటతడి పెట్టారు. చేతికొచ్చిన పంటను అమ్ముకునే సమయంలో ఊహించని వర్షం కురవడంతో రైతులకు తీవ్ర



ఇబ్బందులు ఎదురయ్యాయి. సోమవారం మధ్యాహ్నం బీర్కూర్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షం రైతుల ఆశలను నీటిపాలు చేసింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని బాన్సువాడ, బోధన్ నియోజకవ ర్గాల్లో నిజాంసాగర్ ప్రాజెక్టు నీటి ఆధారంగా ఈ వానకాలం సీజన్‌లో పెద్ద ఎత్తున వరి సాగు చేపట్టారు. పంట దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో రైతులు సంతోషంగా ఉన్నారు. సుమారు పక్షం రోజులుగా వరి కోతలు ప్రారంభమయ్యాయి. మరోవైపు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ, ప్రైవేట్ వ్యాపారులు అధిక ధరలు చెల్లిస్తుండటంతో పలువురు రైతులు పచ్చి ధాన్యాన్ని వారికి విక్రయిస్తున్నారు. మరికొందరు రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి అమ్ముకునేం దుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొన్నారు. అప్పటికే ధాన్యం ఆరబెట్టిన రైతులు వర్షం నుంచి కాపాడుకునేం దుకు అప్రమత్తమై ధాన్యాన్ని కుప్పలుగా చేసేందుకు ప్రయత్నించారు. అయితే వర్షం తీవ్రత ఎక్కువగా ఉండటంతో కొంత ధాన్యం వర్షపు నీటిలో కొట్టుకుపో యింది. కొంతమంది రైతులు నీటిలో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని చేతులతో ఏరివేసి ఒకచోట కుప్పగా చేర్చేందుకు ప్రయత్నించారు. బీర్కూర్, తిమ్మాపూర్, కిష్టాపూర్, నస్రుల్లాబాద్, బైరాపూర్ తదితర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షం అన్నదాతలకు తీవ్ర నష్టాన్ని కలిగించింది. ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడిసిపోవ డంతో పాటు కొంత మేర కొట్టుకుపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచి దిగుబడులు రావడంతో పంట అమ్ముకుని లాభాలు పొందాలనే ఆశతో ఉన్న రైతులకు అకాల వర్షం తీవ్ర నిరాశను మిగిల్చింది. కష్టపడి పండించిన పంట కళ్లముందే వర్షపు నీటిలో కొట్టుకుపోవడంతో అన్నదాతలు కన్నీటి పర్యంతమయ్యారు. పంట దిగుబడులపై ఆనందంగా ఉన్న రైతులకు సోమవారం కురిసిన భారీ వర్షం తీరని నష్టాన్ని మిగిల్చింది.



నిలోఫర్‌లో నాటు బాంబు పేలుడు బాధిత చిన్నారులకు పోచారం పరామర్శ


మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచన.. కుటుంబ సభ్యులకు భరోసా

బాన్సువాడ, నవంబర్ 2 (ప్రజాజ్యోతి):

బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామ శివారులోని ఎర్రమన్ను కుచ్చ



ప్రాంతంలో ఆదివారం పందుల వేట కోసం ఉపయోగించే పేలుడు పదార్థాలు ప్రమాదవశాత్తు పేలిన ఘటనలో గాయపడిన చిన్నారులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దండ్ల అంజలి (3), దండ్ల శ్రీదేవి (5)లను సోమవారం ఆయన



పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనలో ఏడుగురు గాయపడగా, వారిలో ఒకరిని నిజామాబాద్‌కు, ఇద్దరు చిన్నారులను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రికి, మరొకరిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించిన విషయం తెలిసిందే. నిలోఫర్ ఆసుపత్రికి చేరుకున్న పోచారం శ్రీనివాసరెడ్డి చిన్నారులకు అందిస్తున్న వైద్య సేవలపై వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. బాధిత చిన్నారులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు కల్పించాలని వైద్యులకు సూచించారు. అనంతరం చిన్నారుల కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. చిన్నారులు త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో నిలోఫర్ ఆసుపత్రి ఆర్ఎంఓ, ఆసుపత్రి సూపరింటెండెంట్, తాడ్కోల్ సర్పంచ్ రమేష్, మాజీ జడ్పీటీసీ గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేల, నీటి సంరక్షణతోనే సుస్థిర వ్యవసాయం

ప్రకృతి వ్యవసాయానికి రైతులు ప్రాధాన్యత ఇవ్వాలి

మండల వ్యవసాయ అధికారి సారిక

రాయికోడ్ నవంబర్ 02(ప్రజా జ్యోతి):

రైతులు సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తూ నేల,నీటి వనరులను సంరక్షించుకోవా



లని మండల వ్యవసాయ అధికారి సారిక సూచించారు.సోమవారం మండలంలోని షాపూర్ గ్రామంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణ, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సారిక మాట్లాడుతూ.. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించుకోవాలని,అందు బాటులో ఉన్న నీటిని అవసరానికి అనుగుణంగా పొదుపుగా వినియోగించుకోవాలని తెలిపారు.వ్యవ సాయంలో సేంద్రియ ఎరువులు,జీవన ఎరువుల వాడకాన్ని పెంచి రసాయన ఎరువులు,పురుగుమం దుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు.ప్ర కృతి వ్యవసాయంతో నేల సారాన్ని కాపాడుకోవ డంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని వివరించారు.రైతులందరూ నీరు, నేల సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ స్థిరమైన వ్యవసాయం వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏటీఎం రమేష్,ఏఈఓలు లక్ష్మీకాంత్,శివకుమార్,ఉపసర్పంచ్ నాగేందర్ రావు,గ్రామ రైతులు పాల్గొన్నారు.

వాల్టా చట్టం ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు!

అంకురా వెంచర్‌లో అనుమతులు లేని రెండు బోర్లు సీజ్

జిల్లా అధికారుల ఆదేశాలతో రంగంలోకి దిగిన రెవెన్యూ యంత్రాంగం..

కొండాపూర్ ప్రజా జ్యోతి:

వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి అనుమతులు లేకుండా బోర్లు తవ్వితే కఠిన చర్యలు తప్పవని కొండాపూర్ తహసీల్దార్ అశోక్ హెచ్చరించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండల పరిధిలోని మాందాపూర్ గ్రామ శివారులో ఉన్న అంకురా వెంచర్‌లో సర్వే నంబర్ 116లో అనుమతులు లేకుండా తవ్వినన రెండు కొత్త బోర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు.

నీటి సంక్షోభం నేపథ్యంలో కఠిన ఆదేశాలు:

ఈ సందర్భంగా తహసీల్దార్ అశోక్ మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారి ఆదేశాల మేరకు మండలంలోని రెవెన్యూ ఇన్స్పెక్టర్లు (ఆర్ఐ), గ్రామ పంచాయతీ అధికారులు (జీపీఓ) అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యవసాయ క్షేత్రాలు, చెరువుల సమీప ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా కొత్త బోర్లు తవ్వకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. వాల్టా చట్ట నిబంధనలను ఉల్లంఘిస్తూ బోర్లు తవ్వినట్లు గుర్తిస్తే నిబంధనల ప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రస్తుత నీటి సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని పేర్కొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు!:

బోర్ల తవ్వకాలపై పర్యవేక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా తీవ్రంగా పరిగణిస్తామని తహసీల్దార్ హెచ్చరించారు. నిబంధనల అమలులో సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నీటి వనరుల పరిరక్షణకు అవసరమైన చర్యలు కఠినంగా తీసుకోవాలని ఆదేశించారు.నీటి వనరుల పరిరక్షణే లక్ష్యం.. వాల్టా చట్ట ఉల్లంఘనలకు చెక్ పెట్టడమే ధ్యేయం!



ఎమ్మార్పీఎస్ న్యాల్కల్ మండల అధ్యక్షునిగా సొన్నయిల సంసోన్ మాదిగ

జహీరాబాద్, నవంబర్ 02(ప్రజా జ్యోతి న్యూస్)

పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సోమవారం జహీరాబాద్ నియోజక వర్గం, మండల కేంద్రమైన న్యాల్కల్ లో ఎమ్మెస్సి జిల్లా నాయకులు జయరాజ్ మాదిగ అధ్యక్షతన న్యాల్కల్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో నిర్వహించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మైసగళ్ల భూచేంద్ర మాదిగ ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు, అబ్రహం మాదిగ ఎంఎస్పి మాజీ జిల్లా అధ్యక్షులు పాల్గొని న్యాల్కల్ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షునిగా సొన్నయిలా సంసోన్ మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారు ఆదేశాల మేరకు న్యాల్కల్ అన్ని గ్రామ కమిటీలు ఎమ్మార్పీఎస్ మరియు ఎమ్మెస్ఎఫ్ విద్యార్థి కమిటీలు పూర్తి చేసుకుని భవిష్యత్తు ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని ఈనెల 20 లోపు విద్యార్థి కమిటీలు పూర్తి చేసుకోవాలని అసమా నతలు లేని సమసమాజ నిర్మాణానికి పాటుపడుతూ మందకృష్ణ మాదిగ గారి అడుగుజాడల్లో నడవాలని పిలుపునివ్వడం జరిగింది. ఇట్టికార్యక్రమంలో ఉల్లాస్ మాదిగ జహీరాబాద్ ఏమ్మార్పీఎస్ ఇంచార్జి, నిర్మల్ మాదిగ మొగుడం పల్లి అధ్యక్షులు, వినోద్, శరణప్ప, సుందర్, ప్రశాంత్, సుక్కప్ప,హనోక్, నిఖిల్, చిన్న, నాథనియల్, అభిరామ్, నవీన్, సునీల్, సురేష్, ప్రమోద్, సుందరాజ్, శ్రీను, రమేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక విద్యా ఉపాధ్యాయుడి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సాపూర్ 2 నవంబర్ (ప్రజా జ్యోతి):

పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గెస్ట్ స్పెషల్ నీడ్స్ ఎడ్యుకేటర్ పోస్టు భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సామ్యా నాయక్ తెలిపారు. ఈ పోస్టుకు నెలకు రూ.16,500 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు, ఐదు నెలల పాటు తాత్కాలిక ప్రాతిపదికన నియామకం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీతో పాటు స్పెషల్ ఎడ్యుకేషన్‌లో బీఈడీ లేదా జనరల్ బీఈడీతో పాటు స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ఏడాది డిప్లొమా/పీజీ డిప్లొమా పూర్తి చేసిన వారు అర్హులు. ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హతల ధ్రువపత్రాలు, ఆర్‌సీఐ నమోదు కార్డు, ఆధార్ ప్రతులు, బయోడేటాతో పాఠశాలలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రకటనలో దరఖాస్తుల చివరి తేదీ 03-11-2023గా ఉంది. ఇది గడిచిన తేదీ. 2026 నవంబర్ 3 అని తెలిపారు

భూ భారతి రీ సర్వేలో ప్రతి భూ యజమాని భాగస్వామి కావాలి

జిల్లా అదనపు కలెక్టర్ నాగేష్

వెల్దుర్తి (ప్రజాజ్యోతి) నవంబర్ 02:

భూ భారతి రీ సర్వే ప్రక్రియలో రైతులు, భూ యజమానులు, గ్రామ ప్రజలు చురుకుగా భాగస్వాములై అధికారులకు సహకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎం నాగేష్ విజ్ఞప్తి చేశారు. భూములకు సంబంధించిన వివరాలు, సరిహద్దులు, హక్కుల





విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రజలు తమ వద్ద ఉన్న భూ పత్రాలను అధికారులకు అందించి, సర్వే ప్రక్రియలో భాగస్వాములు కావాలని సూచించారు. సోమవారం వెల్దుర్తి మండలం పెద్దాపూర్ గ్రామ పరిధిలోని మెల్లూరులో నిర్వహించిన భూ భారతి రీ సర్వే గ్రామసభకు అదనపు కలెక్టర్, ఆర్డీవో బావయ్య, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కిషన్ హాజరై రీ సర్వే కార్యక్రమాలను పరిశీలించారు.ఈ సందర్భంగా భూ యజమానులు తమ భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవాలని, ఏవైనా అభ్యంతరాలు లేదా సందేహాలు ఉంటే గ్రామసభలో అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ప్రజలకు సూచించారు. రీ సర్వే ప్రక్రియ పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రంగారెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి: అదనపు కలెక్టర్ నగేష్

నవంబర్2 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి:

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత నిస్తూ, వాటిని పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని అదనపు కలెక్టర్



అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్ , డి ఆర్ వో అంబాదాస్ రాజేశ్వర్ లు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించాలని, సమస్యకు సంబంధించిన వివరాలను నిర్ధారించుకుని నిబంధనల మేరకు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఫిర్యాదుల పరిష్కారంలో అనవసర జాప్యం చేయకుండా, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 62 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో భూ భారతి 25 ,ఇందిరమ్మ ఇండ్లు 12 ,పెన్షన్ 01,ఇతర 24 మొత్తం 62అందాయన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాలికపై వేధింపులు.. సోదరుడిపై రాయితో దాడి

నిందితుడికి మూడేళ్ల జైలు .. రూ.20 వేల జరిమానా

నవంబర్ 2 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి :




బాలికపై లైంగిక వేధింపు లకు పాల్పడటమే కాకుండా, ఆమె సోదరుడిపై రాయితో దాడి చేసిన కేసులో గొల్ల మధు (25) అనే వ్యక్తికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ మెదక్ ఫాస్ట్ ట్రాక్ పోక్సో కోర్టు తీర్పు వెల్లడించింది. ఈ వివరాలను మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు వెల్లడించారు.నవంబర్ 2024లో 16 సంవత్సరాల బాలిక ఐకేపీ సెంటర్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా మధు ఆమె చేయి పట్టుకుని లాగి, తనను ప్రేమించాలని చెబుతూ అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక గట్టిగా కేకలు వేయడంతో ఆమెను వదిలిపెట్టాడు. ఈ విషయాన్ని బాలిక కుటుంబ సభ్యులకు తెలియజేయగా, ఆమె సోదరుడు మధును ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహించిన మధు రాయితో అతడి తలపై దాడి చేయడంతో గాయాల య్యాయి.ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శంకరంపేట ఆర్ ఎస్ఐ ఎ. నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో సమర్పించారు. విచారణ సందర్భంగా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. బాలయ్య బలమైన వాదనలు వినిపించారు. సాక్ష్యా ధారాలను పరిశీలించిన ఫాస్ట్ ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభవల్లి నిందితుడికి మూడేళ్ల కఠిన కారగారా శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ఎసై నారాయణ, పీపీ బాలయ్య, కోర్టు లైజనింగ్ అధికారి ఎస్ఐ బి. విఠల్, కానిస్టేబుల్ జి. కృష్ణ గౌడ్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ శ్రీధర్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు. మహిళలు, బాలికలపై వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, బాధితులు భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని ఎస్పీ సూచించారు.

ఎమ్మార్పీఎస్ చేర్యాల పట్టణ అధ్యక్షుడిగా గంధమాల మహేష్ ఎన్నిక

చేర్యాల నవంబర్02(ప్రజాజ్యోతి):

చేర్యాల పట్టణ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా గంధమాల మహేష్ మాదిగ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవులపల్లి రాజేందర్ మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమిగారి రాజేందర్ మాదిగ ఆధ్వర్యంలో మహేష్ కు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పట్టణ అధ్యక్షుడు గంధమాల మహేష్ మాదిగ మాట్లాడుతూ.. మాదిగ, మాదిగ ఉపకులాల వారందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం నుంచి మాదిగలకు రావాల్సిన హక్కులు, వాటా సాధన కోసం కృషి చేస్తానని, మాదిగలకు ఎక్కడైనా అన్యాయం జరిగితే సహించేది లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు రామగల్ల నాగరాజు, భూమిగారి దామోదర్, సర్వగల యాదయ్య, మల్లిగారి వినయ్, భూమిగారి విజయ్, సంజిత్, చుంచు సురేష్, చంటి, రాజు, వివేక్, కిరణ్, పోతుగంటి సాయి, ఎర్రోళ్ల హర్షిత్, భూమిగారి దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐఆర్-2026 ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా పూర్తి చేయాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

ఏఎస్‌డీ జాబితా, డిలీషన్ జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

నవంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురణకు సిద్ధం కావాలి

నవంబర్ 2, మెదక్ జిల్లా బ్యూరో, ప్రజాజ్యోతి :

తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్–2026) ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్–2026 ప్రక్రియ పురోగతి, పెండింగ్‌లో ఉన్న అంశాలు, తుది ఓటర్ల జాబితా ప్రచురణకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఏఎస్‌డీ (అబ్సెంట్, షిఫ్టెడ్, డెత్) జాబితాలోని ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించిన ఓటర్లు, డూప్లికేట్ ఓటర్ల వివరాలను సంబంధిత ఆధారాలతో ధ్రువీకరించాలని, సరైన



సూచించారు. ఫారం–6 ద్వారా కొత్త ఓటరు నమోదుకు వచ్చిన దరఖాస్తులు, ఫారం–7 ద్వారా వచ్చిన అభ్యంతరాలు, ఓటరు పేరు తొలగింపునకు సంబంధించిన అభ్యర్థనలు, ఫారం–8 ద్వారా వచ్చిన చిరునామా మార్పులు, ఓటరు వివరాల సవరణలు తదితర దరఖాస్తుల పరిష్కార స్థితిని నిరంతరం సమీక్షించాలని ఆదేశించారు. ఎలాంటి దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా నిర్ణీత గడువులోగా విచారణ పూర్తి చేసి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓటర్ల జాబితాలో పేరు చేర్పులు, తొలగింపులు, విచారణ లేకుండా ఏ ఒక్క అర్హుడైన ఓటరు పేరు తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. డిలీషన్ జాబితాలో ఉన్న ప్రతి ఓటరు వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలని, పేరు తొలగించడానికి గల కారణాలు, అందుకు సంబంధించిన ఆధారాలను తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. ఓటరు నుంచి వచ్చిన అభ్యంతరాలు, వివరణలు, సమర్పించిన పత్రాలను కూడా పరిగణనలోకి తీసుకొని ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నిర్ణయాలు తీసుకోవాలని



సమర్పించిన ఆధారాలు, సంబంధిత పత్రాలను క్రమపద్ధతిలో భద్రపరచాలని తెలిపారు. భవిష్యత్తులో ఏవైనా అభ్యంతరాలు వచ్చినప్పుడు సంబంధిత రికార్డులు అందుబాటులో ఉండేలా పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. నోటీసులు జారీ చేసిన ప్రతి ఓటరుకు నిబంధనల ప్రకారం స్పందించేందుకు, తమ వాదనలు వినిపించేందుకు తగిన అవకాశం కల్పించాలని తెలిపారు. క్షేత్రస్థాయి విచారణను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ప్రతి దశలో తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. జిల్లాల వారీగా ఏఎస్‌డీ జాబితా, డిలీషన్ జాబితా, ఫారం–6, 7, 8 దరఖాస్తుల పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. తుది ఓటర్ల జాబితా ప్రచురణకు ముందు అన్ని వివరాలను మరోసారి పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఎస్ఐఆర్–2026 ప్రక్రియకు సంబంధించి సవరించిన షెడ్యూల్‌ను ప్రకటించిన నేపథ్యంలో, నవంబర్ 26, 2026వ తేదీలోగా నోటీసుల జారీ, విచారణలు, క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. నవంబర్ 30, 2026వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురించాల్సి ఉన్నందున, ఈ గడువులను దృష్టిలో ఉంచుకొని అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల విభాగానికి చెందిన అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు భవిష్యత్తులో దేశానికి మంచి నాయకులుగా ఎదగాలి

జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

రాష్ట్రస్థాయి మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో మెదక్ జిల్లా కు ప్రథమ స్థానం కైవసం

ఉత్తమ పార్లమెంటరిన్ గా అద్భుత ప్రతిభ సాధించిన ఆర్తి చంద్రను అభినందించిన జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

నవంబర్ 2, మెదక్ జిల్లా బ్యూరో, ప్రజాజ్యోతి :

కలెక్టర్ ఛాంబర్ లో మాక్ పార్లమెంట్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని కలెక్టర్ ఘనంగా సత్కరించారు.సంద





ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని ఎస్ సి ఇ ఆర్ టి గోదావరి ఆడిటోరియంలో రాష్ట్రస్థాయిలోనిర్వహించిన ఈ కార్యక్రమంలో 33 జిల్లాల నుండి మొత్తం 66 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ గామెదక్ జిల్లా శంకరంపేట ఆర్ మండలం తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థిని ఆర్తి చంద్ర వ్యవహరించడం జరిగిందని రాష్ట్రస్థాయిలో జరిగిన అవార్డు ప్రధాన ఉత్సవ కార్యక్రమంలో రాష్ట్ర సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ మదన్మోహన్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం శుభ పరిణామంగా పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి మాక్ పార్లమెంటులో ప్రజాస్వామ్య వ్యవస్థ, పార్లమెంటరీ విధానాలపై అద్భుత ప్రదబి కనపరిచి ప్రథమ స్థానాన్ని దక్కించుకోవడం ఎంతో గర్వకారణ మన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ, పార్లమెంటరీ విధానాలపై యువతకు అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో దేశానికి మంచి నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. పదవ తరగతిలో రాష్ట్ర స్థాయిలో మంచిర్యాంకు సాధించాలని భవిష్యత్తులో ఉన్నతస్థానాలకు ఎదగాలని సూచించారుఆర్తి చంద్రను ఆమెకు గైడ్ టీచర్ గా వ్యవహరించిన వ్యవహరించినటువంటి లింగమయ్య పిజిటిని , పాఠశాల ప్రిన్సిపాల్ ను, వీరికి సహకరించిన సోషల్ ఫోరం బాధ్యులు నర్సింలు మరియు రవిబాబులను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, ఏ

ఎం ఓ సుదర్శన్ మూర్తి, సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

ఎల్నినో సాకుతో కరువు సృష్టిస్తున్నారు

చిన్నకోడూరు, నవంబర్2, (ప్రజాజ్యోతి):

రిజర్వాయర్లను గోదావరి జలాలతో నింపకుండా ఎల్నినో సాకుతో కరువు సృష్టిస్తున్నారని బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎంపీ కూర మాణిక్య రెడ్డి, నాయకులు రాధాకృష్ణ శర్మ విమర్శించారు.





చిన్నకోడూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ పార్టీ శ్రేణులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం తహసిల్దార్ సలీం మియా కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాముని శ్రీనివాస్ తో కలిసి మాట్లాడుతూ వందలాది టీఎంసీల నీళ్లు ఆంధ్రకు పోతుంటే చోద్యం చూస్తున్నారని, మేడిగడ్డ నుండి ఎల్లంపల్లి కి నీళ్లు ఎత్తిపోసే అవకాశమున్న రిజర్వాయర్లలో నీళ్లు నింపడం లేదని 750 టీఎంసీల నీళ్ళు ఆంధ్రకు పోయాయన్నారు. ప్రాజెక్టులలో నీటిని నింపితే కాలేశ్వరం కూలిన అబద్దాలు ఎక్కడ బయటపడ తాయోనని నీళ్లు నింపకుండా రైతుల ఉసురుపోసుకుంటున్నా రని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయానికి సాగునీరు కాకుండా కరెంటు సైతం ఇవ్వడం లేదని రాబోయే రోజుల్లో ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. ఇప్పటికీ నీటిని నింపితే కరువు ఉండేది కాదని అనవసరంగా రాద్ధాంతం చేస్తూ రైతన్న ఇబ్బందులు గురిచేస్తున్నారన్నారు. ప్రాజెక్టులు నింపే ఛాన్స్ నేటికీ ఉందని ఇప్పటికైనా ప్రాజెక్టులను నింపి రైతులను ఆదుకో వాలన్నారు. కేసిఆర్,హరీష్ రావులపై కక్ష సాధింపులో భాగంగానే చిన్నకోడూరు మండలాన్ని కరువు మండలంలో ప్రకటించలేదన్నారు. ఇక్కడి ప్రాంతం తెలంగాణలో లేదా, ఇక్కడి రైతులు ఏం పాపం చేశారంటూ ప్రశ్నించారు. వచ్చే ఆసంగి వరి నాట్లు వేయొద్దని అరితడి పంటలు పండించాలంటూ రైతులను ఎందుకు భయపెడుతున్నార న్నారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా వెంటనే రైతాంగానికి నిధులను మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ములకల కనకరాజు, మాజీ వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య, నాయకులు మేడికాయల వెంకటేశం,రవీందర్ రెడ్డి,ఆయా గ్రామాల సర్పంచులు,విద్యార్థి,యువత సంఘాల నాయకులు పార్టీ నాయకులు,కార్యకర్తలున్నారు.

ములుగు మండల కుమ్మర సంఘం నూతన కమిటీ నియామకం

ములుగు,నవంబర్2 (ప్రజా జ్యోతి):

ములుగు మండల కుమ్మర సంఘం నూతన కమిటీని టి ఆర్ కె ఎస్ నడికుడి జయంతి రావు,వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశం,ప్ర ధాన కార్యదర్శి దయానంద్, కోశాధికారి రాజలింగం,సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రామచంద్రం,అసోసియే టెడ్ అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు.ములుగు మండల కుమ్మర సంఘం కమిటీ అధ్యక్షుడిగా శాంతి కుమార్,గౌరవ అధ్యక్షుడిగా మల్లేశం,ప్రధాన కార్యదర్శిగా రాము,కోశా ధికారిగా ఆనంద్,ఉపాధ్యక్షుడిగా యాదగిరి,ప్రచార కార్యదర్శిగా కిషన్,కార్య వర్గ సభ్యులుగా నర్సింగరావు,మల్లేశం లను ఎన్నుకున్నారు.సిద్దిపేట జిల్లా కార్యవ



నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యం

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా సివిల్ సప్లై గోదాం

చిన్నకోడూరు,నవంబర్2,(ప్రజాజ్యోతి):

ప్రభుత్వ అధికారుల, పాలకుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ ఆస్తులు ఏ విధంగా వృథాగా మారుతున్నాయో అందుకు సివిల్ సప్లై గోదాంసజీవ సాక్ష్యంగా కన్పిస్తుంది. లక్షల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి 2015లో అట్టహాసంగా ప్రారంభించిన గోదాం పూర్తిగా నిరుపయోగంగా మారి అసాంఘిక కార్యక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా



మారింది.చిన్నకోడూరు నుండి అల్లిపూర్ వెళ్లే ప్రధాన రహదారి మార్గమధ్యంలో మెట్టుపల్లి గ్రామ పంచాయతీ శివారులో పంట నిల్వల కోసం 2015లో గత ప్రభుత్వం సివిల్ సప్లై గోదామును నిర్మించింది. ప్రారంభమై ఇన్నేళ్లు గడుస్తున్నా సదరు గోదాం ఉన్నట్టు అధికారులు పూర్తిగా మరిచిపోయారని విమర్శలు వస్తున్నాయి.గత కొన్ని సంవత్సరాలుగా ఈ గిడ్డంగిని అస్సలు ఉపయోగించకపోవ డంతో భవనం పాడుబడుతుంది. గోదాం చుట్టూ పిచ్చి మొక్కలు పుట్టడంతో చీకటి పడితే చాలు మద్యం సేవించడం, పత్తాలాటకు అడ్డాగా మారి అసాంఘిక కార్యక్రమా లకు కేరాఫ్ అడ్రస్ గా తయారైంది. పాలకుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా మారిన ఈ సివిల్ సప్లై గోదాం పట్ల ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిరుపయోగంగా ఉన్న భవనాన్ని వెంటనే అందుబాటులోకి తీసుకువచ్చి ఇతర ప్రభుత్వ అవసరాలకైనా వినియోగించుకోవాలని కోరుతున్నారు. అదే విధంగా పోలీస్ పెట్రోలింగ్ పెంచి, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రాజీవ్ రహదారిపై రోడ్డు ప్రమాదం.. వ్యక్తి మృతి

కొండపాక: నవంబర్ 2 (ప్రజా జ్యోతి):–

సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. తీవ్ర గాయాలై సదరు వ్యక్తి శరీరం ఛిద్రమైనట్లు స్థానికులు తెలిపారు. మృతుడు నల్ల రంగు ప్యాంట్, నల్ల రంగు టీషర్ట్ ధరించి ఉన్నాడని పోలీసులు పేర్కొన్నారు. అలాగే మృతుని ఎడమ చేతిపై 'కిష్టయ్య' పేరుతో పచ్చబొట్టు ఉందని తెలిపారు. ఈ ఆచూకీ తెలిసినవారు ఎవరైనా ఉంటే కుకునూరు పల్లి పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే హరీష్ రావు పై అక్రమ కేసులు

డైవర్షన్ పాలిటిక్స్ మానుకొని పాలన పై దృష్టి పెట్టాలి

దేవీ రవీందర్

కొండపాక నవంబరు 2 (ప్రజా జ్యోతి):

ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే హరీష్ రావు పై అక్రమ కేసులు పెడుతున్నారని రైతుబంధు సమితి రాష్ట్ర మాజీ కోఆర్డినేటర్ దేవి రవీందర్, రైతుబంధు సమితి కొండపాక మండల మాజీ కోఆర్డినేటర్ రాగళ్ల దుర్గయ్యలు అన్నారు. సోమవారం కొండపాక మండలం వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మల్లన్న సాగర్ వద్ద బ్లాస్టింగ్ లను ప్రశ్నించినందుకు తెరపైకి ఫోన్ టాపిక్ కేసు తెచ్చి డైవర్షన్ పాలిటిక్స్ తో పబ్బం గడుపుతున్నారన్నారు. మల్లన్న సాగర్ కట్ట దగ్గర బాంబులతో పేల్చిన ఘటన గురించి తెలుసుకున్న మాజీ మంత్రి హరీష్ రావు మల్లన్న సాగర్ కట్ట సందర్శించి గ్రామపంచాయతీ ఇరిగేషన్ పోలీస్ పర్మిషన్ లేకుండా మల్లన్న సాగర్ బ్లాస్టింగ్ ఎలా చేశారని ప్రశ్నించాడన్నారు. తిప్పారం గ్రామంలో ఉన్న ఇళ్లకు పగుళ్లు వచ్చాయని అక్కడ సందర్శించిన సందర్భంగా ప్రజలు చెప్పిన మాటలు విన్న హరీష్ రావు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఫోన్ ఫోన్ టాపింగ్ కేసు తెరపైకి తీసుకువచ్చి సమస్యను పరిష్కరించకుండగా వాళ్లపై చర్యలు తీసుకోకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. ప్రాజెక్టులు నిర్మించి రైతులకు నీళ్లు అందించిన చరిత్ర గత కెసిఆర్ ప్రభుత్వానిదిని రైతుల నడ్డి విరిస్తున్న చరిత్ర రేవంత్ రెడ్డి ప్రభుత్వానిదన్నారు. ప్రభుత్వంపై పోరాడుతున్న కేటీఆర్ పై హరీష్ రావు పై అక్రమ కేసులు పెడితే భయపడేది లేదన్నారు. ఇప్పటికైనా డైవర్షన్ పాలిటిక్స్ మానుకొని పాలన పై దృష్టి పెట్టి ప్రజల కోసం పనిచేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ వి అధ్యక్షులు దుర్గా ప్రసాద్, అంకిరెడ్డి పల్లి సర్పంచ్ గాలి బాలయ్య ,మాజీ కౌన్సిలర్ శివకుమార్, పిఏసిఎస్ డైరెక్టర్ వెంకటేశం ఎస్ సి సెల్ అధ్యక్షులు దొమ్మట శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కరువు మండలాల జాబితాల్లో చేర్చకపోతే పశువులు బ్రతకవు..!

- ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్..! - వార్డు సభ్యులు పబ్బే శేఖర్





నందిగామ, నవంబర్ 02(ప్రజాజ్యోతి) : రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం లో కరువు పరస్థితి మనుషులనే కాదు మూగ జీవాలను కూడా కబళిస్తోంది. ఈ సందర్భంగా వార్డు సభ్యులు పబ్బే శేఖర్ మాట్లాడుతూ ఖరీఫ్ లో వర్షాలు సరిగ్గా లేక పోవడంతో వరి కాలువలు చెరువులు కుంటలు పూర్తిగా ఎండిపోయాయి. పొలాల్లో గడ్డి మొలవలేదు, వరి కోతలు అయిన తరువాత వచ్చే పొట్టు వరి గడ్డి కూడా సరిగ్గా రాలేదు దీంతో పశువులకు దాణా కరువైంది. ఒక ఆవు బురద గుంటలోని మురికి నీటిని తాగుతుండటం మరో ఆవు గడ్డి కోసం వెతకడం చూస్తే పరస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది. నీరు లేక మేత లేక పశువులు రోజు రోజుకి బక్క చిక్కి పోతున్నాయి పాలు ఇవ్వడం మానేశాయి. గతం లో ప్రభుత్వం కరువు సమయం లో పశువులకు ఉచితంగా గడ్డి తాగునీటితో పాటు పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేది కానీ ఈ సారి నందిగామ మండలాన్ని కరువు జాబితాల్లో కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఎండిన పంట పొలాల సర్వేను పరిశీలించిన వ్యవసాయ అధికారి

రైతులు అందుబాటులో ఉండి పంట నష్ట వివరాలు నమోదు చేయించుకోవాలి



ఆమనగల్లు, నవంబర్ 2 ప్రజాజ్యోతి : మండల పరిధిలో ఎండిన పంట పొలాల సర్వే ప్రక్రియను వ్యవసాయ శాఖ అధికారులు ముమ్మరం చేశారు. సోమవారం వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ షెడ్యూల్ ప్రకారం కోనాపూర్, శెట్టిపల్లి, పోలేపల్లి గ్రామాల్లో పర్యటించి ఎండిన పంట పొలాల సర్వేను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం రైతులు తమ గ్రామాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారులకు తమ ఎండిన పంట పొలాలను ప్రత్యక్షంగా చూపించి, పంట నష్టానికి సంబంధించిన విస్తీర్ణ వివరాలను నమోదు చేయించుకోవాలని కోరారు. సర్వే సమయంలో రైతులు సహకరించి సరైన వివరాలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోనాపూర్ సర్పంచ్ శ్రీలత, శెట్టిపల్లి సర్పంచ్ జంగమ్మ, వ్యవసాయ విస్తరణ అధికారులు భూదేవి, మీనాక్షి, ప్రభావతి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మొక్కలే భావితరాలకు జీవనాధారం!

- ఈర్లపల్లి పాఠశాలలో తువాక్కం వెల్ఫేర్ అసోసియేషన్ హరిత కార్యక్రమం
- మొక్కలు నాటి.. పచ్చదనాన్ని కాపాడాలి
- సర్పంచ్ లావణ్య రాజశేఖర్





చేవెళ్ల నవంబర్ 02 (ప్రజా జ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఈర్లపల్లి సర్పంచ్ లావణ్య రాజశేఖర్ పిలుపునిచ్చారు. తువాక్కం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈర్లపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. చెట్లు ప్రకృతికి ప్రాణాధారమని, పర్యావరణ సమతుల్యతకు దోహదపడతాయని అన్నారు. చిన్నతనం నుంచే విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన పెంపొందించాలని, నాటిన మొక్కలను బాధ్యతగా సంరక్షించాలని సూచించారు. గ్రామాల్లో పచ్చదనం పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దయాకర్, మాజీ సర్పంచ్ రాజశేఖర్, వార్డు సభ్యులు అనూష, కావలి సంతోష, సుధాకర్, ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, విజయలక్ష్మి, చైతన్య, మాధురి, తువాక్కం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి సాయి వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా పాదయాత్రలో పాల్గొన్న విక్రమ్ నాథ్, దొడ్డి నరహరి

సంఘీభావం తెలిపిన తెలంగాణ రాష్ట్ర అమిత్ షా యువ సంఘటన్ రాష్ట్ర నాయకులు



హైదరాబాద్, నవంబర్ 02 (ప్రజా జ్యోతి) : కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మహా పాదయాత్రలో తెలంగాణ రాష్ట్ర అమిత్ షా యువ సంఘటన్(ఆర్.ఏ.ఎస్.వై.ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు విక్రమ్ నాథ్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ దొడ్డి నరహరి, నాయకులు కే.ఏదుకొండలు, మునగాల సంపత్ రెడ్డి, అంకిత్ శుక్లా, ఆడే విక్రమ్, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, అరాచకవాదానికి వ్యతిరేకంగా నిర్వహించిన ఈ పాదయాత్రలో వారు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. 'ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం–అరాచకవాదాన్ని అంతం చేద్దాం'(లోకితంత్ర బచావో–అరాచకత హరావో) అనే నినాదంతో నిర్వహించిన ఈ పాదయాత్ర మధ్యాహ్నం 3 గంటలకు బషీర్‌బాగ్‌లోని నిజాం కాలేజీ ఎదురుగా ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ప్రారంభమై మోజంజాహీ మార్కెట్ వరకు కొనసాగింది. పాదయాత్ర ముగిసిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అమిత్ షా పాల్గొన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్‌తో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలు, ప్రచారాన్ని తిప్పికొట్టడం ప్రధాన లక్ష్యంగా బీజేపీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు ఓటర్ల జాబితా ప్రక్షాళన ఆవశ్యకతను ప్రజలకు వివరించడమే పాదయాత్ర ఉద్దేశమని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. పాదయాత్రకు ముందు అమిత్ షా చార్మినార్ సమీపంలోని శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొత్తపల్లి పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం అల్పాహార పథకం

• స్థానిక సర్పంచ్ జంబుల రజిత నర్సింలు • ఉప సర్పంచ్ ఎడ్ల రాములమ్మ శ్రీనివాస్





చౌదాపూర్ మండల్ (ప్రజా జ్యోతి) నవంబర్ 02 : వికారాబాద్ జిల్లా చౌదాపూర్ మండల కేంద్ర పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహార పథకం విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించే పథకంలో భాగంగా సోమవారం కొత్తపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్ మరియు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రజిత నరసింహులు ఉపసర్పంచ్ ఎడ్ల రాములమ్మ శ్రీనివాస్ పాల్గొని విద్యార్థులకు అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉదయం అల్పాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండటమే కాకుండా చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు.విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యంతో పాటు విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అలాగే శశిధర్ రెడ్డి,వార్డు సభ్యులు జోగు అలివేలు,కృష్ణయ్య,జోగు వెంకటమ్మ, శ్రీనివాస్,కటికే యాదిలాల్,జంబుల అనంతయ్య చెన్నయ్య,పీఏసీఎస్ డైరెక్టర్లు చెన్నయ్య,కర్నే సాయన్న,గాడి యాదయ్య,కర్నె ఆంజనేయులు కర్నె శ్రీనివాసులు కావలి వెంకట్ రాములు మహిళా సంఘాల అధ్యక్షురాలు పార్వతమ్మ,జంబుల నరేందర్,సోషల్ మీడియా నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మహిళా, బాలల భద్రతపై అవగాహన





పరిగి, నవంబర్ 02 (ప్రజాజ్యోతి) : మహిళలు, బాలల భద్రతే లక్ష్యంగా విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పరిగి షీసబ్ డివిజన్ షీ టీమ్ ఇన్‌చార్జి నర్సింహులు అన్నారు. జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా, పరిగి డీఎస్పీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు సోమవారం పూడూరు మండలం, చెంగోముల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కడ్మూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కడ్మూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పరిగి షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

ఈ సందర్భంగా పరిగి సబ్ డివిజన్ షీ టీమ్ ఇన్‌చార్జి నర్సింహులు, సిబ్బంది మహిళలు, బాలలపై జరుగుతున్న నేరాలు, నిర్భయ చట్టం, పోక్సో చట్టం గురించి వివరించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నివారణ, మానవ అక్రమ రవాణా, లింగ సమానత్వం, లింగ సున్నితత్వం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

అలాగే అత్యవసర సమయాల్లో డయల్ 100, మహిళల సహాయం కోసం 181, సైబర్ నేరాల ఫిర్యాదుల కోసం 1930, బాలల సహాయం కోసం 1098 నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యత, కమ్యూనిటీ పోలీసింగ్, ట్రాఫిక్ నియమాలు, బ్యాంకింగ్ ఆన్‌లైన్ మోసాలు, మద్యపాన నిషేధం, గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనపై వివరించారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య ఎదురైతే భయపడకుండా పోలీసులను సంప్రదించాలని షీ టీమ్ సిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానేశ్వరి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు, షీ టీమ్ సభ్యులు సావిత్రి, శోభ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్ ప్రత్యేక చొరవ!

• సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

• మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ముందుకు..



అబ్దుల్లాపూర్ మెట్టు / నవంబర్ 02 (ప్రజా జ్యోతి): గ్రామపంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ గ్రామ సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్ ప్రత్యేక చొరవ చూపుతున్నారు.గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, బీసీ కాలనీలోని రామోజీ ఫిలిం సిటీ కాలనీలో డ్రైనేజీ నిర్మాణ పనులకు సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్ శంకుస్థాపన చేశారు.గ్రామంలోని ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, మురుగునీటి సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. గ్రామంలోని ప్రతి కాలనీకి అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ, ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుద్ధ్య సౌకర్యాలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామస్తుల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ అబ్దుల్లాపూర్ గ్రామపంచాయతీని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ కాలనీల వారీగా సమస్యల పరిష్కారానికి ముందడుగు వేస్తుండటంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంతటి సుష్మా అశోక్ గౌడ్, పాలకవర్గ సభ్యులు, నాయకులు, గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్ రైతుల భూములకు రక్షణ కల్పించాలి.!

• రైతుల పట్ల మోసపూరిత వ్యవహారాలు

• అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలి...

• రియల్ ఎస్టేట్ మోసాలకు అడ్డుకట్ట వేయాలి

• సిపిఐ ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి కావలి సురేష్



ఇబ్రహీంపట్నం నవంబర్ 2 ప్రజాజ్యోతి : ఖానాపూర్ రైతులను మోసం చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని, సిపిఐ ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి కావలి సురేష్ డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం మండలం పరిధిలోని ఖానాపూర్ గ్రామం సర్వే నంబర్ 79లో ఉన్న లావణి పట్టా భూముల విషయంలో కొందరు బడా రియల్ ఎస్టేట్ వ్యాపారులు రైతులను మాయమాటలతో నమ్మిస్తూ, తప్పుడు హామీలతో వారి భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని కావలి సురేష్ తెలిపారు.

రైతుల పట్ల మోసపూరిత వ్యవహారాలు... :

రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని భూముల విషయంలో మోస పూరిత వ్యవహారాలకు పాల్పడితే సహించేది లేదని ఆయన పేర్కొన్నారు. కష్టపడి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న రైతుల భూములను కబ్జా చేయడానికి లేదా తప్పుడు ఒప్పందాల ద్వారా స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలి.... :

ఈ విషయంపై ఇబ్రహీంపట్నం ఆర్డీఓ తక్షణమే స్పందించి సర్వే నంబర్ 79లోని 200ఎకరాల భూములపై సమగ్ర విచారణ చేపట్టాలని, లావణి పట్టా రికార్డులను పరిశీలించాలని, రైతులకు న్యాయం చేయాలని కోరారు. విచారణ పూర్తయ్యే వరకు వివాదాస్పద భూములపై అక్రమ లావాదేవీలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, అధికారులకు కావాలి సురేష్ విజ్ఞప్తి చేశారు. రైతుల భూములకు రక్షణ కల్పించాలి.. రియల్ ఎస్టేట్ మోసాలకు అడ్డుకట్ట వేయాలని కావలి సురేష్ అన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యదర్శి బండి నర్సింహా, మండల కమిటీ సభ్యులు జంగిలి నర్సింహా, జలంధర్, తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

- తుర్కయంజాల్ చౌరస్తాలో ఓటరు లినమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన కొత్త - కుర్మ మంగమ్మ శివకుమార్

అబ్దుల్లాపూర్మెట్/ నవంబర్ 02 (ప్రజాజ్యోతి): పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు కొత్త కురుమ మంగమ్మ శివ కుమార్ పిలుపునిచ్చారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థలో తన బాధ్యతను నిర్వర్తించాలని ఆమె సూచించారు.తుర్కయంజాల్ చౌరస్తాలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కొత్తకుర్మ యశ్వంత్‌తో కలిసి ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా మంగమ్మ మాట్లాడుతూ.. పట్టభద్రుల ఓటు హక్కు ఎంతో విలువైనదని, సమాజ అభివృద్ధికి, విద్యావంతుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించేందుకు ఈ ఓటు కీలకమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను నమోదు చేసుకోవాలని, తమ స్నేహితులు, కుటుంబ సభ్యులు, పరిచయస్తులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. ఓటరు నమోదుపై నిర్లక్ష్యం చేయకుండా నిర్దిష్ట గడువులోగా ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ డివిజన్ అధ్యక్షుడు వర్సు శ్రీనివాస్, యువజన నాయకులు శివ, వెంకట్, రాఘవేంద్ర, సిద్ధు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్ట్ భీమనపల్లి శేఖర్ మృతి

గుండెపోటుతో ఆకస్మిక మరణం.. కుటుంబ సభ్యులను పరామర్శించిన జర్నలిస్టు సంఘాల నేతలు



ఎల్బీనగర్, నవంబర్ 2 (ప్రజా జ్యోతి) : ప్రజాశక్తి, సూర్య దినపత్రికల్లో ఎల్బీనగర్ నియోజకవర్గం మన్సూరాబాద్ ప్రాంతంలో జర్నలిస్టుగా పనిచేసిన భీమనపల్లి శేఖర్ ఆదివారం రాత్రి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన మృతితో జర్నలిస్టు వర్గాల్లో విషాదం నెలకొంది. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం వెలమకన్నె గ్రామంలో ఉన్న శేఖర్ భౌతికకాయానికి టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు, సీనియర్ జర్నలిస్ట్ జె. కిషన్ (రాధాకిషన్), జిల్లా సంయుక్త కార్యదర్శి గొల్లంపల్లి ఆంజనేయులు, కోశాధికారి శశిపాల్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు బాణాల మధుసూదనాచారి, చాపల శ్రీనివాస్, నర్రి రమేష్, దేవయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం శేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. భవిష్యత్తులో శేఖర్ కుటుంబానికి అండగా ఉంటామని ఐజేయూ నాయకులు భరోసా ఇచ్చారు.

ప్రతి వార్డు అభివృద్ధే లక్ష్యం!

◆ చేవెళ్ల మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం
◆ మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి
◆ 11వ వార్డు ఇబ్రహీంపల్లిలో



సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చేవెళ్ల, నవంబర్ 02(ప్రజా జ్యోతి) : మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డులో అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ చేవెళ్ల మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి అన్నారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా 11వ వార్డు ఇబ్రహీంపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె వార్డు కౌన్సిలర్ పైండ్ల మధుసూదన్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సమతా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రతి వార్డును అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రాధాన్యతని తెలిపారు. పట్టణంలోని ప్రతి వార్డులో స్థానిక అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. రహదారులు, డ్రైనేజీ తదితర మౌలిక వసతులను మెరుగుపరుస్తూ ప్రజలకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అభివృద్ధి పనుల్లో ఎక్కడా వివక్షకు తావులేకుండా అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బండారి శైలజ ఆగిరెడ్డి, మాజీ సర్పంచ్ మల్లేష్, వార్డు మెంబర్ రవీందర్ గౌడ్, చేవెళ్ల నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు చాన్ పాషా, మున్సిపల్ మైనారిటీ అధ్యక్షుడు అజీమ్, గ్రామస్తులు బాల్ రెడ్డి, దర్శన్ గౌడ్, శివకుమార్, షాబుద్దీన్, పైండ్ల ప్రశాంత్ రెడ్డి, బషీర్, సలీం, బాలయ్య, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి.!

• రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి



• సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు

ఇబ్రహీంపట్నం నవంబర్ 2 ప్రజాజ్యోతి : సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 116 ఫిర్యాదులు అందాయి. జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కిరణ్మయి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన అర్జీలను సంబంధిత శాఖల జిల్లా అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్మయి ఆదేశించారు. ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, వారి సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి 67 ఫిర్యాదులు, ఇతర శాఖలకు సంబంధించి 49 ఫిర్యాదులు అందాయి. మొత్తం 116 అర్జీలు స్వీకరించిన అధికారులు వాటిని సంబంధిత శాఖలకు పంపించి, సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారదా దేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి..

కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ బ్యూరో, నవంబర్ 2 (ప్రజాజ్యోతి):
ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చిత్రా మిశ్రా.. సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీలో ప్రజావాణి



నిర్వహించగా.. అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాసరెడ్డి, డిఆర్ఓ స్వామి.. తదితర శాఖల అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం దరఖాస్తులు 287 రాగా.. అత్యధికంగా కరీంనగర్ ఆర్డీవో కార్యాలయానికి 121, కరీంనగర్ నగర పాలికకు 45, హుజురాబాద్ ఆర్డీవో కార్యాలయానికి 39 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కోర్టు కేసులు, లోకాయుక్త కేసులు, ఎన్ హెచ్ఆర్సీ, విద్యా సంబంధిత దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఆయా మండలాలు రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం తో పాటు అధికారుల పనితీరును డిఆర్వో స్వయంగా పర్యవేక్షిస్తారని తెలిపారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల ,నవంబర్ 02 (ప్రజాజ్యోతి):
ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి సత్వరమే పరిష్కరించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో



నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వస్తున్నారని, అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్దిష్ట సమయంలో పరిష్కరించాలని సూచించారు. ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 75 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. సమస్యలను పరిష్కరించడంతో పాటు దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ, డిఆర్ఓ కె. వై ప్రసాద్, ఆర్డీవోలు మధుసూదన్, జీవాకర్ రెడ్డి, నరసింహా రావు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నవంబర్ 6న ఆయుష్ మల్టీ పర్పస్ వర్కర్ల రాత పరీక్ష

జగిత్యాల,నవంబర్02 (ప్రజాజ్యోతి):



జగిత్యాల జిల్లా ఆయుష్ విభాగంలో మల్టీ పర్పస్ వర్కర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వచ్చే నెల (నవంబర్) 6వ తేదీన రాత పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. ఈ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు నవంబర్ 6వ తేదీ ఉదయం 11:00 గంటలకు జగిత్యాల కలెక్టరేట్ సముదాయంలోని సమావేశ మందిరం (రూమ్ నెం. 38)లో ఈ పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా నిర్దిష్ట సమయానికి 15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.

మొక్కజొన్న సంచుల డబ్బులేవీ?

రూ.10 వేల కోసం రైతు ఎదురుచూపులు
అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం

మల్లాపూర్, నవంబర్ 2, ప్రజా జ్యోతి:
మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో గోనె సంచుల కొరత రైతులకు ఇబ్బందిగా మారింది. సంచులు కొనుగోలు చేసి తీసుకువస్తేనే మొక్కజొన్న కొనుగోలు చేస్తామని సిబ్బంది చెప్పడంతో రైతులు సొంత డబ్బులతో సంచులు కొనుగోలు చేశారు. అయితే వాటి ఖర్చును తిరిగి చెల్లిస్తామని చెప్పి ఇప్పటివరకు చెల్లించకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మల్లాపూర్ మండలానికి చెందిన రైతు కొడూరి లావణ్య ఈ ఏడాది మే 28న కొనుగోలు కేంద్రంలో 100 క్వింటాళ్ల మొక్కజొన్న విక్రయించారు. సంచుల కొరత కారణంగా 200 గోనె సంచులను ఒక్కొక్కటి రూ.50 చొప్పున మొత్తం రూ.10 వేలకు కొనుగోలు చేశారు. మొక్కజొన్న డబ్బులతోపాటు సంచుల ఖర్చును కూడా బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని సిబ్బంది హామీ ఇచ్చినట్లు తెలిపారు. మొక్కజొన్న విక్రయించిన డబ్బులు ఖాతాలో జమ అయినప్పటికీ, సంచుల కోసం ఖర్చు చేసిన రూ.10 వేలు మాత్రం ఇప్పటికీ జమ కాలేదని పేర్కొన్నారు. ఈ విషయమై అధికారులను అడిగినా సరైన సమాధానం రావడం లేదని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి తనకు రావాల్సిన సంచుల డబ్బులు వెంటనే చెల్లించాలని ఎంపీడీవోకు వినతిపత్రం ద్వారా కోరారు.

బియ్యం వ్యాపారులు, రైస్ మిల్లులకు హెచ్చరిక

ధరల టాంపరింగ్, అక్రమ నిల్వలు చేపడితే క్రిమినల్ కేసులు!
జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్ రెడ్డి

జగిత్యాల, నవంబర్ 02 (ప్రజాజ్యోతి):
జిల్లా పరిధిలోని రైస్ మిల్లులు, హోల్‌సేల్, రిటైల్ బియ్యం వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, ఉల్లంఘిస్తే క్రిమినల్ చర్యలు తప్పవని జిల్లా పౌరసరఫరాల అధికారి స్పష్టం చేశారు. మార్కెట్‌లో బియ్యం కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా సహించేది లేదని తేల్చి చెప్పారు. పౌరసరఫరాల శాఖ క్షేత్రస్థాయి యంత్రాంగం నిరంతరం ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా వ్యాపారులు పాటించాల్సిన ముఖ్య నిబంధనలు తెలిపారు. మిల్లులు, గోదాములు, దుకాణాలలో పరిమితికి మించి అక్రమంగా బియ్యాన్ని నిల్వ ఉంచరాదు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే విక్రయించాలి.ధరల లేబుళ్లను మార్చడం చట్టరీత్యా నేరం. బ్రాండెడ్ బ్యాగులలో తక్కువ నాణ్యత గల బియ్యాన్ని నింపి వినియోగదారులను మోసం చేయకూడదు. 26 కిలోల బస్తా పేరుతో 24 లేదా 25 కిలోల బస్తాలను విక్రయిస్తే 'మోసపూరిత కొలతల చట్టం' ప్రకారం కఠిన చర్యలు ఉంటాయి. ధరల ,రోజువారీ నిల్వ వివరాలు మరియు ప్రభుత్వం నిర్ణయించిన అమ్మకం ధరల బోర్డు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలి. ట్రేడ్ లైసెన్స్ ,జీఎస్టీ మరియు ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ ప్రదర్శించాలి. రోజువారీ కొనుగోలు, అమ్మకాల వివరాలతో కూడిన రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసి సిద్ధంగా ఉంచుకోవాలి. డిప్యూటీ తహశీల్దార్లు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు క్షేత్రస్థాయిలో నిరంతరం ఆకస్మిక తనిఖీలు చేపడతారని జిల్లా పౌరసరఫరాల అధికారి తెలిపారు. గోదాముల్లో నిల్వలు, తూకాలు, ధరల బోర్డులు పరిశీలిస్తారన్నారు. నిబంధనలు ఉల్లంఘించినా, రికార్డులు సక్రమంగా లేకున్నా, నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సన్నబియ్యం ధరలకు కళ్లెం!

మూడు రకాల బియ్యానికి గరిష్ఠ ధరలు ఖరారు
నిర్ణయించిన ధరలకే విక్రయించాలి..
దుకాణాల్లో ధరల పట్టికలు ప్రదర్శించాలి
అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు
జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 2, ప్రజా జ్యోతి:
సన్నబియ్యం ధరల పెరుగుదలకు కళ్లెం వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మార్కెట్లో బియ్యం ధరలు పెంచి విక్రయించేందుకు వ్యాపారులు సిద్ధమవుతున్నారన్న నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ అప్రమత్తమైంది. వినియోగదారులపై అదనపు భారం పడకుండా మూడు రకాల సన్నబియ్యానికి గరిష్ఠ ధరలను నిర్ణయించింది. మిల్లర్లు, ట్రేడర్లు, రిటైల్ వ్యాపారులు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే బియ్యం విక్రయించాలని స్పష్టం చేసింది. నిర్ణయించిన ధరల కంటే అధికంగా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది.

కిలో సన్నబియ్యం ధర రూ.66 నుంచి రూ.79 వరకు..

ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ఠ ధరల ప్రకారం బీపీటీ, కేఎన్ఎం రకం సన్నబియ్యం కిలో రూ.66కు విక్రయించాలి. తెలంగాణ సోనా, ఆర్ఎన్ఆర్ రకం బియ్యం కిలో రూ.74కు, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకం బియ్యం కిలో రూ.79కు మించకుండా అమ్మకాలు చేపట్టాలి. ఈ ధరల వివరాలను బియ్యం మిల్లులు, హోల్‌సేల్ వ్యాపార సంస్థలు, రిటైల్ దుకాణాల వద్ద వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని పౌరసరఫరాల శాఖ ఆదేశించింది.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు..

బియ్యం నిత్యావసర వస్తువు కావడంతో ధరల పెరుగుదల సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై నేరుగా ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచి విక్రయించకుండా ప్రభుత్వం గరిష్ఠ ధరలను నిర్దేశించింది. అయితే నిర్ణయించిన ధరలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా? వ్యాపారులు నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశాలపై పర్యవేక్షణ కీలకంగా మారింది. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి అధిక ధరలకు బియ్యం విక్రయించే వ్యాపారులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాల శాఖ స్పష్టం చేసింది.

ధరల పట్టికలు ప్రదర్శించాలి..

బియ్యం కొనుగోలు చేసేందుకు దుకాణాలకు వచ్చే వినియోగదారులకు ఏ రకం బియ్యం ఎంత ధరకు లభిస్తుందో తెలిసేలా ధరల పట్టికలను తప్పనిసరిగా ప్రదర్శించాలి. నిర్ణయించిన గరిష్ఠ ధరల కంటే ఎక్కువ వసూలు చేయకుండా వ్యాపారులు నిబంధనలను పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల అమలులో నిర్లక్ష్యం వహించినా, వినియోగదారుల నుంచి



అధిక ధరలు వసూలు చేసినా సంబంధిత వ్యాపారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

నిబంధనలు పాటించాలి: జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్

ఈ విషయమై పెద్దపల్లి జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్ మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ఠ ధరల ప్రకారమే మిల్లర్లు, ట్రేడర్లు, వ్యాపారులు సన్నబియ్యం విక్రయాలు చేపట్టాలని స్పష్టం చేశారు. అన్ని దుకాణాల్లో ధరల పట్టికలను ఏర్పాటు చేసి వినియోగదారులకు ధరల వివరాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. నిర్ణయించిన ధరల కంటే అధికంగా బియ్యం విక్రయిస్తే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా ధరల నియంత్రణ చర్యలకు వ్యాపారులు సహకరించాలని ఆయన కోరారు.

పెద్దపల్లిలో రేషన్ బియ్యం నయా దందా..!

పేదల బియ్యాన్ని సేకరించి.. సంచులు మార్చి మార్కెట్లో విక్రయాలు!
వేరే సంచులలో నింపిన 22 రేషన్ బియ్యం పట్టివేత
నిందితుడిపై కేసు నమోదు
ఏయే దుకాణాలకు సరఫరా చేస్తున్నారు..?
లోతుగా విచారిస్తున్న అధికారులు

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 2, ప్రజా జ్యోతి:
పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం అక్రమ వ్యాపారానికి సరుకుగా మారుతోందా? పేదలకు చేరాల్సిన బియ్యాన్ని సేకరించి, సంచులు మార్చి మార్కెట్లో



విక్రయించే దందా సాగుతోందా? పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని సాగర్ రోడ్డులో వెలుగుచూసిన ఘటన ఈ ప్రశ్నలను తెరపైకి తెచ్చింది. రేషన్ బియ్యాన్ని ఇతర సంచుల్లో నింపుతుండగా పౌరసరఫరాల శాఖ అధికారులు దాడి చేసి 22 సంచులను పట్టుకున్నారు. పట్టుబడిన బియ్యం రేషన్ బియ్యమేనని అధికారులు నిర్ధారించారు. ఈ వ్యవహారానికి సంబంధించి బెజ్జూర్ శంకర్‌పై కేసు నమోదు చేసి చర్యలు చేపట్టారు. అయితే ఇది ఒక్క వ్యక్తికే పరిమితమైన వ్యవహారమా? లేక రేషన్ బియ్యాన్ని సేకరించి మార్కెట్లో విక్రయించే వెనుక మరెవరైనా ఉన్నారా? అన్న కోణంలో అధికారులు లోతుగా విచారణ చేపడుతున్నారు.

సంచులు మారుతున్నాయి.. బియ్యం మార్కెట్లోకి వెళ్తోందా..?

ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని సేకరించి, ఇతర సంచుల్లో నింపుతున్న వ్యవహారం వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది. పెద్దపల్లిలోని సాగర్ రోడ్డులో బెజ్జూర్ శంకర్ బియ్యాన్ని సంచుల్లో నింపుతున్న సమయంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 22 సంచుల్లో ఉన్న బియ్యాన్ని పట్టుకున్నారు. పరిశీలనలో అది రేషన్ బియ్యమని నిర్ధారణ కావడంతో సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి చర్యలు చేపట్టినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్ 'ప్రజా జ్యోతి'కి తెలిపారు.

రేషన్ బియ్యం ఎక్కడి నుంచి సేకరించారు? ఎవరి వద్ద కొనుగోలు చేశారు? సంచుల్లో నింపిన తర్వాత ఏ ప్రాంతానికి తరలించేందుకు సిద్ధం చేశారు? అనే అంశాలు ఇప్పుడు కీలకంగా మారాయి. పేదలకు పంపిణీ చేయాల్సిన బియ్యం తిరిగి వ్యాపార సరుకుగా మారుతున్న తీరు వెనుక ఉన్న వాస్తవాలను వెలికితీయాల్సిన అవసరం ఉంది.

దుకాణాల లింకులపై ఆరా..

పట్టుబడిన బియ్యాన్ని మార్కెట్లో ఏయే దుకాణాలకు తరలిస్తున్నారు? ఏ వ్యాపారుల ద్వారా విక్రయాలు చేపడుతున్నారు? ఈ వ్యవహారంలో మరికొందరి ప్రమేయం ఉందా? అనే అంశాలపై పౌరసరఫరాల శాఖ అధికారులు లోతుగా విచారణ చేపడుతున్నారు. బియ్యం సేకరణ నుంచి ప్యాకింగ్, రవాణా, విక్రయాల వరకు మొత్తం వ్యవహారాన్ని పరిశీలిస్తేనే అక్రమ వ్యాపారం వెనుక ఉన్న సంబంధాలు బయటపడే అవకాశం ఉంది.
ఒక వ్యక్తిపై కేసు నమోదు చేయడంతోనే వ్యవహారం ముగిసిపోకుండా, రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నవారు, నిల్వ చేస్తున్నవారు, తిరిగి మార్కెట్లో విక్రయిస్తున్నవారి వివరాలను కూడా అధికారులు వెలికితీయాల్సి ఉంది. పట్టుబడిన 22 సంచుల బియ్యం ఎక్కడికి వెళ్లాల్సి ఉంది? ఇప్పటికే ఇలాంటి బియ్యాన్ని ఎంత మొత్తంలో మార్కెట్లోకి తరలించారు? అనే ప్రశ్నలకు విచారణలో సమాధానాలు లభించాల్సి ఉంది.

సన్నబియ్యం ధరల వేళ.. రేషన్ బియ్యం అక్రమాలపై చర్చ..!

మరోవైపు రాష్ట్రంలో సన్నబియ్యం ధరల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి సారించిన సమయంలో ఈ ఘటన వెలుగులోకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. బీపీటీ, కేఎన్ఎం రకం బియ్యానికి కిలో రూ.66, తెలంగాణ సోనా, ఆర్ఎన్ఆర్ రకాలకు రూ.74, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకాలకు రూ.79 గరిష్ఠ ధరలు నిర్ణయించి నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వ్యాపారులు నిర్దిష్ట ధరలకు మించి విక్రయించవద్దని, ధరల పట్టికలను దుకాణాల్లో ప్రదర్శించాలని ఆదేశించింది.
ఇలాంటి పరిస్థితుల్లో రేషన్ బియ్యాన్ని సేకరించి ఇతర సంచుల్లో నింపుతున్న వ్యవహారం బయటపడటం మార్కెట్లో బియ్యం సరఫరా, విక్రయాలపై పర్యవేక్షణ అవసరాన్ని గుర్తుచేస్తోంది. అయితే పట్టుబడిన రేషన్ బియ్యాన్ని సన్నబియ్యంగా విక్రయిస్తున్నారనే విషయం ఇంకా నిర్ధారణ కాలేదు. ఈ రెండు అంశాలను కలిపి చూడకుండా, రేషన్ బియ్యం అక్రమ సేకరణ వెనుక ఉన్న వాస్తవాలను అధికారులు వెలికితీయాల్సిన అవసరం ఉంది.

పేదల బియ్యం పక్కదారి పడితే బాధ్యులెవరు..?

ప్రభుత్వం పేదలకు అందించే రేషన్ బియ్యం అక్రమంగా సేకరించబడితే, దాని వెనుక ఉన్న ప్రతి దశను గుర్తించడం ముఖ్యం. బియ్యాన్ని సేకరించే వ్యక్తులు, సంచుల్లో నింపేవారు, రవాణా చేసేవారు, కొనుగోలు చేసి విక్రయించేవారి పాత్రను పరిశీలించాలి. పెద్దపల్లి పట్టణంలో ఈ వ్యవహారం ఎంతవరకు విస్తరించింది? మరిన్ని దుకాణాలకు ఇలాంటి బియ్యం సరఫరా అవుతోందా? అనే అంశాలపై విచారణ పూర్తయితేనే అసలు దందా స్వరూపం బయటపడుతుంది.
రేషన్ బియ్యం అక్రమ వ్యాపారాన్ని అరికట్టేందుకు అధికారులు చేపడుతున్న చర్యలు ఎంతవరకు ఫలిస్తాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. పట్టుబడిన 22 సంచులతోనే ఈ వ్యవహారం ముగుస్తుందా? లేక వాటి వెనుక ఉన్న సరఫరా వ్యవస్థ కూడా వెలుగులోకి వస్తుందా? అన్నది విచారణ తేల్చాల్సి ఉంది.

ఎస్ఐఆర్-2026 ప్రక్రియ పారదర్శకంగా జరగాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి
ఏఎస్‌డీ, డిలీషన్ జాబితాలను పక్కాగా విచారించాలి
నవంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురణ

జగిత్యాల,నవంబర్02 (ప్రజాజ్యోతి):
ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్–2026) ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను



ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జగిత్యాల కలెక్టర్ బి. సత్య ప్రసాద్‌తో కలిసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏఎస్‌డీ (అబ్సెంట్, షిఫ్టెడ్, డెత్), డిలీషన్ జాబితాలను క్షుణ్ణంగా విచారించాలని, ఆధారాలు లేకుండా ఏ అర్హుడి పేరునూ తొలగించవద్దని స్పష్టం చేశారు. ఫారం–6, 7, 8 దరఖాస్తులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరిస్తూ, ప్రతి నిర్ణయానికి స్పీకింగ్ ఆర్డర్లు జారీ చేయాలన్నారు. నవంబర్ 26 నాటికి విచారణలు పూర్తి చేసి, నవంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురించాలని సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఎన్. ప్రసూనాంబ, ఆర్డీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

అమృత్ 2.0 పనుల్లో జాప్యం.. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

రాయికల్, నవంబర్ 02 (ప్రజా జ్యోతి)
రాయికల్ పట్టణంలో అమృత్ 2.0 పథకం కింద చేపట్టిన పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని 9వ వార్డు కౌన్సిలర్ బత్తిని మహేశ్వరి అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు సమర్పించారు.ఈ సందర్భంగా ఆమె



మాట్లాడుతూ.. పట్టణంలో అమృత్ 2.0 ప్రాజెక్టు పనులను గత కొన్ని రోజులుగా కాంట్రాక్టర్ నిలిపివేశారని తెలిపారు. ముఖ్యంగా 9వ వార్డులో పైపులైన్ ఏర్పాటు కోసం సీసీ రోడ్డును తవ్వి నెలలు గడుస్తున్నా తిరిగి మరమ్మతులు చేయకుండా అలాగే వదిలేశారని పేర్కొన్నారు. దీంతో వార్డు ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తవ్విన రోడ్డు కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని వివరించారు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని, అసంపూర్తిగా ఉన్న పైపులైన్ పనులతో పాటు రోడ్డు మరమ్మతులను వెంటనే పూర్తి చేయించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట నాయకుడు బత్తిని నాగరాజు ఉన్నారు.

వాటర్ ట్యాంక్ ద్వారా త్రాగునీరు అందించండి

ఎల్లారెడ్డిపేట నవంబర్ 2 (ప్రజా జ్యోతి):
ఎల్లారెడ్డిపేట మండలంలోని జై సేవాలాల్ తండాలో వాటర్ ట్యాంక్ గత



ఎనిమిది సంవత్సరాల నుండి ప్రజలకు సుక్క నీరు కూడా అందని వైనం. జై సేవాలాల్ తండా గ్రామపంచాయతీ పరిధిలో వాటర్ ట్యాంక్ కట్టి ఎనిమిది సంవత్సరాలు అవుతుంది. ఇప్పటి వరకు ఏ ఒక్క ఇంటి గాని నల్ల కనెక్షన్ ఇవ్వలేదు. పై అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా కూడా పట్టించుకోవడం లేదు. అధికారులు వస్తున్నారు పోతున్నారు ఈరోజు చేస్తాం రేపు చేస్తాం అనుకుంటూ కాలం గడుపుతున్నారు. దీనిపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని నల్ల కలెక్షన్లు ఇవ్వవలసిందిగా కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రజిత, ఉప సర్పంచ్ శ్రీనివాస్ తండా పెద్ద మనుషులు ఆవేదన వ్యక్తం చేశారు.

బైండోవర్ ఉల్లంఘనలో మహిళకు రూ.60 వేల జరిమానా

ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 2 ప్రజా జ్యోతి:
ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఎక్సైజ్ శాఖ వారిచేబైండోవర్



నిబంధనలు అతిక్రమించిన ఓ మహిళపై ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎక్సైజ్ సీఐ రెండ్ల విజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన అనరాసి పోచవ్వ గతంలో బైండోవర్ కాగా, ఆ షరతులను ఉల్లంఘించినట్లు గుర్తించారు. దీంతో ఆమెకు సోమవారం రూ.60,000 జరిమానా విధించారు. చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలతో పాటు పీడీ చట్టం ప్రయోగిస్తామని సీఐ హెచ్చరించారు.

దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి

ప్రజా వినతుల దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతోకలిసి ప్రజల అర్జీలను



స్వీకరించారు.ఖమ్మం అర్బన్ మండలం కైకొండాయిగూడెం గ్రామానికి చెందిన కే.రవీంద్ర బాబు సర్వే నెంబర్ 230 లో ఉన్న భూమి సర్వే చేసి రికార్డు మార్పు చేయగలరని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఏదులాపురం పట్టణానికి చెందిన పలువురు మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో ప్రభుత్వ ప్రోటోకాల్ ఉల్లంఘిస్తూ ఎన్నికైన ప్రజాప్రతినిధులను అవమానిస్తున్నారని వీటిని సవరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా,ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ కు రాస్తూ నిబంధనలు ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

కూసుమంచి మండలం తురకగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ బుర్ర కృష్ణ తమ గ్రామంలో కొమ్ము ఇందిరమ్మకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించడం జరిగిందని దురదృష్టవశాత్తు కుటుంబ సభ్యులందరూ మరణించినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఆ ఇంటికి చట్టబద్ధమైన హక్కు దారులు ఎవరైనా ఉన్నారు విషయాన్ని పరిశీలించాలని, చట్టపరమైన హక్కు దారులు ఎవరూ లేకపోతే మరో లబ్ధిదారుల్ని ఎంపిక చేసే పంపిణీ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పిడి హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.చింతకాని మండలం వందనం గ్రామం చెందిన ప్రజలు మత్స్య శాఖ సభ్యులు వందనం గ్రామ చెరువుకు సాగర్ ఎడమ కాలు ద్వారా నీటి సరఫరా పునరుద్ధరించి చెరువులు నింపాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఎస్ఈ ఇరిగేషన్ కు రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ప్రజావాణి కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్, డీఆర్ఓ సీహెచ్. రామ్మూర్తి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గోళ్లపాడులో కాంగ్రెస్‌కు మరింత జోష్..

బీఆర్ఎస్ నుంచి 30 కుటుంబాల చేరిక..

మంత్రి పొంగులేటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై హస్తం గూటికి

పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి

ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి : ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు గ్రామంలో బీఆర్ఎస్‌కు చెందిన 30 కుటుంబాలు ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరాయి. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార



శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై సోమవారం ఈ చేరికలు జరిగాయి. ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూ మంత్రి పొంగులేటి.. ఇందిరమ్మ ఇళ్ల శీనన్నగా మన్ననలు పొందుతున్నారని పేర్కొన్నారు. ఉచిత విద్యుత్తు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణమాఫీ, నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్ల ద్వారా ప్రజా ప్రభుత్వం సంక్షేమ పాలన అందిస్తోందన్నారు. గోళ్లపాడు గ్రామంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న అంతర్గత రహదారుల విస్తరణ, డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులు మంత్రి పొంగులేటి చొరవతో పూర్తయ్యాయని తెలిపారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో: ఆటో యూనియన్ అధ్యక్షుడు గడ్డమీద ఉపేందర్, మాజీ ఉపసర్పంచ్ దొంతిసర్పు రాంబాబు, మాజీ వార్డు సభ్యుడు చీకటిమళ్ల లక్ష్మీనారాయణ, గౌడ సంఘం నాయకుడు మడికంటి శ్రీను, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు రుద్ర మధు, ఎస్సీ నాయకుడు పొన్నెకంటి రాంబాబు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో: కాంగ్రెస్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, మండల నాయకులు మద్ది వీరారెడ్డి, మద్ది కిషోర్ రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు రుద్ర ఉపేందర్, నాయకులు తేజావత్ పంతులు నాయక్, మద్ది వెంకటరెడ్డి, మందటి వెంకటరెడ్డి, శాబాదు మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పేపర్ గా ప్రజాజ్యోతి...!

బస్తీల్లోనే కాదు.. వీధి వీధినా చర్చ...

సమస్యలపై సత్తా చాటుతున్న ప్రజాజ్యోతి...

పత్రికకు పాఠకుల ప్రశంసల వర్షం..!

వార్త అంటే ఇలా ఉండాలి.. ప్రజాజ్యోతి కథనాలకు జనం ఫిదా..!

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు.
నవంబర్ 2, (ప్రజాజ్యోతి) :

మణుగూరు పట్టణంలో ప్రజాజ్యోతి దినపత్రిక హాట్ టాపిక్ గా మారింది. ఉదయం టీ కొట్ల దగ్గర, కూరగాయల మార్కెట్ల దగ్గర, ఆటో స్టాండ్లలో ఆర్టీసీ బస్టాండ్ లలో స్థానికులు గుమిగూడి





ప్రజాజ్యోతి పేపర్ ను ఆసక్తిగా చదువుతున్నారు. ముఖ్యంగా చాపల మార్కెట్ బస్తీ సమస్యలపై వరుస కథనాలు, రాజస్థాన్ వ్యాపారస్థుల దందాల గురించి, ఐరెన్ షాపుల మాఫియా, పంచాయతీ నిధుల గోల్ మాల్, పొలిటికల్ కథనాలు తదితర వార్తలు ప్రజలను బాగా ఆకట్టుకున్నాయి. సమస్యలను ఉన్నది ఉన్నట్టుగా, భయం లేకుండా రాస్తున్న ఏకైక పత్రిక ప్రజాజ్యోతి అని స్థానిక జనాలు చర్చించుకుంటున్నారు. అధికారుల నిర్లక్ష్యాన్ని, నాయకుల తీరును కుండబద్దలు కొట్టినట్టు రాస్తున్నారని స్థానికులు మెచ్చుకుంటున్నారు. పేదవాడి గోడును పత్రికలో చూస్తుంటే తమ సమస్య తీరినట్టే అనిపిస్తోందని బస్తీ వాసులు వాపోతున్నారు. ఇలాంటి వార్తల వల్లే అధికారులు కదులుతున్నారని, నాయకులు స్పందిస్తున్నారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల కోసం పని చేసే పత్రిక ప్రజాజ్యోతి మరింత అభివృద్ధి చెందాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

సత్తుపల్లి ఆర్యవైశ్య మండల అధ్యక్షునిగా పోలిశెట్టి

సత్తుపల్లి నవంబర్02(ప్రజా జ్యోతి):

సత్తుపల్లి మండలం పట్టణ అధ్యక్షులుగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వందనపు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 2026 –





2028 సంవత్సరాలకు సత్తుపల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా పోలిశెట్టి శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వందనపు సత్యనారాయణ మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం ప్రతిష్టను ఇమ్మడింపజేస్తూ కార్యక్రమాలు నిర్వహించాలని, నూతన కార్యవర్గ సభ్యులను కోరారు. ఈ సమావేశంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సోమిశెట్టి శ్రీధర్ ఆధ్వర్యంలో 2026 – 2028 పట్టణ అధ్యక్షునిగా గుండు శ్రీనివాసరావుని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈనాటి కార్యక్రమానికి ఎన్నికల అధికారిగా అత్తులూరి పురుషోత్తమరావు వ్యవహరించగా, సమన్వయకర్తలుగా గుడిమెట్ల గాంధీ, కొత్తూరు ప్రభాకరరావు, నడిపల్లి లక్ష్మీనారాయణ, గంగిశెట్టి గంగాధర జగదీష్ కుమార్ వ్యవహరించారు. ఈ సందర్భంగా పోలిశెట్టి శివకుమార్ మాట్లాడుతూ సత్తుపల్లి పట్టణంతో పాటు, రూరల్ ప్రాంతాలను కూడా ఉత్సాహపరిచే విధంగా కార్యక్రమాలను రూపొందిస్తామని తెలిపారు. మండల ఆర్యవైశ్య సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గా బుగ్గపాడు వాస్తవ్యుడు దూపకుంట్ల వీర రాఘవులు, ప్రధాన కార్యదర్శిగా గంగారం వాస్తవ్యులు రాచమళ్ళ రామారావు, కోశాధికారిగా రుద్రాక్ష పల్లి వాస్తవ్యులు కర్పూరపుమురళీకృష్ణ నియమితులయ్యారు. నూతన కార్యవర్గాన్ని వందనపు సత్యనారాయణ, సోమిశెట్టి శ్రీధర్ శాలువాతో సత్కరించారు. గుడిమెట్ల గాంధీ, కొత్తూరు ప్రభాకర్ రావు, నడిపల్లి లక్ష్మీనారాయణ, గంగిశెట్టి జగదీష్, అత్తులూరు పురుషోత్తం, కొత్తూరు ఉమా అయ్యప్ప శ్రీను గుండు ఉమా తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎల్‌నినో నేపథ్యంలో వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక కార్యాచరణ

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన

కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 2,(ప్రజా జ్యోతి):

జిల్లాలో ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రాబోయే వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా జిల్లాలోని అన్ని ఆవాసాలకు నిరంతరాయంగా సురక్షిత తాగునీటిని సరఫరా చేసేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశాల మేరకు మిషన్ భగీరథ ప్రత్యేక డ్రైవ్ నిర్వహణ,





వేసవి తాగునీటి సరఫరా కార్యాచరణపై సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన అధ్యక్షతన జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31, 2026 వరకు చేపట్టాల్సిన ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని చేతిపంపులు, సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ మోటార్ల పనితీరును పరిశీలించి మరమ్మతులు అవసరమైన వాటిని వెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు. తాగునీటి పైప్‌లైన్లు, వాల్వుల వద్ద లీకేజీలను గుర్తించి వాటిని కూడా సరి చేయాలని, ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయర్లు, గ్రౌండ్ లెవల్ సర్వీస్ రిజర్వాయర్లు, సంపులను నిర్ణీత కాలపట్టిక ప్రకారం శుభ్రపరచాలని ఆదేశించారు.నీటి నిల్వ ట్యాంకుల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, దెబ్బతిన్న మ్యాన్‌హోల్ మూతలు, ఫ్లై ప్రూఫ్ వెంటిలేటర్లను వెంటనే మార్చాలని తెలిపారు. తాగునీటి నాణ్యతను నిర్ధారించేందుకు క్లోరినేషన్ నిర్వహించాలని, ముఖ్యంగా చివరి ఆవాసాలకు సరఫరా అయ్యే నీటిలో క్లోరిన్ అవశేష స్థాయిలను తనిఖీ చేయాలని సూచించారు. ప్రతి మండల కేంద్రంలో తగినంత బ్లీచింగ్ పౌడర్ నిల్వలు అందుబాటులో ఉంచాలని తెలిపారు.ఈ సందర్భంగా మిషన్ భగీరథ ఈఈ నళిని మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని ఆవాసాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరిశీలించి, గుర్తించిన సమస్యలను సకాలంలో పరిష్కరిస్తామని అన్నారు . ప్రతి గ్రామంలో గృహ నల్లా కనెక్షన్లు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటామని, నీటి ట్యాంకులను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం శుభ్రపరచడంతో పాటు క్లోరినేషన్, నీటి నాణ్యత పరీక్షలు నిరంతరం నిర్వహిస్తామని వివరించారు. ప్రతి మండల కేంద్రంలో బ్లీచింగ్ పౌడర్ నిల్వలు సిద్ధంగా ఉంచడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ప్రజలు తమ తాగునీటి సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు మిషన్ భగీరథ టోల్ ఫ్రీ నంబర్ 1916 పై గ్రామాలు, మండలాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు. నీటిని పొదుపుగా వినియోగించడం, వృథాను అరికట్టడం, నీటి వనరుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు.ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా చేపట్టాల్సిన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వేసవి కాలంలో జిల్లాలోని ఏ ఒక్క ఆవాసంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ విద్యా చందన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపాలెం మండలంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలి: మాజీ మంత్రి పువ్వాడ అజయ్

రఘునాథపాలెం: ప్రజా జ్యోతి:

మండలం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియను నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా తీసుకుని





వేగవంతం చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు పువ్వాడ అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఖమ్మం నియోజకవర్గంలోని రఘునాథపాలెం మండలాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి డివిజన్, ప్రతి గ్రామంలో అర్హులైన పట్టభద్రులను గుర్తించి వారి ఓటరు నమోదు వివరాలను కేసీఆర్ ప్రత్యేకంగా రూపొందించిన పార్టీ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఇందుకోసం పట్టభద్రుల డిగ్రీ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఓటరు గుర్తింపు కార్డు, మొబైల్ నంబర్‌తో పాటు దరఖాస్తు ఫారాలను సేకరించాలన్నారు. నాయకులు నేరుగా ఇళ్లకు వెళ్లి అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్ల ఏర్పడిన పరిస్థితి అని ఆరోపించారు. రాబోయే రెండేళ్లలో ప్రభుత్వ వైఫల్యాలు మరింత స్పష్టమవుతాయని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ శ్రేణులు అప్రమత్తంగా ఉంటూ నిరంతరం ప్రజలతో సంబంధాలు కొనసాగించాలని, పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని పార్టీ బలోపేతానికి, రాబోయే ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు కీలకమని పేర్కొంటూ, మిగిలిన గడువులోగా నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని నాయకులు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బచ్చు విజయ్ కుమార్, నాగండ్ల కోటేశ్వరరావు, దండా జ్యోతి రెడ్డి, కూరాకుల వలరాజు, కొనకంచి ప్రసాద్, వల్లభనేని రామారావు, వీరు నాయక్, మద్దినేని వెంకటరమణ, గుత్తా రవి, హరిప్రసాద్, పిన్ని కోటేశ్వరరావు, మెంటం రామారావు, లక్ష్మణ్ నాయక్, యాస రామారావు, పెంట్యా, శంకర్, రాజా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కోటర్ కాదు కదా.. మద్యం వాసన కూడా రానివ్వను..!

గుట్టమాల్లారం సర్పంచ్ సంచలన నిర్ణయం...

యువత భవిష్యత్ కోసం సర్పంచ్ పోరాటం...

స్థానిక బెల్ట్ షాపులపై ఉక్కుపాదం...

బెల్ట్ షాపులు ఎత్తేయండి.. లేదంటే ఊరుకునేది లేదు.. ఎంపీడీవోకు సర్పంచ్ వినతి..

తీర్మానం చేసినా పట్టించుకోని అధికారులు.. ప్రజావాణిలో సర్పంచ్ ఫైర్...

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు.
నవంబర్ 2, (ప్రజాజ్యోతి) :

కోటర్ కాదు కదా, మద్యం వాసన కూడా మా ఊర్లోకి రానివ్వనని గుట్టమాల్లారం గ్రామ సర్పంచ్ పూనం రమేష్ సంచలన నిర్ణయం చేశారు. తమ గ్రామంలో మద్యం విక్రయాలను పూర్తిగా నిషేధిస్తున్నట్లు తేల్చి చెప్పారు. ప్రజల ఆరోగ్యం, యువత భవిష్యత్తు తనకు ముఖ్యమని, మద్యం అమ్మకాలు చేస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తమ గ్రామంలో బెల్ట్ షాపుల నిర్మూలనకు గ్రామ పంచాయతీలో తీర్మానం చేసినా సంబంధిత శాఖ అధికారులు ఇంతవరకు పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సోమవారం మణుగూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయం ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీకాంత్ కు వినతిపత్రం అందజేశారు. వెంటనే తమ గ్రామంలోని అక్రమ మద్యం



అమ్మకాలను అరికట్టి, బెల్ట్ షాపులను తొలగించాలని కోరారు. మద్యం వల్ల కొన్ని కుటుంబాలు నాశనం అవుతున్నాయని, తాను సర్పంచ్ గా ఉన్నంత వరకు గ్రామంలో మద్యాన్ని అడుగుపెట్టనివ్వనని స్పష్టం చేశారు. ఎంత త్వరగా వీలైతే అంత బెల్ట్ షాప్ లను సీజ్ చేయాలని అధికారులను ఆయన కోరారు. ఏది ఏమైనా ఒక సర్పంచ్ ఈ నిర్ణయం తీసుకోవడం మణుగూరులో సంచలనం రేపుతోంది. మరి అధికారులు సర్పంచ్ నిర్ణయాన్ని అమలు చేస్తారో లేదో వేచి చూడాల్సిందే.

జేబీపి ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా

కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 2,(ప్రజా జ్యోతి):

బిరియాని దారి మళ్లించిన ఆళ్ళ మురళి ని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ జై భీమ్ రావు భారత్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ప్ల కార్డులతో ధర్నా నిర్వహించారు, అనంతరం పలువుడ్ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్ కార్యాలయంలోని



అధికారులకు అందజేశారు, ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ కొత్తగూడెం పట్టణ 3వ పోలీస్ స్టేషన్ లో నమోదు అయిన క్రైమ్ నెంబర్:202/2026 కేసులో A.1 ముద్దాయిగా ఉన్న ఆళ్ళ మురళి సివిల్ సప్లైస్ కార్పొరేషన్ వారు రైతుల దగ్గర నుండి మురళి మేనేజింగ్ పార్టనర్ గా రైస్ మిల్లర్ కు ధాన్యాన్ని అప్పగిస్తే రైస్ మిల్లర్ల వాళ్ళు మిల్లింగ్ చేసి తిరిగి బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాలి కానీ ఆళ్ళ మురళి అలా చేయకుండా రెండు సంవత్సరాల ఖరీఫ్,రబీ సీజన్ల నుండి సేకరించిన 6కోట్ల91 లక్షల రూపాయల విలువ చేసే ధాన్యాన్ని అమ్ముకున్న మురళి నీ ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు!!??మురళి గతంలో కూడా 2021,2022 లో ఇదేవిధంగా ధాన్యాన్ని మళ్లించిన విషయంలో 3నెలల క్రిందట 2కోట్ల రూపాయలు చెల్లించాడని గుర్తు చేశారు.రైతుల వద్ద నుండి మిల్లర్లు ధాన్యాన్ని సేకరించిన తర్వాత రెవెన్యూ అధికారులు 15రోజులకు ఒకసారి ఫిజికల్ వెరిఫికేషన్ నిర్వహించాలని, కానీ లక్షల రూపాయల మామూళ్ల మత్తుకు అలవాటు పడిన అధికారులు రెండు సంవత్సరాలుగా ఇంత పెద్ద బాగోతం నడుపుతున్నా చూసి చూడనట్లు వ్యవహరించారని ఆరోపించారు.జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి బియ్యం దారి మళ్లించిన ఆళ్ళ మురళి కి సహకరించిన రెవెన్యూ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిన ఆళ్ళ మురళి ని వెంటనే కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్,శంకర్,రాంబాబు, కవిత,స్వాతి తదితరులు పాల్గొన్నారు

నల్ల నర్సింహులు 33వ వర్ధంతి సభకు పద్మశాలీలు తరలిరావాలి

పద్మశాలి సంఘం మీడియా ఇన్‌చార్జి చింతకింది కృష్ణమూర్తి పిలుపు

జనగామ, నవంబర్ 2(ప్రజాజ్యోతి):

నల్ల నర్సింహులు ఆశయాలకు ఘన నివాళులర్పిస్తూ, ఆయన 33వ వర్ధంతి సభను



విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మీడియా ఇన్‌చార్జి, సీనియర్ జర్నలిస్టు చింతకింది కృష్ణమూర్తి పిలుపునిచ్చారు.

సోమవారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమాలకు పురుడు పోసిన జనగామ జిల్లా కడవెండి గ్రామానికి చెందిన పద్మశాలి ముద్దుబిడ్డ కామ్రేడ్ నల్ల నర్సింహులు సాగించిన పోరాటం తరతరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. సమాజ మార్పు కోసం ఆయన చేసిన త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. నవంబర్ 5న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించనున్న 33వ వర్ధంతి సభకు పద్మశాలీలు, చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నల్ల నర్సింహులు ఆశయాల సాధనకు ఐక్యతతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని, ప్రతి పద్మశాలీ ఈ సభను తన సొంత కార్యక్రమంగా భావించి పాల్గొనాలని కృష్ణమూర్తి విజ్ఞప్తి చేశారు.

బండ లింగంపల్లి ఉప సర్పంచ్ కి కత్తిపోట్లు

ఎల్లారెడ్డిపేట అక్టోబరు 2 (ప్రజా జ్యోతి):

ఎల్లారెడ్డిపేట మండలంలోని పెళ్లి గ్రామానికి చెందిన ఉపసర్పంచి బొడ్డు రాజు కత్తిపోట్లకు గురయ్యాడు గ్రామంలో పెయింటర్ గా పనిచేస్తున్న మెదక్ జిల్లా మీర్జా



పేటకు చెందిన అజ్మీరా శ్రీనివాస్ ఆదివారం రాత్రి సుమారు 11:30 గంటల ప్రాంతంలో ఉపసర్పంచ్ రాజు పై కత్తితో దాడి చేసినట్లు తెలిసింది గ్రామంలో శ్రీనివాసు మరికొందరు వ్యక్తుల మధ్య గొడవ జరగగా వారిని పరస్పర దాడిని ఆపేందుకు వెళ్లిన ఉపసర్పంచ్కి కత్తిపోటు గురైనట్టు సమాచారం అతన్ని స్థానిక ఎల్లారెడ్డిపేట ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు బి ఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య గుండారం కృష్ణారెడ్డి ఉప సర్పంచ్ రాజును పరామర్శించారు

రోడ్డు నిర్మాణ పనులు చేస్తుండగా కరెంట్ షాక్

వైపు వెళ్లే రోడ్డు నిర్మాణం జరుగుతోంది. ఈ పనుల్లో గ్రావెల్ కలిపే మెషిన్‌ను ఉపయోగిస్తున్నారు. అకస్మాత్తుగా ఆ మెషిన్ పైనుంచి వెళ్తున్న 11 వేల వోల్టుల హైటెన్షన్ విద్యుత్ తీగకు తగిలింది. అప్పుడు మెషిన్ ద్వారా కరెంట్ ప్రవహించి అక్కడ పని చేస్తున్న కూలీలు షాక్‌కు గురయ్యారు.పోలీసుల ప్రకారం ఐదుగురు కూలీలు స్పాట్‌లోనే మరణించగా, మరో ముగ్గురు ఆసుపత్రికి తరలించిన తర్వాత కన్నుమూశారు. ముగ్గురు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. స్థానికులు సమాచారం అందగానే సంఘటనా స్థలానికి చేరుకుని రక్షణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అంబులెన్సుల ద్వారా స్థానికులు గాయపడినవారిని ఆసుపత్రికి తరలించారు.ఈ ప్రమాదం తర్వాత గ్రామస్తులు ఆందోళనకు దిగారు. సురక్షా చర్యలు సరిగా పాటించకపోవడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. గ్రామస్థులతో మాట్లాడుతున్నారు. పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం పంపించారు.రోడ్డు నిర్మాణాల్లో హైటెన్షన్ వైర్లు ఉన్న ప్రాంతాల్లో మెషిన్లు ఉపయోగించేటప్పుడు అధిక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఈ ఘటనతో స్పష్టం అవుతుంది. కూలీల రక్షణ కోసం ప్రభుత్వాలు, కాంట్రాక్టర్లు సరైన మార్గదర్శకాలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. బాధిత కుటుంబాలకు పరిహారం అందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషాదంతో గ్రామంలో తీవ్ర దుఃఖ వాతావరణం నెలకొంది. మృతుల కుటుంబాల రోదనలతో అ ప్రాంతం మారుమ్రోగిపోతోంది. సామాన్య రోడ్డు పనులు చేసే కూలీల కుటుంబాల్లో ఈ ఘటన తీరని పెను విషాదాన్ని నింపింది. వారి కుటుంబాలను ఒక్కసారే తలక్రిందులు చేసింది. ఝుంఝునూ జిల్లాలో జరిగిన ప్రమాదంపై రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కార్మికులు విద్యుదాఘాతంతో అకాల మరణం చెందడం బాధాకరమని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు తక్షణమే అవసరమైన సహాయం అందించాలని, ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని సూచించారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ కూడా ఈ ప్రమాదంపై స్పందించారు. ఉదయ్‌పుర్‌వాటి ప్రాంతంలోని ఛాపోలీలో పలువురు కార్మికులు విద్యుదాఘాతంతో మరణించడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణ పనుల సమయంలో ఇలాంటి ప్రమాదం ఎలా జరిగిందో సమగ్రంగా దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఘటనకు ఎవరు బాధ్యులనే విషయాన్ని అధికారులు తేల్చాలని డిమాండ్ చేశారు. తమ కుటుంబ సభ్యులను కోల్పోయిన వారి పరిస్థితిని ఊహించుకుంటేనే మనసు కలచివేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తగిన పరిహారం అందించడంతో పాటు అన్ని విధాలా అండగా నిలవాలని కోరారు.

సికింద్రాబాద్‌లో 60 లక్షల నకిలీ నోట్లు స్వాధీనం..

హైదరాబాద్, నవంబర్ 02(ప్రజాజ్యోతి):

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో భారీగా నకిలీ కరెన్సీ చలామణిని రైల్వే పోలీసులు భగ్నం చేశారు. సుమారు రూ. 60 లక్షల ముఖ విలువ కలిగిన నకిలీ నోట్లను అక్రమంగా రవాణా చేస్తున్న 19 సంవత్సరాల యువకుడిని తెలంగాణ రైల్వే పోలీస్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో అరెస్ట్ చేశారు. రాజస్థాన్‌లోని బికానెర్ జిల్లాకు చెందిన 19 ఏళ్ల శివరాజన్ మహీయ ముంబై ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (రైలు నంబర్ 18519) జనరల్ కాంపార్ట్‌మెంట్‌లో ప్రయాణిస్తుండగా మధ్యాహ్నం 1:30 గంటల ప్రాంతంలో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా రూ. 500 నోట్లు12 కట్టల నకిలీ నోట్లు బయటపడ్డాయి. వీటన్నింటి మొత్తం విలువ రూ. 60 లక్షలుగా అధికారులు నిర్ధారించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. కొద్ది నెలల క్రితం శివరాజన్ మహీయకు బికానెర్‌కే చెందిన 25 ఏళ్ల ఓం ప్రకాష్‌తో పరిచయం ఏర్పడింది. నకిలీ కరెన్సీ బ్యాగును జైపూర్ నుంచి ముంబైకి సురక్షితంగా చేరిస్తే రూ. 2 లక్షల కమిషన్ ఇస్తానని ఓం ప్రకాష్ ఆశ చూపాడు. ఈ క్రమంలో అక్టోబర్ 28న జైపూర్ రైల్వే స్టేషన్‌లో నకిలీ నోట్లు ఉన్న బ్యాగును శివరాజన్‌కు అందించిన ఓం ప్రకాష్, మొదట కాచిగూడకు చేరుకుని, అక్కడ నుండి ముంబై వెళ్లాలని సూచించాడు. అక్టోబర్ 30న మైసూర్ ఎక్స్‌ప్రెస్‌లో కాచిగూడ చేరుకున్న నిందితుడు ఒక లాడ్జిలో బస చేశాడు. వరదల కారణంగా కొణార్క్ ఎక్స్‌ప్రెస్ రద్దు కావడంతో, ఓం ప్రకాష్ సూచన మేరకు ముంబై ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. రైల్వే పోలీసుల సమగ్ర తనిఖీల్లో ఈ అక్రమ రవాణా బయటపడింది. నిందితుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసిన పోలీసులు, ఈ ముఠా వెనుక ఉన్న ప్రధాన సూత్రధారి ఓం ప్రకాష్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఈ నకిలీ నోట్ల నెట్‌వర్క్ ఎక్కడి నుండి నడుస్తోంది, దేశవ్యాప్తంగా దీని వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో పోలీసులు విస్తృత దర్యాప్తు చేస్తున్నారు.

రైతు గర్జన పేరుతో బి ఆర్ ఎస్ రాజకీయ డ్రామా

రైతుల సమస్యలపై మాట్లా డకుండా కేటీఆర్ పసలేని విమర్శలు

చనాక-కొరాట బ్యారేజ్ అ వినీతిపై సమాధానం చె ప్పాలి

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆదిలాబాద్ జిల్లాకు తీవ్ర అ న్యాయం

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధులు బాలూరి గోవర్ధ న్ రెడ్డి, పసుల చంటి

ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 2,(ప్రజా జ్యోతి):

ఆదిలాబాద్‌లో ఆదివారం బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెం ట్ కేటీఆర్ నిర్వహించిన కా ర్యక్రమం రైతు గర్జన కాదని, రైతుల పేరుతో నిర్వహించి న ఒక రాజకీయ ఈవెంట్ షో (డ్రామా)మాత్రమేనని ఆ దిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పా ర్టీ అధికార ప్రతినిధులు బా లూరి గోవర్ధన్ రెడ్డి, పసుల చంటి లు విమర్శించారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యా ల యంలో నిర్వహించిన విలేక రుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ నా యకుల తీరుపై తీవ్రస్థాయి లో మండిపడ్డారు.బాలూరి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, చనాక–కొరాట బ్యారేజ్ ని ర్మాణంలో అవినీతి జరిగిన ట్లు ఆయన సొంత సోదరి కల్వకుంట్ల కవిత చేసిన ఆ రోపణలకు సమాధానం చె బుతారని ఆశిస్తే కేటీఆర్ వా టిని పక్కనపెట్టి పసలేని రా జకీయ విమర్శలు చేశారని అన్నారు. తొలుత రూ.350 కోట్లుగా అంచనా వేసిన ప్రా జెక్టు వ్యయం సుమారు రూ. 1,800 కోట్లకు చేరినా, ఆది లాబాద్ జిల్లాలో ఒక్క ఎక రానికైనా సాగునీరు అందిం చలేని పరిస్థితి ఎందుకు ఏ ర్పడిందో ప్రజలకు సమాధా నం చెప్పాలని డిమాండ్ చే శారు.హైదరాబాద్–నాగ్‌పూర్ ఇండస్ట్రియల్ కారిడార్, ట్రైపోర్ట్ ఏర్పాటు చేస్తామని గతంలో హామీలు ఇచ్చిన కే సీఆర్ ప్రభుత్వం కనీసం ఒ క్క ఎకరం భూమిని కూడా సేకరించలేకపోయిందని బా లూరి గోవర్ధన్ రెడ్డిఅన్నారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆదిలా బాద్ జిల్లా అభివృద్ధికి ఇం డస్ట్రియల్ కారిడార్ వంటి కీలక ప్రాజెక్టులపై ప్రభుత్వం ముందడుగు వేస్తోందని తె లిపారు.రాష్ట్రంలో అప్పుల భారం ఉన్నప్పటికీ రైతులు పండించిన పంటను, ప్రతి గింజను కొనుగోలు చేసేం దుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృ షి చేస్తోందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాన్ని బ డే బై చోబే బాయ్ అనడం వింతగా ఉందని, కెసిఆర్



హయాంలో కేంద్ర ప్రభుత్వం తో ఘర్షణ దిగి రాష్ట్రానికి అన్యాయం చేశారని, కానీ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్ర భుత్వం ముఖ్యమంత్రి రేవం త్ రెడ్డి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలను, బీజే పీ సిద్ధాంతాలను వ్యతిరేకం గా రాజకీయ పోరాటాలు చేస్తూనే, రాష్ట్ర ప్రయోజనా ల కోసం కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ని అభివృద్ధి పనులకు నిధు లు సాధించడం ముఖ్యమం త్రి పరిపాలనా దక్షతకు ని దర్శనమని అన్నారు. ము ఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఎ క్కడా క్రాప్ హాలిడే ప్రకటించ లేదని, బోర్లలో నీరు ఉన్న రై తులు వ్యవసాయం చేసుకో వచ్చని, ప్రాజెక్టుల కింద సా గునీటిని వినియోగించుకునే రైతులు డిసెంబర్ 31లోపు మూడో తడి అందేలా పంట ల ప్రణాళిక చేసుకోవా లని మాత్రమే సూచించారని బా లూరి గోవర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. రైతులను తప్పుదో వ పట్టించి ప్రభుత్వంపై వ్య తిరేకత పెంచాలనే ఉద్దేశం తో కేటీఆర్ అసత్య ప్రచారం చేస్తున్నారని డానికి, తమ బలాన్ని ప్రద ర్శించడానికి వచ్చినట్లు ఉం దని విమర్శించారు.కేసీఆర్ పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉ న్న సమయంలో ఆదిలాబా ద్ జిల్లాను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, కడెం ప్రాజెక్టును కాపాడలేకపోవడంతో పా టు కుప్టి ప్రాజెక్టును నిర్మించ లేకపోయారని, అలాగే చి క్కాన్ ప్రాజెక్టు వంటి ప్రాజెక్టు లను కూడా పూర్తి చేయలేక పోయారని విమర్శించారు. జిల్లాకు ఉపయోగపడే సా గునీటి ప్రాజెక్టుల కంటే కాళే శ్వరం ప్రాజెక్టు పేరుతో రాజ కీయ ప్రచారానికే బీఆర్ఎస్ ప్రాధాన్యత ఇచ్చిందని ఆరో పించారు. రైతు కుటుంబాల కు ప్రభుత్వం అండగా లేద ని బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారాన్ని ఖండి స్తూ, రైతు బీమా పథకం ద్వారా అర్హులైన రైతు కు టుంబాలకు ప్రభుత్వం ఆర్థి క భరోసా కల్పిస్తోందని తెలి పారు.కేసీఆర్, కేటీఆర్ హ యాంలో ఆదిలాబాద్ జిల్లా కు ప్రత్యేకంగా ఎలాంటి ప్రా ధాన్యత ఇవ్వలేదని, సిద్దిపే ట, గజ్వేల్, సిరిసిల్ల ప్రాంతా లకే అభివృద్ధిని పరిమితం చేశారని ఆరోపించారు. యూరియా సరఫరా, యాప్ విధానం విషయంలో కూడా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర ప్రభు త్వంపై నెట్టడం సరికాదని అన్నారు.

రైతులు యూరి యా కోసం ఇబ్బందులు ప డకుండా ఇంటి నుంచే పొం దేలా ప్రభుత్వం చర్యలు చే పడుతోందని తెలిపారు. ప్ర పంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్ర భావం ఉందని, దేశంలోని పలు రాష్ట్రాల్లోనూ వాతావ రణ పరిస్థితుల కారణంగా పంటలపై ప్రభావం పడుతోం దని, తెలంగాణలో మాత్ర మే కరువు పరిస్థితులు ఉ న్నట్లు బీఆర్ఎస్ నాయకు లు ప్రచారం చేయడం సరి కాదని పసుల చంటి అన్నా రు. కరువు ప్రభావిత ప్రాం తాల్లో కరువు మండలాల ప్ర కటనతో పాటు రైతులకు ఆ ర్థిక సహాయం అందించేందు కు రాష్ట్ర ప్రభుత్వం కృషి చే స్తోందని వివరించారు. కే ంద్రం నుంచి తెలంగాణకు రా వాల్సిన నిధులు, రాష్ట్ర ప్ర యోజనాల కోసం రాజకీ యాలకు అతీతంగా కలిసి కేంద్ర ప్రభుత్వం బిజెపి పై పోరాడేందుకు కాంగ్రెస్ ప్రభు త్వం సిద్ధంగా ఉందని, అ యితే రాజకీయ లబ్ధి కోసం ప్రజలను తప్పుదోవ పట్టిం చడం బీఆర్ఎస్ నాయకు లు మానుకోవాలని ఆయన హితవు పలికారు.రైతుల స మస్యలపై నిజమైన చిత్తశు ద్ధి ఉంటే గత పదేళ్ల పాలన లో చేసిన అభివృద్ధి ఏమి టో, చనాక–కొరాట బ్యారేజ్ ద్వారా ఒక్క ఎకరానికైనా సాగునీరు ఎందుకు అందిం చలేకపోయారో కేటీఆర్ ప్ర జలకు వివరిం చాలని ఇరు వురు నాయకులు డిమాండ్ చేశారు. రైతుల సమస్యల కు పరిష్కారం చూపించడ మే నిజమైన రైతు గర్జన త ప్ప, ప్రజలతో చప్పట్లు కొ ట్టించుకోవడం కాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ అ ల్లూరి సంజీవరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కీజర్ పాషా, జిల్లా కాంగ్రెస్ ఆర్గనై జేషన్ ఇన్చార్జ్ బెజ్జంకి అని ల్ కుమార్, జిల్లా కాంగ్రెస్ సెక్రెటరీ మావల సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖర్, గోనెల స్వామి, యూత్ కాంగ్రెస్ ప ట్టణ అధ్యక్షుడు సుగత్, పట్టణంలోని వార్డు ప్రెసిడెం ట్లు సంతోష్, ఫహీం, టౌన్ కాంగ్రెస్ సెక్రెటరీ ఆదిల్, రా జా రెడ్డి, కాంగ్రెస్ నాయకు లు కార్యకర్తలు పాల్గొన్నా రు.



రోడ్లపై చెత్త కనిపించకూడదు

మొదటిపేజీ తరువాయి..

చేసుకుంటూ పారిశుద్ధ్యాన్ని కాపాడాలని దిశానిర్దేశం చేశారు. ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. సృజన ఈ సమావేశంలో పాల్గొన్నారు. నగరంలో విస్తరిస్తున్న నిర్మాణ రంగ పనులు, పార్కుల సంరక్షణ, ల్యాండ్‌స్కేపింగ్, తోటల పెంపకం వంటి అవసరాల కోసం విలువైన తాగునీటిని వాడటం తగ్గించాలని ముఖ్యమంత్రి సూచించారు. మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) ద్వారా రీసైకిల్ చేసిన నీటిని సరఫరా చేసేందుకు అందుబాటులోకి తెచ్చిన 'డయల్ గ్రీన్ ట్యాంకర్' సేవలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.జలమండలి తొలి విడతగా 19 ఎస్టీపీల నుంచి 28 గ్రీన్ వాటర్ ట్యాంకర్ల ద్వారా ఈ సేవలను ప్రారంభించిందని గుర్తుచేశారు. జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్, మల్కాజిగిరి పరిధిలో కూడా ఈ గ్రీన్ వాటర్ సరఫరాను మరింత విస్తరించాలని సీఎం స్పష్టం చేశారు. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా నగరంలో సిగ్నల్ ఫ్రీ రవాణా వ్యవస్థను రూపొందించాలని ఆదేశించారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో అవసరమైన చోట అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. వాహనాల రాకపోకలు సాఫీగా సాగేలా చూడాలని, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పనులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. నిర్మాణ రంగం, గ్రీనరీ మెయింటెనెన్స్, పార్కుల అభివృద్ధి వంటి అవసరాలకు తాగునీటిని ఉపయోగిస్తున్నారని, దీనికి బదులుగా ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని వినియోగించడం ద్వారా తాగునీటిని ఆదా చేయవచ్చని సీఎం అభిప్రాయపడ్డారు. జలమండలి తొలివిడతలో 19 ఎస్టీపీ నుంచి 28 గ్రీన్ వాటర్ ట్యాంకర్ల ద్వారా సేవలు అందుబాటులోకి తీసుకొచ్చిందని గుర్తు చేశారు. జీహెచ్ఎంసీతో పాటు సీఎంసీ, ఎంఎంసీ పరిధిలో గ్రీన్ వాటర్ సరఫరాను మరింత విస్తరించాలని సీఎం సూచించారు. నగరంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టి ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సిగ్నల్ ఫ్రీ వ్యవస్థను తీసుకురావడానికి అవసరమైన చోట అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్‌లను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సాధ్యమైనంత వరకు సిగ్నళ్ల వద్ద ట్రాఫిక్ నిలిచిపోకుండా వాహనాల రాకపోకలు నిరంతరాయంగా కొనసాగేలా చూడాలన్నారు. సమీక్షా సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ఉన్నతాధికారులు మాణిక్ రాజ్, సర్ఫరాజ్ అహ్మద్, జి. సృజన, తదితరులు పాల్గొన్నారు.

మెట్రో రెండో దశకు 275 కోట్లు మంజూరు

మొదటిపేజీ తరువాయి..

ఆర్థిక అవసరాలను కొంతవరకు సమకూర్చడంతో పాటు విస్తరణ పనులపై ముందడుగు వేసేందుకు అవకాశం ఏర్పడనుంది. హైదరాబాద్‌లో ప్రస్తుతం ఉన్న మెట్రో మార్గాలు నగరంలోని కొన్ని ప్రధాన ప్రాంతాలకే పరిమితమయ్యాయి. ఐటీ కారిడార్, పాతబస్తీ, శివారు ప్రాంతాలు, విమానాశ్రయ మార్గం వంటి ప్రాంతాలకు మెట్రో సేవలను విస్తరించాలనే డిమాండ్ చాలాకాలంగా ఉంది. ఈ నేపథ్యంలో రెండో దశ ప్రాజెక్టుపై నగరవాసులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. హైదరాబాద్ మెట్రో రెండో దశలో భాగంగా తొలుత ఐదు కారిడార్లను 76.4 కిలోమీటర్ల మేర విస్తరించే ప్రతిపాదన రూపొందించారు. ఈ ప్రాజెక్టుకు అంచనా వ్యయం రూ.24,269 కోట్లు కాగా.. ఈ 5 కారిడార్ల ప్రతిపాదనను 2024లో తెలంగాణ ప్రభుత్వం



పరిపాలనాపరంగా ఆమోదించి.. కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. ఆ తర్వాత నగర విస్తరణ, పెరుగుతున్న ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని 7 కారిడార్లతో 122.9 కిలోమీటర్ల విస్తరణకు.. రూ.38,595 కోట్ల అంచనా వ్యయంతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను కేంద్రానికి సమర్పించినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మే నెలలో వెల్లడించింది. ఈ ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా కోరారు. రెండో దశలో భాగంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో కనెక్టివిటీ, పశ్చిమ హైదరాబాద్‌లోని కోకాపేట నియోపోలిస్ ప్రాంతానికి విస్తరణ, పాతబస్తీలో చాంద్రాయణగుట్ట వరకు మెట్రో మార్గం వంటి ప్రతిపాదనలు ఉన్నాయి. అలాగే మియాపూర్ నుంచి పటాన్‌చెరు, ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ మార్గాల్లోనూ మెట్రో సేవలను విస్తరించే ప్రణాళిక ఉంది. మేడ్చల్, శామీర్‌పేట ప్రాంతాలకు మెట్రో కనెక్టివిటీ కల్పించే కారిడార్లను కూడా చేర్చారు. ఈ మార్గాలు అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నగరంలోని ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, రోజువారీ ప్రయాణికులకు రవాణా సౌకర్యం మెరుగుపడే అవకాశం ఉంది. ముఖ్యంగా రోడ్లపై వాహనాల రద్దీ తగ్గించడంతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల మధ్య ప్రయాణానికి ప్రజా రవాణా ప్రత్యామ్నాయం పెరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంటోంది. తాజాగా కేటాయించిన రూ.275 కోట్లతో మెట్రో విస్తరణకు సంబంధించిన ఆర్థిక కార్యాచరణలో ఒక కీలక ముందడుగుగా రేవంత్ సర్కార్ భావిస్తోంది. అయితే రూ.24,269 కోట్ల అంచనా వ్యయమున్న 5 కారిడార్ల ప్రాజెక్టు.. రూ.38,595 కోట్ల విస్తృత ప్రతిపాదన మొత్తం అమలుకు ఇంకా భారీ స్థాయిలో నిధులు, అనుమతులు, నిర్మాణ ఒప్పందాలు అవసరం కానున్నాయి.

దీపావళి రోజు బాణాసంచా కాల్చుకోవచ్చు

మొదటిపేజీ తరువాయి..

నిర్ణీత వేళల్లో మాత్రమే ఈ గ్రీన్ క్రాకర్లను ఉపయోగించాలని స్పష్టం చేసింది.. సుప్రీంకోర్టు. పర్యావరణ పరిరక్షణ, గాలి నాణ్యతను దృష్టిలో ఉంచుకుని సాధారణ బాణసంచాపై నిషేధం కొనసాగుతుండగా, తక్కువ రసాయన ఉద్గారాలను వెలువరించే



హరిత బాణసంచాకు మాత్రమే సుప్రీంకోర్టు ఈ ప్రత్యేక మినహాయింపు ఇచ్చింది. పండుగ సమయాల్లో వాయు కాలుష్యం పెరగకుండా చూడటంలో భాగంగా సాధారణ బాణాసంచాపై నిషేధం విధించింది. సుప్రీంకోర్టు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం నిర్దేశిత తేదీలలో అంటే ఈ నెల 7,8 తేదీల్లో ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు, అలాగే రాత్రి 8 గంటల నుంచి 10 గంటల మధ్య మాత్రమే బాణసంచా కాల్చడానికి సమయం కేటాయించాల్సి ఉంటుంది. గత ఏడాది అక్టోబర్ 15న సుప్రీంకోర్టు వెలువడించిన ఆదేశాలకు అనుగుణంగానే తాజా నిర్ణయం అమలులోకి వస్తుంది. నిబంధనలను అతిక్రమించి నిర్ణీత సమయం దాటిన తర్వాత బాణసంచా కాల్చడం చట్టరీత్యా నేరమని, నిర్ణీత సమయాన్ని ప్రజలు ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేసింది. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ భద్రతను పరిగణనలోకి తీసుకుని సుప్రీంకోర్టు కొన్ని ఆంక్షలను విధించింది. ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు, ప్రాథమిక, జిల్లా ఆరోగ్య కేంద్రాలు, వృద్ధాశ్రమాలు, సైలెంట్ జోన్లు, విద్యాసంస్థల చుట్టూ 300 మీటర్ల పరిధిలో ఎలాంటి బాణసంచా కాల్చకూడదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఆయా ప్రాంతాల్లో గ్రీన్ క్రాకర్స్ కాల్చడం కూడా నిషేధమే. తీవ్ర ఆరోగ్య సమస్యలు ఉన్న రోగులు, చిన్నారులు, వృద్ధులకు ధ్వని, పొగ వల్ల అసౌకర్యం కలగకుండా ఈ 300 మీటర్ల పరిమితి నిబంధనను కఠినంగా అమలు చేయాలని ఆదేశించింది. ఈ ప్రాంతాలను నో క్రాకర్ జోన్లుగా ప్రకటించాలని, ప్రజలకు స్పష్టంగా కనిపించేలా బోర్డులను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు స్థానిక అధికారులను ఆదేశించింది. విస్తృత ప్రచార కార్యక్రమాల ద్వారా ఈ ఆంక్షలపై పౌరుల్లో పూర్తి అవగాహన పెంపొందించాలని సూచించింది.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967